# ఔనత్య జీవన సరళి

## Abundant Life



ఇది సాధ్యమా?

ఎలా?

ERIC H. H. CHANG

# ఔనత్య
# జీవన సరళి

ఇది సాధ్యమా?
ఎలా?

రచన :
రెవ. ఎరిక్ హెచ్.హెచ్. చాంగ్

Abundant life
copy right © 2004 Ericchang

# ఔనత్య జీవనసరళి

**అనువాదము :**
**శ్రీమతి కె.ఎ. స్వర్ణవల్లి (Smt. K.A. Swarna Valli)**
**శ్రీమతి శరణ్య రాజబాబు (Smt. Saranya Raja babu)**

ఎడిటర్ : శ్రీమతి కె.ఎ. స్వర్ణవల్లి
కవరు పేజి : జెఫ్రీ లోకిటో
Lay out : డి. జయప్రకాశ్
Contact : cdcf@rediffmail.com
Website : christiandiscipleschurch.org

వెల :

ప్రతుల కొరకు :
బెరాకా లిటరేచర్ సెంటర్,
సుకర్లబాద్, జిల్లాకోర్టు సెంటర్ దగ్గర, మచిలీపట్నం
ఫోన్ : 9849183626

**ముద్రణ : గాస్పెల్ గ్రాఫిక్స్, విజయవాడ - 10. ఫోన్ : 9392106223**

# విషయ సూచిక


| | | పేజీ నం |
|---|---|---|
| | పరిచయము.......... | **5** |
| ప్రసంగము 1 | **సమృద్ధి జీవము** | **7** |
| ప్రసంగము 2 | **సంతోష రహస్యము (హృదయ శుద్ధిగలవాడు సంతోషభరితుడు)** | **23** |
| ప్రసంగము 3 | **నాకున్న ఒక స్వప్నం** | **37** |
| ప్రసంగము 4 | **నీవు జీవించేది దేనికొరకు?** | **53** |
| ప్రసంగము 5 | **దేవుడినే స్నేహితునిగా కలిగియుండుట** | **65** |

# పరిచయం

ఫిబ్రవరి 1995 నుండి డిసెంబరు 1996 మధ్యకాలములో పాస్టరు ఎరిక్ చాంగ్ గారిచే ప్రసంగించబడిన ఐదు ప్రసంగముల అనువాదమే ఈ పుస్తకము. ఈ ప్రసంగమాలికలో ఆయన, అంతరంగ సమృద్ధిజీవము అంటే ఏమిటి? ఎలా క్రైస్తవజీవితములో కనపడవలసిన ఈ సమృద్ధిజీవము వాస్తవం కాగలదు అన్న విషయము వివరించారు. ఏ విషయమైన ఆటంకాలు అడ్డువస్తాయో కూడా ఆయన ఈ సందర్భములో తెలియచేసారు. పాస్టరు ఎరిక్‌చాంగ్ మన చుట్టూ ఉన్న సాధారణ దైనందిన అనుభవాలు, లోక ప్రసిద్ధ సంఘటనలు, ఉదాహరణకు తీసుకొని వాటినుండి ముఖ్యమైన ఆత్మీయ సూత్రాలను విపుల పరిచారు. మనము ఈ సూత్రాలను అనుసరించి, వాటి ప్రకారంగా జీవిస్తే, మన జీవితాలలోని నిర్దిష్ట పరిణామాలను అందరూ గమనించగలరు.

మన ఈ తరములో క్రైస్తవ్యము అంటే క్రీస్తే రక్షకుడని అంగీకరించి, ఆయన యందు విశ్వసించుట, ఇది కీలకమైనది. మరియు మనము వొక్కాణించేది. ఇది పరమ సత్యము. యేసు "తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించుటకు" వచ్చెను. (మత్తయి 1:21), కాని విచారకరమైన దేమిటంటే, క్రైస్తవులు (ఆయన ప్రజలు) అని తమను తాము పిలుచుకొనేవారు, పాప అంధకార బంధకములనుండి, ఇంకా విడుదలకాకపోవడము అనేకులు గమనిస్తున్నారు. పాప బంధకాల జీవితము ఆ స్వభావాలను, వైఖరులను ముఖ్యముగా పేరాశ లేక అత్యాశ, స్వార్థపరత్వము స్పష్టంగా చూపిస్తుంటుంది. విభిన్న కారణాలవల్ల చాలా మందికి వాళ్ళు జీవించేది, వాళ్ళు జీవించవలసిన విశ్వాస జీవితానికి పరస్పర విరుద్ధంగా ఉందని తెలియదు. తెలిసికొనిన వాళ్ళకి ఈ పరస్పర విరుద్ధమైన జీవిత స్థితి నుండి బయటపడే మార్గము తెలియదు. కాబట్టి వాళ్ళు యేసు బోధించినవి ఈ కాలములో ఆచరించుట దుర్లభము, అసాధ్యము అనే భావనకు

దాసోహులయ్యారు. లేదా వారు దేవుని వాక్యములో విశ్వసించడానికి, ఇష్టమైన కొన్ని వచనభాగాలను ఎంచుకొంటారు. కాని విచారకరమైన సంగతి క్రైస్తవులు కపటములో జీవించడము చూస్తాము. పైకి భక్తిగల వారి వలె ఉండి, భక్తిగల మాటలతోనే మునిగి ఉంటారు. కాని ఆ భక్తి అంతరంగ జీవితములో ఉండదు అంటే వీరు మొదట దేవునితో వారి సంబంధానికి ప్రాముఖ్యత ఇవ్వకుండా, బాహ్యాపరమైన విషయాలు, సాధించాల్సిన కార్యాల గురించి ఎక్కువ ఆసక్తి కలిగి ఉంటారు.

కాని, క్రీస్తులోని జీవితములో క్రొత్తగా ఈ సంతోషపులోతులను అనుభవించిన వారికొరకు దేవుని స్తుతించుదాము. వాళ్ళు యేసు చెప్పిన, "పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యము." (అపొ.కార్యము 20:35) అన్న మాటలను మనస్ఫూర్తిగా విశ్వసించుట వల్ల, వారు చూపే ప్రేమ ద్వారా ఇతరులపై నిరంతరము చెరగని ముద్ర వేస్తారు. ఇటువంటి వారి సంఖ్య చాలా తక్కువ అయినా, వారి అనుదిన జీవితము, యేసు చెప్పిన బోధననుసరించి జీవించగలము, అని నిరూపిస్తుంది. ప్రస్తుత సంఘము యొక్క ఆత్మీయ స్థితిని చూసి విశ్వాసులు మరియు అవిశ్వాసులు కూడా క్రీస్తులోని సమృద్ధిజీవము వాస్తవికతలో చూడడము గాని అనుభవించడము గాని జరుగుటలేదు. కాని ఈ సమృద్ధి జీవం ఆయన ప్రజలకు ఇచ్చుటకే క్రీస్తు వచ్చాడు క్రీస్తు బోధ మనలో జీవం పోసుకుంటే, మన అంతరంగం నుండి ఆ వాక్య నడిపింపును బట్టి మనం జీవించగలిగితే ఈ సమృద్ధి జీవం మనలో వాస్తవం అవుతుంది. అప్పుడు క్రీస్తు సువార్త వినువారికందరికీ నిజముగా శుభవార్త అవుతుంది.

చాలా మంది జీవితాలలో గొప్ప అంతరంగ మార్పు తీసుకురావడానికి, మరియు క్రీస్తు రాకడ అతిసమీపమైన ఈ చివరిదినాలలో ఆయన సంఘము యొక్క ఆత్మీయస్థితిని మెరుగుపరచడానికి ప్రభువు ఈ పుస్తకమును ఆయన నామమహిమార్థము వాడుకొనును గాక.

ప్రసంగము *1*

# సమృద్ధి జీవము

రక్షణ దేని గురించి అని మీరు తలంచుచున్నారు? కేవలము మునుపటి పాపములు క్షమింపబడుటయే రక్షణయా? ఖచ్చితంగా అదే అయి ఉండాలి, కాని అంతమాత్రమేనా? పరలోకములో స్థానము ఆశించడము నిమిత్తమేనా రక్షణ? ఇందులోనూ కొంత సత్యమున్నది. ఈ రెండిటిలో ఏదో ఒకటి, రక్షణగా చెప్పుటను మనము సాధారణముగా వింటూ ఉంటాము. అయితే ఈ రెండిటికి మించిన ముఖ్యమైనది, ఏదో ఉందని నేను అనుకొంటున్నాను. కాని దాని గురించి ఎవరూ మాట్లాడడము ఇంతవరకు నేను వినలేదు.

ఇందుకుగాను, యోహాను 10:10లోని భాగాన్ని ఈనాటి సందేశపు ప్రధాన అంశముగా చూద్దాము. యోహాను సువార్తను చదివిన వారికి ఈ వచనము బాగా పరిచయమైనదే. కాని ఈ వచనములో ఇమిడి ఉన్న అర్థాన్ని కొంతమట్టుకే గ్రహించడమైంది. ఇక్కడ ప్రభువైన యేసు, "గొఱ్ఱెలకు జీవము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని," అని చెప్పుచున్నాడు.

జీవము గురించి కొంతవరకు మనకు తెలుసు, అయితే ఈ సమృద్ధి జీవము అంటే ఏమిటి? ఈ సందర్భములో, ప్రభువైన

యేసు రక్షణ గురించి మాట్లాడుతున్నారు. గొఱ్ఱెలకొరకు తన ప్రాణమును పెట్టుట గురించి మాట్లాడుతూ ఆయన “మీకు జీవము కలుగుటకును, అది సమృద్ధిగా కలుగుటకును నేను నా ప్రాణమును పెడితిని (వచ్చితిని)” అని అన్నాడు. అదే రక్షణలోని ఆంతర్యము. క్రైస్తవునిగా వుండుట అనగా ఏమిటి? ఇది ఒక ఉన్నతమైన జీవన సరళికి సంబంధించినది. క్రైస్తవ్యం అంటే ఉన్నత జీవన సరళి, దానినే సమృద్ధిగా వివరించవచ్చు. అందుకే అసలు సమృద్ధి అంటే ఏమిటో అర్థం చేసికోవడము మనకు ముఖ్యము.

“సమృద్ధి” అనగా ఏమిటి? నా విద్యార్థి దశలో, నేను ఇంగ్లండులో ఉన్నప్పుడు ఒక మోటర్‌సైకిల్ నడిపేవాడిని. లండన్ చాలా విశాలమైనది. ఒక పేద విద్యార్థిగా దారి రవాణా ఖర్చులు భరించడము నాకు కష్టం. లండన్‌లో తిరగాలంటే బస్సు, రైలు టికట్టుల వెల చాలా అధికము. గతంలో బైబిలు సంస్థలో చదివిన ఒక తోటి విద్యార్థి, తను జపాన్‌దేశమునకు పరిచర్యకు వెళ్తూ, తన పాత మోటర్ సైకిలును తక్కువ ధరకు నాకు అమ్మాడు. అది బాగా భారీయైన పాతబండి, అటువంటిదొకటి నడుపుటకు చాలా బలం కావాలి. అప్పుడు నేను కొంచెం బలంగానే ఉండేవాడిని. అయినప్పటికీ, అది పడిపోతే, దానిని తిరిగి నిలబెట్టటం కొంచెం కష్టంగా ఉండేది. కాని అది చాలా ఉపయోగకరమైనదే, ఎందుకంటే దానిపై నేను చాలా తిరిగాను. దానికి చాలా తక్కువ ఇంధనము అవసరమయ్యేది, కాబట్టి కొంత డబ్బు ఆదాచేయుగలిగేవాణ్ని, కాని అటువంటి బండిని నడిపించుట, చాలా ప్రమాదకరమైనది. మూడు, నాలుగు సార్లు

నా ప్రాణము పోయినంత పనైంది. అంతేకాక వర్షమొస్తే, నా దగ్గర రెయిన్‌కోట్ లేనప్పుడు, నేను తడిసి ముద్దయ్యేవాడిని. చలికాలంలో, గాలి నేరుగా ముఖం మీద కొట్టేటప్పుడు, చల్లగా గడ్డకట్టుకు పోయేవాడిని. లండన్ అంతా ఆ బండిమీద తిరిగేటప్పుడు నేను చాలా మురికి గొట్టుకొనే వాడిని. కొన్ని సార్లు నేను కాలేజీకి చేరేసరికి, నా ముఖమంతా నల్లగాను, నేను ధరించే కళ్ళద్దాలవరకు మాత్రం కళ్ళచుట్టూ రెండు తెల్లమచ్చలుగా మారేది. మొత్తానికి ఒక పాండా ఎలుగుబంటిలా కనిపించేవాడిని. అది అతిసాధారణమైన ప్రయాణ సౌకర్యం. చాలా ప్రమాదకరమైనది. కొన్ని సార్లు తడిసిపోయి, కొన్నిసార్లు చలికి గడ్డకట్టుకుపోయి, కొన్ని సార్లు హాస్యాస్పదంగాను కూడా ఉండేవాడిని, అయితేనేమి, అది ఒక ప్రయాణసౌకర్యము.

కొన్ని సంవత్సరముల తర్వాత, నా పరిస్థితి కొంచెం మెరుగైంది. చాలా పాతదైన కారుని కొనగలిగాను. ఈ సారి వర్షం పడినా తడవకుండా, ప్రయాణం చేయగలుతున్నాను. ఇది వరకులా మోటర్‌సైకిల్ దిగినప్పుడల్లా, ఒక పాండా ఎలుగుబంటిలా కనిపించుట లేదు. అంతేకాక, ఇది కొంచెం సురక్షితమైనది, ఇంజన్ కూడా చాలా చిన్నది. నేను హైవేలో గనుక ప్రయాణించాలంటే, (ఇంగ్లాండ్‌లో మోటర్‌వే అని పిలుస్తారు) కాలు, క్రింద గట్టిగా వత్తి అదిమి పెట్టాలి. అప్పుడు పెద్ద శబ్ధంతో, అతి కష్టంగా అది వెళ్ళగలిగినంత అత్యంతవేగానికి 55 చేరుకోగలదు. ఈ వేగానికి, వాహనమంతా ఊగిపోతూ ఉంటుంది. ఎగరటానికి సిద్ధంగా ఉన్న విమానంలా ఉంటుంది. అందుకే, ఈ ఊగడము, శబ్దాలు తట్టుకోలేక వేగాన్ని 50కి తగ్గించేవాడిని, అంటే నేను నా గమ్యస్థలానికి చేరటానికి, చాలా సమయం పట్టేది.

ఇలా మోటారుసైకిలునుండి కారు - జీవనశైలి కొంత మెరుగుపడింది మౌలిక అవసరాలు తీర్చబడడం నుండి ఇంకొక స్థాయికి, దానిని సమృద్ధితో పోల్చలేము, కాని మొదటిస్థితి కంటే మెరుగైనదే.

కొన్ని సంవత్సరాల తర్వాత, ఇంకొంచెం పరిస్థితి మెరుగుపడి, మరొక కారుని కొన్నాను. ఈ కారు కూడా పాతదే, కాని పెద్ద మోటారుతో, మంచిస్థితిలో ఉంది. ఈ సారి పరిస్థితులన్నీ నాకు అనుకూలంగా ఉన్నాయి. అంచెలంచెలుగా, నేను సమృద్ధికి చేరువవుతున్నాను. ఈ ఇంజను అవసరమైన వేగాన్నివ్వగల శక్తి కలిగి వుంది. నేను ఉత్తర జర్మనీ నుండి, దక్షిణ జర్మనీకి 12 గంటల వ్యవధిలో ప్రయాణించాను. (జర్మనీ ఈ చివరినుండి ఆ చివరి వరకు). జర్మనీ ప్రధాన రహదారి మీద గంటకు 70 మైళ్ళతో నడుపుతున్నా, ఇంజన్ నిశ్శబ్దంగానే ఉంది ఇది దరిదాపు సమృద్ధి స్థితి.

మరి సమృద్ధి జీవితము అంటే ఏమిటి? పైన ఇవ్వబడిన ఉదాహరణ వలన కొంత అవగతమౌతుంది. మీ జీవితమెలా ఉంది? ఏ రోజుకారోజు గడపడము కష్టంగా ఉందా? మీరు చలికి వర్షానికి తట్టుకొంటూ ఎలాగోలాగ బ్రతికేస్తున్నారా? చలికి గడ్డకట్టకుండా, వర్షానికి తడవకుండా జీవించాలని మీరు కోరుకొంటున్నారు. మీరు మెరుగైన జీవనశైలిని కోరుకొంటున్నారు.

మంచి జీవన విధానం, దైనందిక జీవితానికి ప్రాముఖ్యమైనది. పరిశ్రమలలోను, వ్యాపార రంగంలోను, ప్రతీది మన జీవన శైలిని మెరుగు పరచేందుకే ఉద్దేశించినట్లు గమనించవచ్చు, లేని యెడల అవి మరి దేనికి ఉన్నాయి? ఒక

చిన్న ఉదాహరణ తీసుకుందాం! ఈ రోజుల్లో భోజనం పండుకొనుటకు, ఎన్ని రకాలైన పద్ధతులు అమలులో ఉన్నాయో చూద్దాం. ఇది చాలా ఆశ్చర్యకరమైనది. మనము మామూలుగా కట్టెలుకాని, బొగ్గుపొయ్యిని వాడవచ్చు లేదా గ్యాస్ పొయ్యిని వాడవచ్చు. అసలు మంటే లేకుండా వేరే విధానాలు కూడా కనుగొన్నారు. ఇలా గ్యాస్ పొయ్యి నుండి విద్యుత్ ప్లేటును చేరుకున్నాము. ఇందులో మంటే కన్పడదు. ఒక రకమైన విద్యుత్ ప్లేటు బాగా వేడెక్కి ఎర్రగా కణకణలాడడము మనము చూడగలము. ఇంకొక రకమైన విద్యుత్ ప్లేటు వేడెక్కినప్పుడు ఎర్రగా మారదు. ఇది చాలా ప్రమాదకరమైనది, ఇది వేడెక్కిన విషయం మనకు తెలియక, పొరపాటున దానిమీద చేయిపెడితే, ఆస్పత్రిపాలే. ఇలా ప్రజలు వంటచేసు కొనుటకు క్రొత్త క్రొత్త విధానాలు కనుగొంటున్నారు. ఈ రోజులలో ఇండక్షన్ కుక్కర్ (విద్యుత్ప్రేరణ) వాడుకలోకి వచ్చింది. ఇది అసలు వేడెక్కనే ఎక్కదు. రెండు సంవత్సరాల నుండి మాత్రమే మార్కెట్‌లో దొరుకుతున్న కొత్త పరికరము. కొంచెం ఖరీదైనది. ఈ ఇండక్షన్ కుక్కర్, ఒక వినూత్న సిద్ధాంతం మీద పనిచేస్తుంది. స్టీలు పాత్రలోని అణువులను ఇది ప్రేరేపితం చేయడం (ఇది స్టీల్‌తో తయారు చేయబడితేనే పనిచేస్తుంది) ద్వారా, వేడి పుడుతుంది. స్టీల్ పాత్ర మాత్రమే వేడెక్కుతుంది. కుక్కర్ వేడవ్వదు. వంట ముగించి, స్టీల్ పాత్రని బయటకు తీసేసినా, తర్వాత కూడా కుక్కర్ చల్లగానే ఉంటుంది. దీనివల్ల, ఒకవేళ పిల్లలు దానిని తాకినా చేతులు కాల్చుకొనే ప్రమాదం ఉండదు.

ఇవన్నీ మన జీవనశైలిని మెరుగు చెయ్యడానికి కాకపోతే,

ఉండి లాభం ఏమిటి? (ఇంకా కన్వెక్షన్ కుక్కర్ అని, మైకోవేల్ కుక్కర్ అని మొదలగునవెన్నో). మీరెందుకు ఉద్యోగం చేస్తున్నారు? ఎందుకు ఇంకా మంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు? రోజు రోజుకూ చిన్నగా శక్తివంతంగా రూపాంతరము చెందుతున్న కంప్యూటర్లు మనకు ఎందుకు? ఇవి మన జీవనశైలిని మెరుగుపరచడానికి, మన సౌలభ్యం కొరకు. ఇదే కాదు, వేరే విషయాలలో మనం గమనించినట్లయితే, మానవ చరిత్రలో అన్ని రకాల ఉద్యమాల వెనుక, ముందుకు నడిపిన శక్తి, ఒక మెరుగైన జీవనశైలి కొరకున్న తృష్ణయే. విప్లవాలు ఎందుకు వచ్చాయి? 200 సంవత్సరాల క్రితం ఫ్రెంచ్ విప్లవం ప్రారంభానికి కారణం ఏమిటి? బ్రతకడానికి కావలసిన మూలాధారము, రొట్టెకరువైకదా. ప్రతి విప్లవం కూడా జీవన విధానాన్ని మెరుగుపర్చుటకు ఉద్యుక్తమైనదే. చైనాలో ఎందుకు విప్లవం వచ్చింది? ప్రజలు అణగద్రొక్కబడ్డారు. రైతులు భూములు కోల్పోయారు. కాబట్టి విప్లవాలు ప్రజల జీవనశైలిని మెరుగుపరచడానికి వచ్చాయి. ఈ లక్ష్యం మీదనుండి ఎప్పుడైతే దృష్టి మళ్ళిస్తారో, అప్పుడు విప్లవం విఫలమౌతుంది. కేవలం ఉద్యమం లేపాలి అన్న ఉద్దేశ్యంతో మాత్రమే రేగిన ఉద్యమాలు, ఎవరికీ అక్కరలేదు. అవి నిరర్థకము.

చాలా మంది క్రైస్తవ్యాన్ని నమ్మడము అంటే, భవిషత్తులో పరలోకానికి వెళ్ళగలము అని అనుకుంటారు. అది సువార్తలోని ఒక చిన్న భాగము మాత్రమే. చాలా మంది క్రైస్తవ్యం అంటే గతంలో చేసిన పాపముల నుండి, క్షమాపణకు సంబంధించినది అని అనుకుంటారు. అదీ నిజమే ఎందుకంటే గతపాపములు, ప్రస్తుత జీవన ఔన్యత్యాన్ని నాశనంచేస్తాయి. గతం ప్రస్తుతం మీద ప్రభావం

చూపుతుంది. గతించిదాని నుండి నీవు విడుదల పొందకపోతే, నీ ప్రస్తుత జీవితాన్ని సంతోషంగా గడపలేవు. ఒక మత గురువుగా, ప్రతీరోజూ బాధపడేచాలామందికి సలహాలు ఇస్తూ ఉండేవాడిని. ఒకవేళ, ఇప్పుడు నీవు బాధపడుతున్నావా? నిన్ను బాధపరుస్తున్న విషయాలు ఏమిటి? ఇటువంటివి సాధారణముగా గతానికి సంబంధించినవే. దురదృష్టకరమైన బాల్యం, విడిపోయిన వివాహబంధం. వీటియొక్క ప్రభావము మీపై బలంగా ఉంటుంది. అందుకే గతపాపముల యొక్క క్షమాపణ సువార్తలోని ప్రాముఖ్యమైన భాగము. ఇది మనుష్యులకు వారి పాపములనుండి, గతములో ఉన్న బంధకాలనుండి, విడుదల కలిగించి ప్రస్తుతజీవితమును సమృద్ధిగా చేస్తుంది.

క్రైస్తవ్యం అనేది ప్రస్తుతానికి సంబంధించినది. ఈనాడు ఎటువంటి జీవితాన్ని కలిగి ఉన్నావో, నిన్ను నీవు ప్రశ్నించుకో. ఒకవేళ ఇప్పటికే నీ జీవితం ఆనందమయమై, సరియైన దిశా నిర్దేశము కలిగి, అంతరంగ ఐశ్వర్యము కలిగిఉంటే, నీకు సువార్త అవసరం లేదు. నీకు సువార్త దేనికొరకు? నీవు ఈసరికే నీకవసరమైవన్ని కలిగి ఉంటే సువార్త నీకు అర్థంలేనిదా? ప్రభువైన యేసు, "రోగులకే కదా వైద్యుడు అవసరం", అని అన్నాడు. ఆరోగ్యవంతులకు వైద్యుని అవసరం లేదు. నీవు ఆరోగ్యవంతుడవని నీవు అనుకొని, నీ అనారోగ్యం నీకు తెలియకపోతే నీకు వైద్యుడి అవసరం లేదనే అనుకొంటావు.

మనలను సమృద్ధియైన జీవము చెంతకు నడిపించాలని యేసుప్రభువు కోరుకొంటున్నాడు. ఎంత మంది క్రైస్తవులు జీవితంలోని సంపూర్ణతను అనుభవిస్తున్నారు? చాలా తక్కువ

మంది అనిచెప్పుటకు నేను సంశయించ నక్కరలేదు. మరోలా చెప్పాలంటే, అనేకమంది క్రైస్తవుల విషయంలో, ఆయన ఉద్దేశ్యము నెరవేరుటలేదు.

ఆయన, ''జీవము కలుగుటకు, అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితిని.'' అని చెప్పుచున్నాడు. అనగా మనము జీవమును సమృద్ధిగా కలిగియుండకపోతే, ఆయన రాక నిరర్ధకమయినట్లే. ఆయన మనకు ఒక నిజమైన ఐశ్వర్యకరము, సమృద్ధియైన జీవితము ఇచ్చుటకు వచ్చినప్పుడు, మనమా విధంగా జీవించని యెడల, దానికి కారణము ఏమిటి?

నిఘంటువులో సమృద్ధి అనుపదానికి రెండు నిర్వచనాలు ఇవ్వబడినవి. మొదటి నిర్వచనం, "అసాధారణమైన, విశేషమైన, అసామాన్యమైన" అనునది. అంటే నీవు సమృద్ధితో జీవిస్తున్నావంటే, నీవు జీవిస్తున్నది ఒక అసామాన్యమైన జీవితం. నీ జీవితం విశేషమైనది కూడా, ప్రజలు నీ జీవితాన్ని చూచినప్పుడు, నీ జీవితంలో ఏదో అసామాన్యమైనది ఉంది అని వారు అంటారు. చివరిసారి నీ క్రైస్తవ జీవితములో, విశేషమైనది ఏదైనా ప్రజలు గమనించారా? లేకపోతే వారు, "నీవు క్రైస్తవుడవైతే, అందులో విశేషము ఏమిటి? నేను కూడా బాగానే ఉన్నానుకదా" అంటారు, నేను క్రైస్తవుడను అగుటకు ముందు అలాగే అనుకొనేవాడిని. బాహాటంగా నేను క్రైస్తవుడను, అని చెప్పుకొనే అనేక మంది నాకు తెలుసు, కాని వారి జీవితాలలో విశేషమైనది ఏదీ నేను గమనించలేదు. అందరిలాగే వాళ్ళూ చిఱచిఱలాడేవారు. అందరిలాగానే వారిలో కూడా సంతోషం లోపించి ఉంది, నా ధ్యాసను ఆకట్టుకొనేది వాళ్ళ దగ్గర ఏదీ లేదు. అంటే నేను

సువార్త వైపు ఆకర్షితుడనవ్వడానికి, వారిలో ఏమియు లేదు.

సమృద్ధి అను పదమునకు రెండవ నిర్వచనము, 'విస్తారమైన అపరిమతమైన, అమితమైన' అనునవి. నేనింతకు మునుపు చెప్పాను, మోటరు సైకిలు నాకు అవసరానికి ఉపయోగకరమైన మౌలికమైన రవాణా సౌకర్యము. కాని, నేను చెప్పిన కారు నా అవసరానికి మించినది. అందులో ఒక హీటర్ కూడా ఉండేది వాతావరణం ఎక్కువ చల్లగా ఉన్నప్పుడు, నేను అది ఆన్‌చేసుకోగలను. ఆ సుఖం నేను మోటర్ సైకిలు మీద వెళ్ళేటప్పుడు లేదు అంటే, నా జీవితము కనీస అవసరాలు కలిగియుండడము కన్న కొంచెం మెరుగైనదన్న మాట.

మీరు క్రైస్తవులైనా, కాకపోయినా మిమ్ములను ఒక ప్రశ్న అడుగుతాను, ''మీ జీవితం ఎలా సాగుతుంది? జీవితం తృప్తికరంగా ఉందా? గత కొన్ని సంవత్సరములనుండి, నేను చైనాకి వెళ్ళినప్పుడు ప్రతీసారి, ఆ ప్రజల అంతరంగంలో శూన్యభావాన్ని గమనించాను. ఒకసారి ఒక విద్యార్ధిని, కళాశాలలో అటు ఇటు నడుస్తూ ఉండడము గమనించాను. ఆమెతో, ''నీకు ఆలోచించాల్సిన విషయాలు చాలా ఉన్నట్లున్నాయి,'' అని అన్నాను. ఆమె ''ఔను ఈ చదువంతటితో సాధించాల్సిన దేమిటో నాకు తెలియడం లేదు,'' అని అన్నాది, సూటిగా చెప్పేసింది. ఆమెవరో నాకు తెలియదు. నేను నా భార్య హెలెన్ నడకకని బయటకు వచ్చాము. ఆమె మళ్ళీ సూటిగా అదే మాట చెప్పసాగింది. ''ఇదంతా చదివి సాధించేదేమిటో నాకు తెలియడం లేదు. ఎంతో కష్టపడాలి. ఒక లక్ష్యం ఉంటే కష్టపడడంలో అర్థం ఉంది. లోకరీతి భౌతిక ఔనత్యం, అంతరంగములోని మనిషిని

తృప్తిపరచగలదా?"

సమృద్ధిలో రెండు రకాలున్నాయి, బాహ్యామైన సమృద్ధి ఒకటైతే మరొకటి అంతః సమృద్ధి. బాహ్యామైన సమృద్ధి అంతరంగ అవసరాలను తృప్తిపరచగలదా? స్పష్టమైన జవాబు లేదు. బాహ్యంగాను, అంతరంగంగాను, సమృద్ధి లేకపోవడం చాలా విచారకరమైన విషయము. అయితే, బాహ్యసమృద్ధి కలిగినవారై యుండికూడా, అత్యంత దుఃఖములోను, దీనస్థితిలోనున్న వాళ్ళూ ఉన్నారు. కెనాడాలో జీవితంపై జనాభా సంఖ్యలకు సంబంధించిన సమాచారము, ఈ మధ్యే నేను చదివాను, కెనాడా ప్రజలు దాదాపుగా అందరూ బాహ్యామైన సమృద్ధిగలవారే. ప్రతివాడు కోటీశ్వరుడనికాదు కాని, ప్రతీవారు వారికి అవసరమైనవి కలిగి ఉంటారు, లేక అవసరమైన దానికంటే కొంచెం ఎక్కువే కలిగి ఉంటారు. అయినప్పటికీ కెనడాలోని తాజాలెక్కల ప్రకారం దాదాపు మూడు మిలియన్ల మంది ప్రజలు, ఏదో ఒక విధంగా మానసికంగా కృంగిపోయి, చికిత్స తీసుకుంటూ, మందులు వాడుతూనే ఉన్నారు. మూడు మిలియన్లు? ఆ సంఖ్యను చూసి నేను అదిరిపడ్డాను. కెనడాలోని జనాబా 21-22 మిలియన్ల మంది అనగా, ప్రతి ఏడుగురిలో ఒకరు, మానసింకంగా కృంగిపోయి బాధపడుతున్నారు.

మరి బాహ్యాపరమైన సమృద్ధి హృదయపు అవసరతలు తీరుస్తుందా? ఇదిగో, పైన చెప్పిన సంఖ్యల సమాచారము సమాధానం చెప్పుతుంది - భౌతికవస్తువులు హృదయాన్ని సంతృప్తి పరచలేవు. నేను అంతరంగంలో సమృద్ధి కలిగిన పేదవారిని చూసాను. వారెంతో సంతోషంగా వున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేదు,

కాని సంతోషంగా ఉన్నారు. దీనిని బట్టి సంతోషము, అంతరంగ సమృద్ధి అనేవాటికి బాహ్యపరమైన సమృద్ధితో, ఎటువంటి సంబంధము లేదు. ఇవి అర్థం చేసుకోవలసిన చాలా ప్రాముఖ్యమైన విషయాలు. ఇదంతా కూడా జీవన ఔనత్యానికి సంబంధించినది.

యేసుక్రీస్తు ఎటువంటి జీవన సరళిని అందించు నిమిత్తమై వచ్చారో, దానికి తగినట్లుగా సంఘం జీవించేదాకా, మనకు ప్రచురించుటకు ఉపదేశము లేనట్టే. అయితే, ఎందుకు ఇంత కొద్ది మంది క్రైస్తవులు మాత్రమే, ఈ జీవనసరళిని కలిగి ఉన్నారు? దానికి కావలసిన మౌలిక నియమాలను, ఇంకా చాలామంది క్రైస్తవులు అర్థం చేసుకోలేదనుకుంట!

ఈ మధ్యే నేను మాంట్రియల్‌కు తిరిగి వచ్చినప్పుడు, నా కారు స్టార్ట్ అవ్వడానికి కొంచెం మొరాయించింది. మీకు తెలుసు కదా, నా కారు పురాతన వస్తువులలో ఒకటని! దానికి 18 ఏళ్ళు. కెనడాలో అది ఓటు హక్కుకు అర్హత పొందవచ్చునుకు ంటున్నాను. ఒక సంవత్సరము పాటు, కదిలించనందుకో ఏమో, కీ పెట్టి తిప్పితే, ఏ చలనము లేదు. బ్యాటరీ పూర్తిగా అయి పోయింది. ఈ బ్యాటరీకి ముందు జాగ్రత్త చర్యగా, నూతన టెక్నాలజీని ఉపయోగించి, సౌరశక్తితో నడిచే ప్యానెల్ రీచార్జర్‌ను కూడా అమర్చాను. గంటకు 100 మిల్లీ. ఆంపియర్లు బ్యాటరీని చార్జిచేయగలుగుతుంది, అని ఆ తయారు చేసినవాడు చెప్పాడు. కాని, అదేమీ పనిచేసినట్లుగా లేదు. నేను వెళ్ళేటప్పుడు బ్యాటరీ పూర్తిగా మంచిస్థితిలో ఉన్నా ఇప్పుడు పూర్తిగా డెడ్ అయిపోయింది. నెమ్మదిగా త్రోసుకుంటూ కారుని మెకానిక్ షాపుకు తీసుకు

వెళ్ళాను. వాళ్ళు రెండు పనులు మాత్రమే చేసి, దాన్ని బాగుచేసారు. ఒకటి ఆయిల్ మార్చారు ఎందుకంటే, ముందున్న ఆయిల్ బాగా మందమైపోయి, బరువైనందువల్ల ఇంజను కదలికలు సాధ్య పడుటలేదు. రెండవది పాత బ్యాటరీ తిరిగి చార్జ్ చేయడానికి పనికిరాదట. క్రొత్త బ్యాటరీ వేసాడు. రెండు ముఖ్యమైన మార్పులు చేయవలసి వచ్చింది. ఇంజన్ కదలికలను ఆటంకపరుస్తున్న ఆయిల్‌ను తీసివేయాలి, తరువాత అవసరమైన శక్తిని ఉత్పత్తి చేయగల ఒక క్రొత్త ఆధారం కావాలి.

చాలా మంది క్రైస్తవులు ఈ రెండిటిలో, కేవలం ఏదో ఒకటి మాత్రమే చేస్తున్నారని నేను అనుకొంటున్నాను. వారు ప్రభువు యొద్దకు వచ్చినప్పుడు, వారి పాపములు ఒప్పుకొన్నారు. గతజీవిత మలినమునుండి కడుగబడ్డారు. పాత ఆయిల్‌ను మార్చనియెడల ఇంజన్ పనిచేయదు. అక్కడ ఒక క్రొత్త బ్యాటరీ లేకపోయినా కూడా సమస్య తీరదు. క్రొత్త బ్యాటరీకి సమానమైనది ఏమిటి? శక్తికి ఒక క్రొత్త ఆధారం, చాలా మంది క్రైస్తవులలో ఇది కొరవైనట్లుంది. ప్రభువైన యేసు యోహాను 14:6లో చెప్పాడు, “నేనే జీవమును” అని. శక్తికి మూల ఆధారమైన జీవముగా, యేసు మనలో ప్రవేశిస్తే గాని, మనము ముందుకు ఎక్కువ దూరము సాగలేము.

మీలో ఈ నూతన జీవపు మూలాధారం ఉన్నాదా? కొలస్సీ 3:4లో పౌలు, ‘‘ఆయనే మన జీవము’’ అని చెప్పాడు. యేసుప్రభువు మనకొరకు ఒక అసామాన్యమైన జీవన సరళిని ఇవ్వడానికి వచ్చాడు. ఇటువంటి జీవన సరళి లేకపోతే, మన క్రైస్తవ జీవితం నిజంగా చాలా కష్టంలో ఉన్నట్లే. అంటే నూతన

జీవపు మూలాధారం మనలో లేదు అని; లేదా ఆ శక్తియొక్క స్థితి ఎంత తక్కువగా ఉందంటే, అది ఇంక ఎంతోకాలం పనిచేయలేదని అర్థం. మన జీవితాన్నే చూద్దాము. ఉదాహరణకు మనలో ఎవరికైనా వివాహ సంబంధమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా? క్రైస్తవులలో కూడా వివాహ బంధాలలో, అనేక సమస్యలు సంభవించటమనేది, నాకు చాలా కలవరాన్ని కలుగచేస్తుంది. అలాగే మీరు కుటుంబములో జీవిస్తున్నప్పుడు, సమస్యలు వస్తూనే ఉంటాయి. నీలో నీకే సమస్యలు, వాటిని నీవు ఎలా ఎదుర్కొంటున్నావు, దాని విషయం ఇంకా వేరే చెప్పక్కరలేదు. ఇటువంటి వివిధ సమస్యలతో జీవితాన్ని గడుపుతూ, కొందరు క్రైస్తవులు అన్నిరకాల కార్యకలాపాలలో, పాల్గొంటూ ఉంటారు, కొందరు సంఘనాయకత్వం కూడా చేపడుతూ ఉంటారు. ఇక ఆ సంఘములో ఎన్ని సమస్యలు ఉత్పన్నమౌతాయో చూడండి, అందుకే మీరు ఎరిగిన క్రైస్తవులలో ఎటువంటి ప్రత్యేకత కనుగొనలేకపోతే, ఆశ్చర్యపోకండి, ఇటువంటి వారే అధిక సంఖ్యలో ఉన్నట్లున్నారు.

పాత జీవితమునుండి బయటపడడమనేది, జీవితంలో మీకు అతి కష్టమైన సవాలుగానే ఉంటుంది. నేను నా కారులోనే బ్యాటరీని ఎందుకు వదిలి వెళ్ళాను? నేను కారులో నుండి బ్యాటరీ తీసివేసి, చలికి గడ్డకట్టకుండా ఉండేందుకు, ఇంట్లోదాచి ఉండవలసినది. అసలు విషయమేమిటంటే, నేను అది బయటకు తీయడానికి ప్రయత్నించాను, కాని అది బయటికి రాలేదు. అది ఎలా తీయాలో నాకు తెలియక కాదు. గతంలో కార్లనుండి బ్యాటరీలు చాలాసార్లు తీసాను. అయితే ఈ సారి కారులో బ్యాటరీ

ఎంత గట్టిగా ఇరుక్కు పోయిందంటే, నేను దానిని తీయలేకపోయాను. గ్యారేజీలో మెకానిక్ దగ్గర ఉండే ఉపకరణాలు నా దగ్గర లేవు.

చాలా మంది క్రైస్తవులకు ఉన్నాది ఇదే సమస్య, క్రొత్త జీవితములో ప్రవేశించడానికి వాళ్ళు, పాత జీవితమునుండి బయటకు రాలేకపోతున్నారు. వారెంతగా ప్రయత్నించినా, పాత జీవితం దాని స్థానంలోనే ఉంది, అసలు ఈ నూతన జీవితము అంటే ఏమిటి? యేసే శక్తియై ఉన్నటువంటి జీవితమే నూతన జీవితము, మనము ఆయనకు సంపూర్ణముగా లోబడినప్పుడు, ఆయన మాత్రమే మనలో ఆ పాత జీవితాన్ని తీసివేసి, దాని స్థానంలో నూతన జీవితాన్ని దయచేస్తాడు.

పాత జీవితాన్ని అసలు మనము ఎందుకు వదిలేయాలి? ఎందుకంటే, అది పాపములో జీవించిన జీవితము , పాపము మన జీవితపు ఔనత్యాన్ని నాశనం చేస్తుంది. అందుకే, సంఘంలో ఎప్పుడూ పాపము అనే అంశంపై ఎక్కువగా ప్రసంగిస్తూ ఉంటారు. పాపము గురించి మాట్లాడుట, మనకు ఇష్టం ఉండదు కాని, ఇది అవశ్యముగా తెలిసికొనవలసినది. దాని నుండి ఎట్లు విడుదల పొందగలమో కూడా మనము అర్థం చేసుకోవాలి. ఎలాగైతే, ఒక వ్యాధి, మానవుని జీవిత విధానమును నాశనం చేస్తుందో, అలాగే పాపము, మన ఆత్మీయ జీవితపు ఔనత్యాన్ని నాశనము చేస్తుంది.

మీ హృదయములో ఏదైనా పాపమును మీరు మరుగుపరుస్తున్నారా? ఒక చిన్న పాపము, మీ జీవనసరళినే నాశనం చేయగలదు, ఉదాహరణకు, ఆందోళనను తీసుకోండి, ఈనాడు దాదాపు ప్రతివారు ఎదుర్కొంటున్న సమస్య ఇది.

ఆందోళన కూడా ఒక పాపమా? అని మీరు ఆశ్చర్యపోవచ్చు. అవును అది పాపమే! ఎందుకు? ఎందుకంటే అది దేవునిపై నీకున్న విశ్వాసలోపాన్ని వ్యక్తంచేస్తుంది. ఒక క్రైస్తవునికి, దేవునియందు విశ్వాసము లోపించుట పాపము. నీవు దేవుని నమ్మితే, నీవు ఆందోళన చెందవు.

నీవు ఆందోళన చెందవలసిన విషయాలు లెక్కలేనన్ని ఉంటాయి నా ఉద్యోగానికి ఏమవ్వబోతుంది? నా ఆరోగ్యానికి ఏమవ్వబోతుంది? నా కారు రోడ్డు ప్రమాదానికి గురౌతుందేమో? కొందరు ఏదో ఒక తాయెత్తు కారులో వ్రేలాడదీస్తారు. అది వారిని కాపాడుతుందని వారి నమ్మకం. ఆందోళన సమస్తాన్ని హరించేస్తుంది. చాలామంది ముఖాలలోని ఆందోళనను కనిపెట్టడానికి, నీవొక వైద్యుడవ్వక్కరలేదు. నా ప్రియురాలు రేపుకూడా, ఇలాగే నన్ను ప్రేమిస్తుందా? నా భర్త నా యెడల, ఇదే విధంగా నమ్మకంగా ఉంటాడా? నా పిల్లలు మంచిపిల్లలుగా ఎదుగుతారా? లేక ఏ మాదకద్రవ్యాలకో అలవాటు పడతారా? ఒకవేళ వారు సమస్యల్లో చిక్కుకుంటే, నేనేమి చెయ్యగలను? ఒకవేళ చదువుకొనే వారైతే, మార్కులు ఎలా వస్తాయో? మార్కులు సరిగ్గా రాకపోతే భవిష్యత్తే లేదు కదా! ఇలా ఆందోళన మరియు చింతలు. ఆందోళన మనల్ని ఎలా హరిస్తుందంటే, అది భయానకమైనది.

ఆందోళన మాత్రమే కాకుండా, మన జీవితములో అనేక రకాలైన పాపాలు ఉన్నాయి. గలతీ 5:18-21లో చెప్పబడిన పాపముల జాబితా చూడండి, అసూయ, కలహము మరియు జారత్వము. ప్రతీ పాపము ఎంత చిన్నదైనను మన జీవితసరళిలోని

ఔన్నత్యాన్ని నాశనం చేస్తుంది. అందుకే పాపపు నివృత్తికై యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడు.

సంఘం ఎందుకు నీతి, లేక, పాపరహితత్వము గురించి బోధిస్తుంది? ఎందుకంటే, నీతియే మన జీవితములో ఆ ఔన్నత్యాన్ని తీసుకువస్తుంది. వ్యాపారవేత్తలు కూడా ఈ సిద్ధాంతము యొక్క ప్రాధాన్యతను తెలుసుకుంటున్నారు. ఒక చిరునవ్వు ఎంతటి ఔన్నత్యాన్ని ఒనగూరుస్తుందో, ఈ మధ్య చదివాను. జీవితంలో ఆ ఉన్నత సరళి లేనిదే, మీరు చిరునవ్వు చిందించలేరు. లేదా, అలా చిరునవ్వు నవ్వడము చాలా కష్టము. మిగతా దుకాణాల కంటే, ఒక ప్రత్యేకమైన దుకాణానికే ప్రజలు ఎక్కువగా ఎందుకు వెళ్ళుతున్నారో, ఒక నివేదిక తయారు చేసారు. ఈ దుకాణంలో మిగతా వాటికంటే ఎక్కువ వైవిధ్యమైన వస్తువులు లభిస్తున్నాయా? లేదు. నివేదికలో తెలిపిన జవాబు, చాలా ఆశ్చర్యంగా ఉంది. తేడా ఎక్కడ వచ్చిందంటే, వెలుపలికి వెళ్ళే ద్వారము దగ్గర నిలిచి ఉండే పరిచారకులు, బయటకు వచ్చేవారిని చూసి, చక్కగా చిరునవ్వులు చిందిస్తారట, ఆశ్చర్యంగా ఉంది కదా, ఆ నవ్వు వినియోగదారుడిని మళ్ళీ అక్కడికే వెళ్ళే విధంగా ప్రభావితం చేస్తుంది. ఇది నిజంగా ఆలోచించవలసిన విషయము. మరోలా చెప్పాలంటే, ప్రజలు కేవలం అక్కడి వస్తువులు కొనడానికి మాత్రమే వెళ్ళడము లేదు. ఆ చిరునవ్వులు చూడాలని ఆశపడుతున్నారు. ఆశ్చర్యంగా ఉంది. ఎలాటి ఆత్మీయ దైన్యతలో ఉన్నాము. అంటే, ఆలాటి చిరునవ్వు మనకు అవసరము.

భార్యాభర్తలు, ఈ నాడు ఒకరిని చూచి ఒకరు, నవ్వుట మరచిపోతున్నారు. ప్రతిరోజు ఒకరినొకరు చూసుకొంటూనే

ఉంటాము కదా, నవ్వాల్సిన అవసరం ఎవరికుంది? మీరు నవ్వగలిగితే, సమస్యాత్మకమైన వివాహబంధంలో కూడా, చిరునవ్వు ఎంత మేలు చేస్తుందో, చూసి ఆశ్చర్యపోతారు, కఠినమైన పరిస్థితుల నడుమ జీవితం గడుపుతున్నా, నవ్వగలిగినటువంటి ఒక జీవన సరళిని, మనకందించడానికే యేసుప్రభువు వచ్చాడు. సమృద్ధి జీవితం అనే మాటకు మొదటి నిర్వచనము. అసామాన్యమైన జీవితము. ఈ అసామాన్యమైన జీవితం అంటే ఏమిటి? అందరికి నవ్వుటకు ఏ కారణము గోచరించనప్పుడు మనము నవ్వగలగడమే, ప్రపంచమంతా ముభావంగా ముఖం ముడుచుకొని ఉన్నా, క్రైస్తవుడు నవ్వగలిగి ఉండాలి, నవ్వడము మాత్రమే ఆనందానికి నిదర్శనమని, నేను చెప్పుట లేదు. నేను తరచు సంతోషంగా ఉంటాను. కాని అన్నిసార్లూ నేను నవ్వను అయితే ఆనందం కొన్ని సార్లు నవ్వు రూపం ధరించుకోవలసి ఉంటుంది. అయితే ఎప్పుడూ నవ్వుతూ ఉండడానికి తర్ఫీదు ఇవ్వబడిన వాళ్ళు ఉన్నారు. వారి ముఖాలు ఎలాటి పరిస్థితిలోనైనా చిరునవ్వుతో ముద్రించబడి ఉంటాయి, ఆ దుకాణంలోని పరిచారకులులాగ. అయితే వారలా తర్ఫీదు చేయబడ్డారు. మరియు వాళ్ళు కష్టమర్లను చూసి నవ్వడము కోసమే, అక్కడ ఉంచబడ్డారు. వాళ్ళ హృదయాలలో ఎటువంటి ఆనందం లేకపోవచ్చు, యేసుక్రీస్తులో తప్ప నిజమైన సంతోషము మరెక్కడ దొరుకుతుంది?

అయితే, యేసుక్రీస్తు వచ్చినప్పుడు, ఆయన మనకు జీవము, బలము, శక్తియై మనలోనే ఉంటాడు. ఈ అంశమును విశదపరచుటకు, అది చాలా విస్తారమైనది. కాని క్లుప్తంగా

చెప్పాలంటే నా జీవితాన్ని నేను జీవిస్తున్నప్పుడు, నేను ప్రక్కకు తొలుగుతాను, నా సొంతభావాలను నేను ప్రక్కన పెట్టేస్తాను. నేను క్రుంగిపోవచ్చు దిగులు చెందవచ్చు, ఆందోళన చెందవచ్చు, నా పాత జీవితముతో సహా వీటిని పారద్రోలతాను, దాని తరువాత యేసుక్రీస్తును ఆహ్వానించి, నన్ను ఆయనకు అప్పగించు కుంటాను. ఇది నేను ప్రతి క్షణం చేయాలి. ఇప్పుడు ఆయన నాలో తన జీవితాన్ని జీవిస్తున్నాడు. ఆయన 'నిజముగా' ఆయన జీవితాన్ని నాలో జీవించని యెడల, యేసే నా జీవితం అని నేను చెప్పుటలో అర్థం లేదు. ఆయన నాలో తన జీవితాన్ని జీవించా లంటే, నేను ప్రక్కకు తప్పుకోవాలి. నా హృదయంలో నేను ఒకవేళ ఆందోళన చెందితే, వెంటనే నేను, "క్షమించు ప్రభువా, నీ దారిలోకి నేను మళ్ళీ అడ్డు వస్తున్నాను. ఇప్పుడు దయచేసి, నీ రీతిలోనే నీవు నాలో జీవించు" అని అంటాను.

మీరందరూ, జీవన సరళిలోని, ఈ ప్రాముఖ్యమైన విషయాన్ని అర్థంచేసికొనుట, ప్రారంభించారని ఆశిస్తున్నాను. మరియు దేవుని దయవలన, ఇటువంటి ఔన్నత్యమైన జీవనసరళి మీలో ప్రత్యక్షపరచబడి, మీ జీవితంలో ఇది రూపుదాల్చుకోవాలని ఆశిస్తున్నాను. అప్పుడు మిమ్మును చూచిన ప్రజలు, "ఆహా! ఈ వ్యక్తి ప్రత్యేకమైన వాడు" అని అంటారు.

ప్రసంగము 2 హృదయశుద్ధి గలవాడు సంతోషభరితుడు

# సంతోష రహస్యము

## క్రైస్తవుడిగా నీ జీవిత ఔనత్యం ఎలా ఉంది?

ఈ మధ్యకాలంలో ఈ "ఔనత్యజీవన సరళి" గురించి నేను కొంతదీర్ఘంగా ఆలోచిస్తున్నాను. గత సందేశంలో మన జీవితంలోని ప్రతీదీ కూడా, మన ఔనత్యమైన జీవన విధానంతో ముడిపడి ఉంటుంది, అని సూచించాను. మనము నిజమైన క్రైస్తవునిగా జీవించాలి, అని తీసుకొనే నిర్ణయం కూడా ఇందులో భాగమే.

ఒక క్రైస్తవుడు ఇటువంటి సాక్ష్యమిస్తుంటే విన్నట్లుగా ఊహించుకోండి "నేను క్రైస్తవేతరునిగా ఉన్నప్పుడు, నా జీవితం చాలా సంతోషంగా ఉండేది. ప్రతిరోజు నా హృదయంలో సంతోషమే. నా సంతోషం ఎంతగా అవధులు మించిందంటే, ఇక ఏదన్నా శ్రమ కలిగితే బాగుండునేమో, అనే స్థాయికి చేరుకుంది. అందుకే క్రైస్తవునిగా అగుటకు నిర్ణయించుకున్నాను".

ఇంతవరకు ఇటువంటి సాక్ష్యము నేను వినలేదు. మీరు వినిఉంటే నేను ఆశ్చర్యపడతాను. ఇలాంటి సాక్ష్యము వినకపోయి ఉండవచ్చు, కాని కొంతమంది క్రైస్తవుల జీవితాలలో వాస్తవంగా జరుగుతున్నది ఇదేనేమోనని, తరచూ అనిపిస్తుంది. క్రైస్తవేతరులుగా ఉండగా, వారు నిజంగా సంతోషంగా ఉన్నారోలేదో నాకు

తెలియకపోవచ్చు కాని, క్రైస్తవులుగా అయిననాటినుండి వారు దుః ఖాలపాలు అయ్యారేమోనని అనిపిస్తుంది. సంతోషంగా కనపడుటకు వారు విశ్వప్రయత్నం చేసినా, అది సాధ్యం కావడం లేదు. మరి సమస్య ఏమిటి? ఈ ప్రశ్ననే నేను సంధించాలనుకొంటున్నాను. మీ క్రైస్తవ జీవిత విధానంలో ఉన్న ఔనత్యమేమిటి?

మొదటిగా, ఒక వ్యక్తి క్రీస్తునొద్దకు రావాలని ఎందుకు కోరుకుంటాడు? అతను కష్టాల పాలు కావాలని కోరుకొనడం వలనా? క్రైస్తవునిగా అగుటకు ముందు, దీనికి దృఢమైన నిశ్చయత అవసరమని, జీవితం సుఖమయం కాదని మనలో కొందరికి తెలిసే ఉండవచ్చు. అయితే ధనవంతుడైన యౌవనస్తుని వలె మనముండకూడదని నిర్ణయించుకున్నాము. అతను ప్రభువైన యేసుతో "లేదు, లేదు. నీవు కోరుకొనేది చాలా కష్టమైనది నీతో మరియొకసారి మాట్లాడతాను,'' అన్నాడు. మరి క్రైస్తవునిగా జీవించాలంటే చెల్లించాల్సిన వెల, ధృఢమైన ఒప్పుదల తెలిసియుండి కూడా క్రైస్తవునిగా ఉండాలని, ఇంకా మనము కోరుకుంటున్నామా?

**హిమాలయాలు అధిరోహించే వాని స్ఫూర్తి :**

పోయిన సంవత్సరము నేను నేపాల్‌లో ఉన్నాను విమానం ఇండియా నుండి నేపాల్ వెళ్ళేటప్పుడు, అందరికీ హిమాలయాలు చూడాలనే ఆశ. ఇక ప్రయాణికులందరూ, ఆ పర్వతాలను చూడాలని విమానంలో ఒక వైపుకు పరుగులెత్తుతున్నారు. దీనివల్ల విమానంలో ఏంప్రమాదం సంభవిస్తుందో అని నేను చింతించాను. అయితే, హిమాలయాల సౌందర్యానికి అందరూ మంత్రముగ్ధులయ్యారు. అల్లంత దూరములో విమానం హిమాలయాల మీదుగా పయనిస్తున్నప్పుడు, ఓ చిన్న కాబిన్‌వంటి

విమానం నుండి ఆ పర్వతాలను చూడడము, ఒక అందమైన అనుభూతి. కాని కొందరు, హిమాలయాలను ఇలా చూడటముతో తృప్తిచెందరు. మరి వాళ్ళు ఏమి చేస్తారు? ఈ పర్వతాలను అధిరోహించడానికి నేపాల్ వస్తారు. ఆ చలిని, కఠినతరమైన, ప్రాణాంతకరమైన ప్రమాదాన్ని ఎదుర్కొనుటకు సాహసిస్తారు.

వాళ్ళు ఇలా ఎందుకు చేస్తారు? కొందరు పర్వతారోహ కులైతే క్రింద ఉండే తక్కువ ఎత్తులోని పర్వతశ్రేణులు అధిరోహించి సంతృప్తి చెందరు. అత్యంత ఎత్తులోని వున్న శ్రేణులకు తెగించి వాళ్ళు వెళుతున్నారు. ఇలా ప్రాణాలు కోల్పోయిన వారు కూడా ఎందరో ఉన్నారు. మన దృష్టిలో ఉన్నత జీవన సరళి అంటే హాయిగా సోఫామీద జారగిలపడి కూర్చుని ఉండడమైతే, ఆ పర్వతారోహకులకి సంవత్సరాల తరబడి కఠినమైన పర్వతారోహణ, శిక్షణ, శ్వాస పీల్చుటకు కూడా కష్టంగా, బహు తక్కువగాలి లభ్యమయ్యే ఎత్తులలో, అటువంటి పరిస్థితులను తట్టుకుంటూ, శిఖరాలను అధిరోహించి, ప్రపంచాన్ని అంత ఎత్తునుండి దృష్టించడము, వారికి జీవనసరళిలోని ఔనత్యం. వారికి ఔనత్యజీవితమంటే తాపీగా కూర్చొని కాలం గడిపేయడం కాదు. కాని శ్రేష్టముగా గడిపిన సమయం. శిఖరాగ్రాన్ని చేరుకొని, అక్కడినుండి క్రిందప్రపంచాన్ని చూస్తే కలిగే ఆ పులకరింపు కేవలం పర్వతారోహకులకే తెలుస్తుంది. ఏళ్ళతరబడి పొందిన శిక్షణ ఈ మధురక్షణం కొరకే గదా. వారికి జీవితఔనత్యమేమిటంటే, అజేయమైన వాటిని జయించుట, అసాధ్యమైనవి సాధించుట.

ప్రభువైన యేసు ఇటువంటి వారి కోసమే ఎదురు చూస్తున్నారేమో. అందుకే ఆయన, ఆయన శిష్యులుగా మనము

జీవించాలనుకుంటే అది శ్రమానుభవముతో కూడుకొన్నదని అన్నాడు. పడక కుర్చీలో తాపీగా కూర్చుని ఉండే జీవనసరళిని కలిగినవారిని కాక, ఆత్మీయ పర్వత శ్రేణులను ధైర్యంగా ఎదుర్కొని జయించగల, ఆ సంసిద్ధత కలిగిన జీవనసరళి ఉన్న వారికొరకు ఆయన ఎదురు చూస్తున్నాడు.

ప్రతి యత్నము ఒక మెరుగైన జీవనసరళి కొరకు ప్రయత్నము. మనము దీనిని ఎలా అర్థముచేసుకొన్నప్పటికీ, జీవితములోని ప్రతి దశ జీవనసరళికి సంబంధించినది. మామూలుగా బజారుకెళ్తే మనము వరుసగా చాలా బట్టల దుకాణాలను చూస్తాము. ఇన్ని బట్టలు ఎవరు కొనుక్కుంటారు? అని నాకు ఆశ్చర్యము వేస్తుంది. ఎందుకంటే సాధారణంగా నాకున్న బట్టలలో ఎక్కువ శాతము చాలాకాలము మన్నుతుంటాయి. కాని, చాలా మంది వాళ్ళు ధరించే దుస్తులు, వాళ్ళ జీవన సరళి ఔనత్యాన్ని చూపిస్తాయి అనుకుంటారు. వారు క్రొత్త దుస్తులు కొనుక్కోవాలి వాళ్ళు అర్థం చేసుకొన్న ఔనత్యమైన జీవనసరళి, క్రొత్త దుస్తులు ధరించడము.

**మరొక ఉదాహరణ చూద్దాం. మీ ఇంట్లో టెలివిజన్ ఉందా?**

అందరికీ టి.వి. ఉంటుందనుకోండి. మీ ఇంట్లో ఉంది బ్లాక్ అండ్ వైట్ టి.వియా? కాదు కదా. ఎందుకంటే అది చాలా పాత ఫ్యాషన్. నన్ను ఒక ప్రశ్న వేయనివ్వండి. బ్లాక్ అండ్ వైట్ టి.విలో తప్పేముంది? మీరు బ్లాక్ అండ్ వైట్ టి.విలో వార్తలు చూస్తే, మీరేమైనా తప్పువార్తలు వింటారా? వార్తలు చదివే వ్యక్తి దుస్తుల రంగు చూడడము మీకు ముఖ్యమా? లేదు. మరి మనందరము కలర్ టి.విని మాత్రమే ఎందుకు కొంటాము? మనము, 'కలర్

టి.వి. మెరుగైంది కదా'? అంటాము. చూడడానికి కూడా బాగుంటుంది. అయితే మనము వినేవార్తలలో వేరే విశేషమేమి ఉండదనుకోండి. కాని ఇది పూర్తిగా మన జీవిత సరళికి సంబంధించినది. ఈ జీవితసరళిని ఇంకా మెరుగు పరచడానికి మిలియన్ల డాలర్లను వెచ్చించి, మెరుగైన రంగు, సాంకేతిక నైపుణ్యమున్న వస్తువులను తయారు చెయ్యడానికి, పరిశోధనలు జరుగుతూనే ఉంటాయి. వాటి కొరకు మన జేబులో నుండి ఎక్కువ డబ్బులు గుంజేయబడుతూనే ఉంటాయి.

## వైద్యరంగంలో పరిశోధనలు ఎందుకు జరుగుతున్నాయి?

ఎందుకంటే కాన్సర్ వంటి వ్యాధులు నయంచేయు మందులు కనుగొనడానికి. కాని మనమెప్పుడైనా ఇలా ప్రశ్నించు కున్నామా? అసలు కాన్సర్ కలిగి వుంటే తప్పేమిటి? చాలా మంది ప్రజలకు కాన్సర్ ఉంది. ఇందులో పెద్ద విచారించ వలసిన విషయమేమిటి? ఈ ప్రశ్న అడగడము కొంచెం బుద్ధిహీనంగా అన్పించవచ్చు. ఎందుకంటే అదేమిటో మనకి ప్రత్యేకంగా తెలుసు. మనలో చాలా మందికి కాన్సర్ ఉండడమనేది పెద్ద విషయమే! ఎందుకంటే అది ప్రాణాలు తీసేస్తుంది. అందరము ఎరిగినట్లుగా, జీవనసరళి యొక్క అంతాన్ని మరణమే శాసిస్తుంది. మనలో ఎంత మందిమి కాన్సర్ ప్రభావము మన జీవనసరళి మీద పడని విధంగా జీవించ గలము? మన జీవనసరళి ఔనత్యాన్ని కొనసాగించు కోడానికి అనేక విధమైన ప్రయత్నాలు, పరిశోధనలు ఎందరో, ఎన్నో చేస్తూ, ఎంతోడబ్బు, శక్తి ధారపోస్తున్నారు. మెడికల్ షాపులలో ఎన్నో రకాలైన బాధానివారణిలు, దగ్గుమందులు మనం చూస్తాము. ఎందుకంటే, ఆ బాధ, దగ్గు మన జీవన సరళిని పాడుచేస్తుంది.

దాని వలన మనము సంతోషంగా గడపలేము.

## మనము దుఃఖితుల మవ్వాలని దేవుడు కోరుకొంటున్నాడా?

ఉన్నత జీవనసరళి, జీవితములో ఎలా ఆవశ్యకమైనదో, అదే రీతిలో అది ఆత్మీయస్థితికి కూడా అవసరమే, అన్నవిషయం సుస్పష్టం. తొందర పాటున దేవుని యెడల వేరే అభిప్రాయము కలిగి యుండవద్దు. ఔనత్యజీవన సరళిని గురించి, ఆయన అభిప్రాయము వేరే అని కొన్నిసార్లు మనము సంశయిస్తాము. ఆయన దృష్టిలో ఒక మంచి క్రైస్తవుడనగా, దీనస్థితిలో ఉన్నవాడు. మనము ఎంతగా శ్రమలు పడితే, అంత ఆత్మీయంగా ఉన్నతులమని అర్ధమా! ఇది మనకి తెలిసిన సంగతేనా? మన ఆలోచన ధోరణి ఇలాగుంటుంది. లోకస్థులైన క్రైస్తవేతరులు ఉల్లాసం గురించే మాట్లాడలేరు. కాబట్టి ఏ రకమైన సుఖానుభవమును అనుభవించినను, అది ఐహికమైనదని మనము భావిస్తాము. అయితే దానికి వ్యతిరేకమైనది నిజమై ఉంటుందా? దౌర్భాగ్యస్థితిలో ఉండడమనేదే, ఆత్మీయంగా ఉండడమా! ఎప్పుడైనా ఒకసారి మనము సంతోషంగా ఉన్నామంటే, ఏదో తప్పు చేసిన భావన కలిగి, ఆత్మీయంగా దిగజారామెమో అని అనుకొంటాము.

బౌద్ధ ఆశ్రమాలలో ఉండే బౌద్ధసన్యాసులను చూస్తుంటాము. వారు దీనస్థితిని, ఆధ్యాతికంగా పరిగణించుట లేదా? చాలా సాదాగా ఉండే ముతకబట్టలు ధరిస్తుంటారు, ప్రకృతి సిద్ధమైన ఆహారము తింటారు. ఈ లోకములో ఉండు ఎటువంటి సుఖాలు లేకుండా జీవిస్తుంటారు. మౌనంగా జీవించాలి. చాలా ఆశ్రమాలలో మౌనంగా ఉంటామని ప్రమాణాలు చేయించు కుంటారు. వాళ్ళ మధ్యలో వాళ్ళు మాట్లాడు కొనలేనప్పుడు, బిగ్గరగా నవ్వితే, ఏ

విధమైన శిక్షయో, ఊహించండి. ఏ రకమైన సుఖానుభవము అక్కడ నిషిద్ధం. వారు దీనస్థితి కొరకే ఎదురు చూస్తున్నట్లుగా మనకు అనిపిస్తుంది.

ఒకవేళ, వారిని మనము అపార్ధము చేసుకున్నామేమో. హిమాలయాలు అధిరోహిస్తున్నవారి వలె, వీరు వేరే రకమైన ఔనత్యజీవితం కొరకు ఎదురు చూస్తున్నారు. హిమాలయాలు అధిరోహించేటప్పుడు పర్వతారోహకులకు మంచి వస్త్రములు అవసరము లేదు. అక్కడ ఎత్తైన కొండలకు వ్రేలాడుతున్నప్పుడు, ఎంత రుచియైన ఆహారపదార్ధము, ఇచ్చినా దానిని ఆనందిం చలేరు. అయితే వాళ్ళు అనుకున్న లక్ష్యం, చేరుకొనే ప్రయత్నం చేసేటప్పుడు, జీవితములోని మామూలు సుఖాలు కూడా ప్రక్కన పెట్టేస్తారు. ఒక సన్యాసి, నిజంగా భగవంతునిలోని ఆనందం కొరకు నిజంగా ఆపేక్షిస్తున్నాడంటే ఫర్వాలేదు. వేరే జీవితౌనత్యం కొరకు ఎదురు చూస్తున్నాను, అని అతనికి తెలుసు. కాని, ఒకవేళ దౌర్బల్యస్థితిలో జీవించడం ద్వారానే రక్షణ ప్రాప్తిస్తుందని, రక్షింపబడగలుగు మార్గము ఈ దీనస్థితే అనుకుంటే, అసలైనది అతను పోగొట్టుకొన్నాడు.

**ఇటువంటి గొప్ప సంతోషము పొలుకుండెను.**

1తిమోతి 6:17లో అపొస్తలుడైన పౌలు చాలా ప్రాముఖ్యమైన విషయము చెప్పాడు "సుఖముగా అనుభవిం చుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవుడు.... "అపొస్తలుడైన పౌలు శ్రమలు, కష్టాల గురించి లోతుగా ఎరిగిన వ్యక్తి, ఆయన క్రీస్తుకు ఒక నిజమైన సైనికుడు. అయితే, మనము పౌలుతో జీవించి ఉంటే, ఆయన జీవితములోని ఈ ఔనత్యమైన సంతోషాన్ని

కనుగొనగలిగేవారము, మరి మన సంగతేమిటి? మనలను ఎరిగిన మనుష్యులు మన జీవితంలో ఏమి చూస్తున్నారు? ఏ రకమైన జీవనసరళి ఔనత్యాన్ని మనలో వారు కనుగొనగలుగుతున్నారు? మనలో వారు ఆత్మఫలములను చూస్తున్నారా?

మనందరికీ గలతీ 5:22-23లో ఉన్నటువంటి ఆత్మఫలాల గురించి తెలుసు. ఈ తొమ్మిది ఆత్మఫలాలను చూస్తే, ప్రతీ ఒక్కటి ఔనత్యజీవన సరళికి సంబంధించినదని మనము గమనించగలము. ఇంకా ఆ సందేశం మనకు స్పష్టమవ్వలేదా? జీవితములో ఈ ప్రత్యేకౌనత్యం కలిగి ఉండుటకే దేవుడు మనకు పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తాడు. వాత్సల్యమైన ప్రేమ, అత్యధికమైన ఆనందము, నెమ్మదియైన సమాధానము, దీర్ఘశాంతము, దయాళత్వము ఇలా ఇటువంటి సుగుణాల గురించి చెప్పుతునే ఉండవచ్చు. అంటే పరిశుద్ధాత్మచే మన జీవితాలు నింపబడితే, ఇటువంటి ఔనత్యమైన జీవిత సరళితో మనము జీవిస్తూ ఉంటాము. ఇటువంటి వాటితో మనము నింపబడి ఉన్నప్పుడు, మనము దౌర్భాగ్యుల మవ్వగలమా? ఇదే ప్రశ్నను మరోలా అడిగితే, నన్ను నేను దౌర్భాగ్యునిగా భావిస్తే, పరిశుద్ధాత్మచే నింపబడుట సాధ్యమా? మీ జీవితాన్ని ఒకసారి పరిశీలించుకోండి. ప్రస్తుతం నీవున్న పరిస్థితి ఏమిటో గమనించుకో. ప్రస్తుత నీ జీవితం ఎటువంటి ఔనత్యాన్ని కలిగి ఉంది?

## మన సంతోషం విషయమై దేవుడు అక్కర కలిగియున్నాడు

లేఖనాలలో ఎక్కడ చూసినా, దేవుడు మన జీవితౌనత్యం పట్ల అక్కర కలిగి ఉండడాన్ని గమనిస్తాము. ప్రభువైన యేసు తన పరిచర్య ప్రారంభించడమే మనకు సుపరిచయమైన ధన్యతలు

బోధిస్తూ ప్రారంభించాడు (మత్తయి 5:3-11). చైనా బైబిలు అయితే వీటిని ఎనిమిది ధన్యతలుగా చెప్పతుంది, కాని తొమ్మిది ఆత్మఫలములకు సరితూగునట్లుగా తొమ్మిది మార్లు "ధన్యులు" అనే పదం కనిపిస్తుంది. ఆశ్చర్యకరమైనది ఏమిటంటే ధన్యత అనుమాటకు సంతోషము అని అర్ధము. అప్పుడు మొదటి ధన్యతని ఇలా అనువదించవచ్చు. "ఆత్మవిషయమై దీనులైనవారు సంతోషభరితులు. ఇలా అనువదించి ఉంటే బాగుండునేమో అనిపిస్తుంది. ఎందుకంటే, ఈనాడు ధన్యత అను మాటకు అర్ధము చాలా మందికి తెలియకపోవచ్చు. ఆ విధంగా మత్తయి సువార్తలో తొమ్మిది సార్లు దేవుడు "అటువంటి మానవుడు సంతోషభరితుడు అని అన్నాడు. ఆసక్తికరమైన సంగతేమిటంటే ప్రభువు తన పరిచర్యను ప్రారంభిస్తూనే సంతోషం గురించి, తొమ్మిది సార్లు నొక్కి వక్కాణించారు. మీరు సంతోషంగా ఉన్నారా? నేను సంతోషంగా ఉన్నానా? లేని యెడల ఆయన సువార్త మనకింకా అందనట్టే.

## హృదయశుద్ధి - సంతోషరహస్యం

సంతోషానికి రహస్యమేమిటి? ధన్యతలలోనే ఒక వచనాన్ని పరిశీలిద్దాం. "హృదయశుద్ధిగలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8). ఇక్కడ, మన హృదయం శుద్ధంగా ఉంటే, దేవుడు తన సంతోషాన్ని మనకిస్తాడని చూస్తున్నాము. మరియు ఆ సంతోషము దేవుని చూచుటలో కలదు. ఈ ప్రత్యేక వాక్యభాగంలో చెప్పబడిన ముఖ్య సూత్రం, హృదయశుద్ధి లేని యెడల, ప్రభువులో మనమెన్నడును సంతోషంగా ఉండలేము. శుద్ధి అని అనువదించబడిన పదానికి పవిత్రము అని కూడా అర్ధం.

హృదయములో ఏదైనా అపవిత్రత ఉన్న యెడల, మీరు సంతోషాన్ని కలిగి ఉండలేరు.

ఇది ఏదో సిద్ధాంతపరమైనది కాదు. ఇది ఆచరణకు సంబంధించిన మామూలు విషయము. మనలో ఏదైనా చేదైనది ఉన్నదనుకొండి ఎవరిమీదైనా మనకు ఈర్ష ఉంటే, మనము సంతోషంగా ఉండగలమా? లేదు. ఉండలేము. ఎందుకంటే ఆ పాపములేక అపవిత్రత, మన అంతరంగాన్ని మొత్తం కలుషితంచేస్తుంది. దురాశే ఉందనుకోండి, మన హృదయంలో ఆ దురాశ ఉన్నంతవరకు, మనము సంతోషంగా ఉండలేము, ఎందుకంటే మనకు కలిగినదానితో సంతృప్తి చెందలేము. చర్చిలో ఎవరికో వున్న ఒక మంచికారుని చూసి, నాకు ఈర్ష కలిగిందంటే, నా సంతోషం మాయమైనట్లు గమనించగలను. నా హృదయములోని అపవిత్రతను బట్టి నాలో సంతోషం ఉండదు. ఇది ఒక ప్రత్యేకమైన సిద్ధాంతము కాదు. దేనినైనా పరిశోధనాశాలలో పరీక్షించినట్లు, ఖండితంగా ఈ విషయాన్ని పరీక్షించవచ్చు. ఇది మన సొంత జీవితాలనుండే మనము తెలుసుకొనగలము.

**ప్రతి అపరిశుద్ధతను, పరిశుద్ధాత్మను అన్వేషించనివ్వండి** ఎందుకంటే, చిన్న అశుద్ధత మిగిలిపోయినా, అది మన సంతోషాన్ని హరించేస్తుంది. మనము మన జీవితమును, అత్యంత సంతోషభరితముగా గడపాలి అని దేవుడు ఇష్టపడుతున్నాడన్న విషయం, జ్ఞాపకముంచుకోండి. ఇది కేవలము మన కొరకే కాదు, మనము ఈ లోకానికే వెలుగైయుండాలన్న ఉద్దేశ్యముతోనే, కాని విచారకరమైనదేమిటంటే, మనలను మనమే వెలిగించుకోలేము, ఇక లోకము మాటెక్కడ? మనము ఏవైపు వెళ్తున్నామో, మనమే

సరిగ్గా చూడలేకపోవుచున్నప్పుడు, ఇక వేరొకరు ఎటువెళ్తున్నారో చూచి వారికి ఎలా సహాయపడగలము?

ఒక కమలాపండును తీసుకొని పిండితే, దానిలోనుండి కమలారసం వస్తుంది, అని మనకందరికీ తెలుసు. ప్రతి చిన్నపిల్లవానికి కూడా ఈ విషయం తెలుసు, నేను కమలాపండును తీసుకొని ఎంత గట్టిగా పిండినా, అందులోనుండి ఆపిల్ జ్యూస్ వస్తుందా? లేకపోతే చాలా సున్నితంగా పిండుతూ టొమాటో! టొమాటో! అని వల్లిస్తే నాకు టమాటా జూస్ వస్తుందా? జవాబు మనకు తెలుసు. కాని చాలా మంది క్రైస్తవులలో ఒక ప్రత్యేకత ఉంది. కొద్దిగా నెమ్మదిగా పిండుతున్నట్లు కొంచెం వత్తిడి మాత్రమే వారి మీదకు తెచ్చినప్పుడు, బయటకు వచ్చేది, కొంచెం దేవుని శిష్యులులాగ కన్పడుతుంది. అంటే కమలారసం లాగ అన్నమాట. అదే జీవితంలో ఏదన్నా పెద్దదెబ్బ, కారు ప్రమాదంలాటిది తాకితే బయటకు వచ్చేది మాత్రము టొమాటా జ్యూస్ కంటే ఘోరంగా ఉండవచ్చు!

రేపు ఉదయం మీ ఆఫీసులో ఎవరైనా తోటిఉద్యోగి పొరపాటున మీపై కాఫీ ఒలికించితే మీ ప్రతిచర్య ఎలా ఉంటుంది? ఆరెంజి జ్యూస్ లాగానా, టొమాటొ జ్యూస్ లాగాన, లేక ఇంకా భయంకరంగానా? తటాలున లేచి, అతని కాలర్‌పట్టుకొని “ఏమైంది నీకు? కళ్ళు కనిపించడం లేదా? నా షర్టుని నాశనం చేసావు చూడు!” అంటూ మండి పడతావా? అప్పుడు మీ తోటి ఉద్యోగి, “వీళ్ళ సంఘంలో సింహాలను శిష్యులులాగ తయారు చేస్తున్నట్లున్నారు!” అని అనుకొనవచ్చు.

ఈ జ్యూస్‌ని చూసి, మన గురించి మనము

తెలుసుకుందాము. వీటినుండి మనమేమి నేర్చుకొనగలము? మన హృదయం పవిత్రంగా ఉండి, ఎటువంటి మలినం లేకుండా ఉంటే, మనల్ని తీవ్రంగా పిండినా లేక మృదువుగా పిండినా, మన ప్రతిచర్యలో ఏ మార్పు ఉండకూడదు, అయినా మన సాకులు మనకుంటాయి. మీరు అప్రమత్తంగా ఉన్నప్పుడైతే, మీరిలా ప్రవర్తించేవారు కాదేమో! నేను మిమ్మల్ని ఇలా అప్రమత్తంగా పట్టుకొంటే, మీరేమి చేస్తారో చూడాలని ఉంది. ఒకరోజు నేను వేషం మార్చుకొని వచ్చి, మిమ్మల్ని క్రిందపడేలా గుద్ది వెళ్ళిపోతాను.మీరేమి చేస్తారు? "ఏమైంది నీకు? నువ్వేమన్నా గ్రుడ్డివాడవా?'' అంటారా? లేక నన్ను పట్టుకొని నాలుగు తగిలిస్తారా!

అయితే, దేవుడు కూడా ఈ విధంగానే మనలో ఏముందో తెలుసుకుంటూ ఉంటాడు. దేవుడు మనల్ని ఒక దెబ్బకొట్టినప్పుడు, మనలోనుండి వచ్చే ఆ స్పందనే మనవేమైయున్నావో తెలియచేస్తుంది.

ఎవరైనా మిమ్మల్ని మీ పెళ్ళి విషయం లేక మీ పిల్లల విషయం అడిగినప్పుడు మీరెలా స్పందిస్తున్నారు? ఆ విషయాన్ని దాటేయడానికి ప్రయత్నిస్తారా? వెంటనే చెయ్యవలసి ఉండి, ఇప్పటికే ఆలస్యం చేసిన వేరే పని మీకు జ్ఞాపకం వస్తుందా? మాట్లాడుటకు మీరు ఇష్టపడని, సున్నితమైన అంశాలు ఏమిటి? ఇలాంటి నొచ్చుకొనే విషయాలుంటే, మనలో సంతోషం లేకపోవడం ఆశ్చర్యం కాదు.

**మనము సంతోషంగా ఉండాలని దేవుడు కోరుతున్నాడు.**

నేను మీకు తెలియచేసే విషయాలు చాలా అభ్యసించవలసినవి. మనము సంతోషంగా ఉండాలని దేవుడు

కోరుతున్నాడు. ఇది నీవు మట్టుకే సంతోషంగా ఉండడము కొరకే కాదుగాని, ఇది వేరే; ప్రతి ఒక్కరినీ కూడా ప్రభావితం చేయాలి. మనము దుఃఖముగా ఉన్నప్పుడు, మన కుటుంబములోని వారందరిని, అలాగే సంఘములోని వారిని, దుఃఖపెడతామని గమనించారా? ఒక సమావేశంలో అందరూ గుండ్రంగా కూర్చొని ఉంటే, అందులో ఒకరు మాత్రము, ముఖం వ్రేలాడేసుకొని ఉన్నారనుకోండి, నెమ్మదిగా తక్కినవారు ఆ వ్యక్తిని చూచి, వాళ్ళు కూడా అలాగే దిగులుగా అయిపోతారు. అలా ఒకరి దుఃఖం మొత్తం సంఘాన్ని బాధిస్తుంది.

మనము "ఈ లోకానికి వెలుగుగా" ఉండుటకు పిలువబడ్డాము. ఇది చాలా ఆత్మీయంగా ఉంది. సరే, అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? దీనిని మనము నిర్వచించగలమా? ఆధ్యాత్మికమైన వ్యక్తి అంటే, ఏదో చూపులకు బలహీనంగా, నమ్రతతో వంగిపోయి, లోకసంబంధమైన వాటికొరకు సమయములేక, అతి సామాన్యమైన దుస్తులతో, ఉంటాడని చాలా మంది అనుకొంటారు. ఆలయంలో అతిగా సంతోషము వ్యక్తపరచుట ఉచితముగా ఉండదని, ఎక్కువగా నవ్వకుండ చిన్న చిరునవ్వుతో, గంభీరంగా ఉంటాడని అనుకొంటారు. ఇది నిజమైన ఆధ్యాత్మికతేనా? ప్రభువుని గురించి ఎంత బాగా మనము అర్ధము చేసుకోగలిగితే, అంతగా ఆధ్యాత్మికతను గురించిన మన భావాలను, మనం మార్చుకొంటామని నేను విశ్వసిస్తున్నాను.

**మీ జీవనసరళి ఇతరులను ఆకర్షిస్తుందా?**

మనం ఉద్యోగం చేయుప్రదేశంలో, మనం ఎప్పుడూ బైబిలుతో ఉండడము వలన, మన తోటి ఉద్యోగులు మనవైపు

ఆకర్షింపబడతారా? లేక, "నేను యేసుకు చెందినవాడను" అనే బాడ్జి పెట్టుకొని తిరగటం వలన వారు ప్రభువు వైపు ఆకర్షింపబడతారా? లేక, మన ఔనత్య జీవన సరళి వల్ల ఆకర్షింపబడతారా? అరె! ఈ వ్యక్తి ప్రత్యేకమైనవాడు" అతనిలో ఎంతప్రేమ, ఎంత సంతోషం, ఎంత సమాధానం! నాకు తెలియదు అతనిలో ఏముందో కాని, అతనిలో ఏదో ఉంది. ఇటువంటి స్వభావలక్షణం నటించగలిగినది కాదు. దానితో నిండినవారమైనప్పుడు, అదే బాహ్యంగా కనిపిస్తుంది. మనలను ఏ విధంగా అణచినా, అది మనలోనుండి అతిసహజంగా బయటకు ప్రవహిస్తుంది. ప్రభువైన యేసును ఎరిగినవారు, ఆయన ఎటువంటి వ్యక్తి అనేది మనకు చెప్పారు. అది ఎరిగినవారమై, ఆయనవలె మనము ఉండాలి. ఆయన ఎలాంటివాడు? యోహాను 1:18లో కృపా సత్యసంపూర్ణుడుగా .. మనము ఆయన మహిమను కనుగొంటిమి" సంపూర్ణత అనుమాటను గమనించండి. ప్రేమ యొక్క మరొక వ్యక్తీకరణే కృప. ఎక్కడ ప్రేమ ఉంటుందో, అక్కడ కృప ఉంటుంది. ఎక్కడ కృప ఉంటుందో, అక్కడ ప్రేమ ఉంటుంది. ఈ రెండూ వేరుచేయబడలేనివి. అటువలెనే సత్యము కూడా, సత్యము ఎప్పుడూ శుద్ధమైనది. సత్యము, శుద్ధత, పవిత్రత వేరు చేయబడలేనివి.

ఆయన కృపచేతను, సత్యము చేతను నిండుకొన్న వాడైనందున ఆయనలోనుండి వచ్చు సారము మనలను ఆశ్చర్యపరచదు, ఎందుకంటే దేనితో నిండియున్నాడో, అదే వెలుపలికి వస్తుంది. ఆయనని ఆకస్మికంగా ముట్టడించినా, కొట్టబడి పరిహసింపబడినా, ఆయననుండి వెలుపలికి వచ్చినది

కృపయు, సత్యము; అందుకే యేసుప్రభువు దూషించబడినను ఆయన ప్రతీకారము చేయలేదు. అలాగే అపొస్తలుడైన పౌలు 1కొరింథీ 4:12లో "నిందింపబడియు దీవించుచున్నాము'' అని అన్నాడు. ప్రభువైన యేసును వారు సిలువ వేసినప్పుడు కూడా, ఆయన వైఖరిలో ఏ మార్పు లేదు. "తండ్రీ వీరిని క్షమించుము'' (లూకా 23:34) అని అన్నాడు. అదే కృపయు, సత్యము యొక్క సంపూర్ణత, ఆయన ప్రక్కలో బల్లెము గ్రుచ్చినప్పుడు, వెలువడిన రక్తము, నీరు కృపకు, సత్యమునకు చిహ్నాలు.

మీలో, నాలో కూడా లోపల ఏమి ఉన్నదో, అదే వెలుపలికి వస్తుంది. అపొస్తలుడైన పౌలు 2కొరింథీ 2:16లో చెప్పినట్లుగా "రక్షింపబడువారికి జీవార్థమైన జీవపువాసన,'' అలాగే మీ నుండి వెలువడాలనీ నేను ప్రార్థిస్తున్నాను. ఒక పుదీనా ఆకును తీసుకొని నలిపినప్పుడు దాని సువాసన వెలువడుచున్నది మరి మనలను నలుగగొట్టినప్పుడు వెలువడుచున్నది ఏమిటి? అతిరోతయైన ప్రతీకారమా లేక ప్రభువుయొక్క సుగంధమా?

**మన అంతరంగ ఒత్తిడిని గమనించండి.**

మన అంతరంగ ప్రతిక్రియలను సరిచూచుకొనుటకు సహాయంగా నేను కొన్ని చెప్పాలనుకొంటున్నాను. ఇంట్లో విశ్రాంతి తీసుకొనేటప్పుడుగాని, పనిచేస్తున్నప్పుడుగాని నిన్ను నీవు గమనించుకోవాలి. మనలోని ఏర్పడు అలజడిని బట్టి, మన నుండి వెలువడుతున్నది ఏమిటో చెప్పవచ్చు. దేని విషయమైనా మనకు టెన్షన్ వుంటే మనం సంతోషంగా ఉండలేము. కొందరు నిద్రలోనూ పళ్ళుకొరుకుతుంటారు. ఇటువంటి ఉద్రేకాలకు కారణమేంటో తెలుసుకొని, వాటిని పరిష్కరించండి, దీనికి కారణము ఏదైనా

ఆందోళనయా? ఉదాహరణకు సహవాసంలో వాక్యం చెప్పే వంతు మనకు వచ్చినప్పుడు, మనం ఆందోళన చెందుతాము. ఎందుకంటే, ఎదుటివారు మనము మాట్లాడిన దాని గురించి, ఏమనుకుంటారో అనే ఆందోళన సహజం. అయితే ఒక వేళ, ఆ సమావేశంలో ఉన్నవారందరూ ఒకరియెడల ఒకరు నిజంగా చాలా ప్రేమ కలిగి ఉన్నారనుకోండి, ఈ భయాందోళనలు తొలగిపోతాయి. భయం, ఆందోళన కలిగిస్తుంది. ఆందోళన వలన ఉద్రేకానికి లోనౌతాము. ఇది ఇతరమనుష్యులంటే భయం వల్లనా? లేక మన ప్రేమలో లోపమా? అనేది మనలను మనము పరీక్షించుకోవాలి.

**మచ్చలేని జీవితంగా ఉంచుకోవాలి.**

మనందరి జీవితాలలో ఎన్నో డాగులుండవచ్చు అయితే మన హృదయం పవిత్రంగా ఉంచుకోవాలి అనే ఆపేక్ష ఉంటే, వాటన్నిటిని పరిశుభ్రం చేసుకోవాలి. ఒక బాటిల్ నీరులో ఒక్క శాతం నీరు మాత్రమే కలుషితమైనా, మన దగ్గర ఉన్న నీరు శుభ్రమైన నీరు కానట్లేకదా! ఒక శాతం కలుషితమైనది, మొత్తం తొంభైతొమ్మిది శాతాన్ని కలుషితం చేస్తుంది. పరిశుభ్రంగా ఉండడము అనగా, పూర్తి పరిశుభ్రత లేకపోతే, అది నిజంగా పరిశుభ్రమైనది అని చెప్పలేము.

“హృదయశుద్ధి గలవారు ధన్యులు” అనగా హృదయం శుద్ధమైనదిగా ఉండాలి. ఏడాగు ఉండకూడదు. అందుకే దావీదు, కీర్తనలు **139:23-24**లో ఇలా ప్రార్థించాడు. “దేవా! నన్ను పరిశోధించి, నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీ కాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము, నిత్యమార్గమున నన్ను

నడిపింపుము.'' తనలో ఇంకా ఏమన్నా దుష్ట ఆలోచనలు ఉన్నాయోమో, ఏదన్నా చిన్న అపవిత్రత ఉన్నదేమో చూడమని అతను కోరుతున్నాడు. ఎందుకు దావీదు అంత పట్టింపుగా ఉన్నాడు? మనందరిలోను, ఏదో ఒక చిన్న అపవిత్రత ఉండడము సహజమే కదా? లేదు. మీరు సంతోషం కావాలనుకుంటే, క్రీస్తునందు సంపూర్ణ ఆనందాన్ని అనుభవించాలంటే, చిన్న అపవిత్రత కూడా ఉండకూడదు. ఈ ఉద్దేశ్యముతోనే మనము దేవునికి ''దేవా, నన్ను శుద్ధీకరించండి, అప్పుడు నేను శుద్ధుడనౌతాను'' అని మొరపెట్టాలి.

'సుఖముగా అనుభవించుటకు, సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవునియందే నమ్మికయుంచుడి. అని పౌలు చెప్పినట్లుగా, ఈ రాబోవు సంవత్సరములో ఇటువంటి ఒక అనుభవంలోకి, మీలో ప్రతి ఒక్కరు ప్రవేశించాలని, నేను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. అలాగే పౌలు 1కొరింథీ 11:28లో చెప్పినది, ''కాబట్టి, ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షించుకొనవలెను. అయితే, కేవలము పరిశుద్ధ బల్లను సమీపించునప్పుడు మాత్రమేకాక ఎల్లప్పుడు పరీక్షించుకోవాలి. పై వాక్యంలో, తమను తాము పరీక్షించుకోకుండా, బల్లను సమీపించుట వల్లనే, చాలామంది మనలో రోగులౌతున్నారు. చాలా మంది మరణించుచున్నారు, అని చెప్పాడు. నిజమే. అపవిత్రత కొంచెమైన, అది మనలను ఆత్మీయంగాను, శారీరకంగాను విషపూరితం చేస్తుంది.

ఈ రాత్రి మీరు నిద్రకుపక్రమించక ముందు మీ హృదయాన్ని ఆయనకు అప్పగించి, పరీక్షించనివ్వండి. మీరు కూడా

దేవునితో కలిసి మీ హృదయంలో ఇంకా ఏదైనా (కొంత ద్వేషం, పగ, లేక ఏవైనా మీరు మర్చిపోయిన పాపము) ఉన్నదేమో వెదకండి, వాటిని ప్రభువు మీనుండి తీసివేయాలని కోరుకుంటున్నారు. ఇక మీరు ఈ రాత్రి ఎటువంటి చింత లేకుండా ప్రశాంతంగా నిద్రించవచ్చు.

ప్రసంగము 3

# నాకున్నది ఒక స్వప్నం

"నాకు ఒక స్వప్నం ఉంది"! మీకు ఈ మాటలు ఎక్కడో వినినట్లున్నాయా? ఇవి రెవ. మార్టిన్ లూథర్ కింగ్ ఉద్యమకర్తచే చెప్పబడిన చాలా ప్రసిద్ధిగాంచిన మాటలు. ఈ ఆఫ్రికన్ అమెరికన్ ఉద్యమకర్త అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని వర్ణవివక్షకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో, ఉత్తేజాన్ని కలిగించు ఈ సందేశాన్నిచ్చాడు. ఆయన కలకొరకు తన ప్రాణాన్ని అర్పించాడు. అతని లక్ష్యం గురించి అతను హత్యచేయబడ్డాడు.

**మీకేమైనా స్వప్నం ఉందా? ఉంటే ఆ స్వప్నమేమిటి?**

మార్టిన్ లూథర్ కింగ్ వలె మీ స్వప్నం కొరకు మీరు చనిపోవుటకు కూడా సిద్ధపడి ఉన్నారా? నేను అమెరికా సంయుక్త రాష్ట్రములో పయనిస్తున్నప్పుడు, చాలా పట్టణాలు, రహదారులు మార్టిన్ లూథర్ కింగ్ పేరు పెట్టబడి ఉండడము, నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అమెరికన్లపై ఆయన స్వప్నం, బలమైన ప్రభావం చూపినట్లుగా తెలుస్తుంది. అమెరికన్లకు ఆయన ఒక నిరీక్షణకు చిహ్నము, ఒక ప్రసిద్ధ పురుషుడు. ఆయన కలకు ఫలితంగా, ఈనాడు అమెరికా. సం. రాష్ట్రములో ఆఫ్రికన్ అమెరికన్లు

మునుపటి కంటె, చాలా మెరుగైన స్థాయిలో, పై అంతస్తులో ఉన్నారు కాని ఈ స్వప్నము, ప్రాణాలు అర్పించవలసినంత విలువైనదా? స్వప్నాన్ని సుసాధ్యపరచుకొనడానికి, ఆయన చావు ఒక శక్తివంతమైన సాధనంగా మారింది.

**మీకున్న స్వప్నం మీ జీవితాన్ని నిర్ణయిస్తుంది.**

మీకు ఒక కల అనేది లేకపోతే, మీకు ఒక దిశ లేనట్టే. మీకల ఒక మంచియిల్లు, ఒక మంచికారు ఉండాలని అయితే, మీ జీవిత సర్వము అవే అయివుంటాయి. ఇల్లు, కారు వచ్చాక, మీ కల తీరిపోయినట్లే. మీ కలకు ముగింపు వచ్చేసింది.

మీ అందమైన స్వప్నాల గురించి, నేను మాట్లాడాలనుకుంటున్నాను అలాగే, మీ కలలను భయంకరమైన పీడకలలుగా మార్చగలిగే కఠోర వాస్తవాల గురించి కూడా, నేను మాట్లాడాలనుకుంటున్నాను.

క్రైస్తవులమైన మనము కలలు కనాలి. ఆయన పరిశుద్ధాత్మను మనకు అనుగ్రహించునప్పుడు, మనలను కలలు కనువారినిగా చేస్తానని ఆయన వాగ్దానము చేసాడు. తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును. మీ కుమారులును, మీ కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు. మీ ముసలివారు కలలు కందురు, మీ యౌవనులు దర్శనములు చూతురు.'' అని యోవేలు 2:28లోను, అ.కార్యము 2:17లోను చెప్పబడింది. నన్ను కలవరపరిచే దేమిటంటే, చాలా కొద్దిమంది క్రైస్తవులే కలలు కంటున్నారు. దర్శనాలు చూస్తున్నారు. దేవుని ప్రేరణవల్ల మనకు కలలు వస్తాయి. ఒక దర్శనముకాని, కలకాని లేని క్రైస్తవ జీవితము చాలా నిస్సారమైనది. వీరు దేవుని ఆత్మలేని

క్రైస్తవులు. ప్రజలకుదర్శనాలు లేకపోతే, వారు త్రోవతప్పుతారని బైబిలు సెలవిస్తుంది.

## మన స్వప్నాలు ఎందుకు నిష్ఫలమౌతాయి

కఠోరమైన వాస్తవాలను ఎదుర్కొన్నప్పుడు, కలలు భయంకరమైన పీడకలలుగా మారే అవకాశం వుంది. ఉదాహరణకు ఈనాటి చైనానే తీసుకోండి, ఇప్పుడు అది ఎటువంటి దర్శనము లేని దేశము; ఒకప్పుడు కమ్యూనిజమ్ కొరకు, సర్వజనసమానత (సోషలిస్ట్) ద్వారా, నెరవేరుటకు సాధ్యపడని, ఒక కల ఉండేది. కాని, ఇప్పుడు ఆ కల కాస్తా చప్పబడిపోయి, పీడకలగా తయారయ్యింది.

మనము కలలు కనాలి. కాని మన కలనిజమవ్వాలంటే అందులో ఇమిడి ఉన్న కఠినమైన వాస్తవాల గురించి, స్పష్టమైన అవగాహన ఉండాలి. నేల విడిచి సాము చేయకుండా, వాస్తవికతను ఎదుర్కొనాలి.

## మన కలలు ఎందుకు నిష్ఫలమౌతాయి?

ఎందుకంటే జీవితంలో ఎదురయ్యే కఠోర వాస్తవాలను తట్టుకోలేక నిష్ఫలమౌతాయి. దీనినే మన హృదయంలో పాపము అంటాము. పాపమే మన కలలను ఎప్పుడూ పీడకలలుగా మార్చేస్తుంటుంది. ఇది మన స్వంత అనుభవం ద్వారా తెలుసుకుంటాము. వివాహంలో దంపతులు ఒక అందమైన కలతో జీవితాన్ని ప్రారంభిస్తారు. ఒకరినొకరు వారు చూసుకునే తీరు, మాటలాడేటప్పుడు ఒకరి నొకరు చూచి చిందించే ఆ చిరునవ్వులు, మనం చూడవచ్చు. దేవాలయంలో జరిగే ఆ వివాహము, ఆర్గాను

మ్యూజిక్, పువ్వులు, ధవళవర్ణ వస్త్రాలలో వధువు, అందమైన నల్ల సూటులో వరుడు ఆహా! ఎంత అందమైన స్వప్నం! చాలా వివాహాలను నా ఆధ్వర్యంలో జరిపించాను. అలాంటప్పుడెప్పుడూ, ఈ కలచిరకాలం ఉండాలని' ప్రార్థిస్తుంటాను. కాని, తర్వాత, ఆకస్మాత్తుగా, వారు ఆ కలలోనుండి మేల్కొని, వాదులాడుకొనుట, పోట్లాడు కొనుట మొదలుపెడతారు. ఎంతోకాలం గడవకముందే, వారిద్దరూ వైవాహిక జీవితంలో సమస్యలొచ్చి, సలహాలు తీసుకొనుటకు నా దగ్గరకు వస్తారు.

**కల పీడకలగా ఎలా మారుతుంది?**

ఇప్పుడు పీడకలగా మారిపోయిన ఆ మధురస్వప్నానికి ఏమైంది? ఒకసారి, మధ్యరాత్రిలో ఒక దంపతులు, సమస్యాత్మకమైన వారి వివాహంపై సలహాలకొరకు నన్ను లేపారు. వారి కల ఎలా పీడకలలా మారిందో, వాళ్ళు చెప్పుతున్నప్పుడు, రెండుగంటలపాటు నేను వింటూనే ఉన్నాను. ఆ భార్య మాత్రం దుఃఖము ఆపుకోలేక పోతుంది. అయ్యో! ఎంత పీడకల! అయితే, క్రైస్తవ జీవితం అంటేనే అది సింహస్వప్నం వంటిది కదా అని మీరనవచ్చు. దేని గురించి అన్నా కల కనాలంటే, జీవితంలో ఇంకా ఏమి మిగిలింది? మన దేవుడు అతి పరిశుద్ధుడు, నీతిమంతుడు కనుక, మన యొక్క ప్రతి కదలికను ఆయన గమనిస్తూ, తప్పులు చెయ్యగానే శిక్షించుటకు సిద్ధంగా ఉంటాడనే భయంతో ఉంటాము. ప్రతీరోజు ఎదుర్కొనే పాపముతో పోరాటంలో, చాలాసార్లు మనం ఓడిపోతూనే ఉంటాము. అది నిజంగా ఒక పీడకల కాకపోయినా, కనీసం తలనొప్పి అన్నా కలుగజేస్తుంది. తిరిగి ప్రతీరోజు రాత్రి దేవుని సన్నిధిలో మోకాళ్ళూని, “నన్ను క్షమించయ్యా, నన్ను

క్షమించయ్యా, నన్ను క్షమించయ్యా!'' అని పదే పదే దేవుని వేడుకుంటూ ఉంటాము. ఇలాచూస్తే, మన క్రైస్తవ జీవితమంతా, క్షమించమని అడగటంతోనే సరిపోతున్నట్లున్నది. గత రెండు సందేశాలలో చెప్పినట్లుగా, ఫిలిప్పీ 4:4 మరియు 1తిమోతి 6:17 నుండి చదివినప్పుడు "పౌలు, సంతోషం గురించి, మరియు సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేస్తానని'' చెప్పిన దేవుని గురించి చెప్పినప్పుడు, ఇదేదో మనకింతవరకు ఏమీతెలియని వినూత్నమైన క్రైస్తవ్యం వలె అనిపిస్తుంది.

**పాపము మన కలలను నాశనం చేస్తుంది :**

మన కలలను నశింపచేయునది ఏమిటంటే, పాపము యొక్క నిజస్వరూపమే. ఈ పాపము అనే మాటను మనము గమనించినప్పుడు, దేవుడు మనము పాపులమని, మనకెల్లప్పుడు గుర్తుచేస్తూ, నరకకూప భీతితో మనలను భయపెడుతున్నట్లుగా మనము అనుకోకూడదు. కొన్ని సార్లు దేవుడిని మనసొంత తండ్రిలాగ, ఖండితమైనవాడు, అనుచితమైనవాడు అయివుండవచ్చని అనుకుంటుంటాము. కాని దేవుడు అలాటి వాడుకాదు. ఆయన మన యెడల ఎంతోప్రేమకలిగినవాడై, పాపమునుండి మనలను రక్షించగోరుతున్నాడన్న దృష్టితో మనం చూడాలి. ఆయన ప్రేమను మనము అర్ధంచేసుకోవాలని ఆయన కోరుతున్నాడు. ఎంతో ప్రేమతో, "నేను మిమ్మును ప్రేమిస్తున్నాను, మీ యెడల నా ప్రేమను గురించి మీకు చెప్పాలనుకుంటున్నాను.' అని ఆయన అంటున్నాడు.

పాపము మన జీవితంలోని ఔన్నత్యాన్ని పాడుచేస్తుంది.

అల్పకాలపు ఆనందాన్ని పాపము కలిగిస్తుందేమో కాని, మీలో నిలిచి ఉండవలసిన సంతోషాన్ని తీసివేస్తుంది. (హెబ్రీ 11:25) పాపము కొంత ఆనందాన్ని ఇవ్వకపోతే, ఎవ్వరూ పాపము చెయ్యరు. ఎవరైనా ఒక ఉన్నతమైన జీవన సరళికోసమే ఏదైనా చేస్తుంటారు. అలాంటప్పుడు, పాపము తాత్కాలికంగానైనా కొంత ఆనందాన్ని ఇస్తున్నప్పుడు, ఎందుకు కాదంటారు! అయితే తర్వాత జరిగే పరిణామాల గురించి మీరాలోచించాలి. నిత్యము నిలిచిఉండు సంతోషము మీకు కావాలి, కాని అల్పకాలపు ఆనందము కాదు. ఏమి చెల్లించకుండా, ఏదో ఒకటి పొందాలనుకునే ఆనందం కోసం, ఎంతో మంది షాపుల్లో దొంగతనాలు చేస్తున్నారు. కేవలం కెనాడాలో, ఇలా దుకాణాల్లో దొంగిలింపబడిన సొమ్ము మొత్తం సంవత్సరానికి 2.4 బిలియన్ల డాలర్లు. ఇదసలు మీరు ఊహించగలరా? ఇది కేవలం ఒక మిలియన్ అంటే ఒకటి ప్రక్కన 9 సున్నాలు నిజంగా మతి చెదిరిపోతుంది. అంటే, సగటున కెనడాలోని ప్రతి మగవారిపై, ఆడవారిపై, పిల్లవాడిపై కూడా 83 డాలర్లు పడుతుంది. ఎవరో కొట్టేసిన దానికొరకు, దాదాపు 83 డాలర్లు పైగా మొత్తం సంవత్సరానికి మీరు, నేను చెల్లిస్తున్నాము. (చాలావరకు పిల్లలు చెల్లించరు). అందుకే పాపము అనేది ఆలయములో కూర్చొని, చాలా సహజముగా మనము మాట్లాడుకొనే అంత సామాన్యమైనది కాదు. ఇలా లక్షణంగా ఉండే కెనడావారు, దుకాణాలనుండి కొట్టేసిన దానికి, మనము బదులు చెల్లించాల్సి రావడం పాపమేగదా. ఇటువంటి వారు కొందరు పట్టుబడి, చేసిన దానికి నేరస్తులుగా లెక్కింపబడి, భవిషత్తును ధ్వంసం చేసుకుంటారు. ఇటువంటి పాపము ఎవరికైనా కలను పీడకలగా మారుస్తుంది.

పాపము వివాహాలను ధ్వంసం చేస్తుంది. విడిపోయిన కుటుంబాలలో బాధ దంపతులను, పిల్లలను, ఇరువురి కుటుంబాలను కూడా కృంగదీస్తుంది. ఎందుకు ఈ బంధాలు తెగిపోతున్నాయి? స్వార్థం, పంతాలు, అహంకారము లేక పాపము యొక్క ఏదో ఒక రూపమే, ఈ తెగతెంపులు కలుగచేస్తున్నాయి. ఇంతకు ముందు నేను ఒక దంపతుల గురించి చెప్పినప్పుడు, ఆ భార్య దాదాపు రెండు గంటల పాటు ఏడుస్తూనే ఉంది అని చెప్పాను. కాని ఆ భర్త మాత్రం పదేపదే, "నాకు హక్కుంది! నేను భర్తను కాబట్టి నాకు హక్కుంది"! అని చెప్తూనే ఉన్నాడు. నాకామాటలు విని విని విసుగెత్తి, అతని సమస్య ఎక్కడ ఉందో అది అతనికి చెప్పాను. అది అతని భయంకరమైన స్వార్థం, అతని దృష్టిలో ఆమెకు ఎటువంటి హక్కులు లేవు. భార్యాభర్తలు ఎవరికి వారు, వారి హక్కుల కోసం పోట్లాడుకొనే ఈ మనస్తత్వం నాకు అర్థం కాదు.

## ఈ కల అనేది ఏమిటి?

ఈ కల అనేది ఏమిటి? ప్రతీది ఆచరణలో పెట్టగలమా! అని ఆలోచించే వ్యక్తిని నేను. మేము గుడిని కట్టాలని మాట్లాడుకొనునప్పుడు, మాకు ఒక కల అనేది తప్పకుండా ఉండాలి. ఒక ఊహ. మేము అందరము కలిసి పనిచేయాలన్నది నిజమే, కాని దేనికొరకు? మేము ఒక చక్కటి ఆకృతిగల కట్టడమును కట్టాలని అనుకుంటే, ఆ ఆకృతిని ముందు మా మనసులద్వారా మేము చూడగలిగి ఉండాలి. మా హృదయాలలో ఒక స్పష్టమైన సంకల్పము ఉండాలి.

ఒక నూతన సమాజముగా సంఘాన్ని కట్టుటకు మనము పిలువబడ్డాము. దురదృష్టకరమైన సంగతేంటంటే, ఈనాడు

‘సంఘం’ అని మనము అనుకున్నప్పుడు, చిన్నదో, పెద్దదో ఒక కట్టడంగానో, ఒక ప్రజల గుంపుగానో ఊహించుకుంటున్నాము గాని, దేవునిచే రూపొందించబడిన ఒక నూతన సమాజముగా, సంఘాన్ని మనము పరిగణించుట లేదు.

ఉదాహరణకు, మనము చైనాను చూసినట్లయితే, చైనాకు ఒక నూతన సమాజము గురించిన కల ఇకపై లేదు. అయితే, చైనాకు ఎటువంటి కలలేని కారణాన, అది నశించిపోతుంది కనుక, మనము చైనాను గురించిన ఆలోచన కలిగినవారమైతే తిరిగి ఆకలను చైనా పొందగలిగేలా చేయాలి. చాలా సందర్భాలలో నేను చైనా పర్యటించడము జరిగినది. వెళ్ళినప్పుడల్లా నా హృదయమంతా భారంతో నిండుకుంటుంది. ఎటువంటి గమ్యంలేని దిశలో చైనా ఉంది. ముఖ్యంగా ఇంకా కొంత ఆ భావాలు మిగిలిఉన్న యవ్వనస్తులు, చాలా మంది విద్యార్థులు, ‘చదువుకొనుటలో తమకు ఎటువంటి భవిషత్తు కనిపించుటలేదు’, అని నాతో అన్నారు. ఒక వైపు కాదు, ఏ రంగంలోను భవిషత్తులేదు. మొట్టమొదటిగా యవనస్తులకొరకు చైనాలో గమ్యం చూపించేదిశలేదు. ఎటు పయనిస్తున్నారో ఆ ప్రజలకే తెలియదు. రెండవదిగా పట్టభద్రుడైనవాడు, ఉద్యోగచేసి సరిపడినంత డబ్బు సంపాదించుకొనుట, చాలా కష్టతరము. తనకన్నా చిన్న చిన్న వ్యాపారాలు సొంతంగా చేసుకునే వాళ్ళు, రోడ్డుమీద టి.షర్టులు అమ్ముకొనేవాళ్ళు ఎక్కువ సంపాదిస్తున్నారు. ఇంక చదివి ఏమి ప్రయోజనము? అంతేకాకుండా దేశం కోసం ఏమన్నా చేద్దాము అనే ఆలోచన, ఆ ఊహ కూడా ఎవరికీ లేనట్లుంది. అవినీతి ప్రబలమౌతున్న రీతి చూస్తుంటే, అది ఏదన్నా కల అనేది మిగిలి

ఉన్నా, దానిని కూడా నాశనం చేస్తుంది. బహుశ, ఈ కమ్యూనిస్టులు, గతంలో ఒక క్రొత్త సమాజము కోసము ఏదన్నా కల కన్నారేమో కాని, ఇప్పుడైతే, వారు అది కోల్పోయారు. అందరూ వారి పదవులను, ధనవంతులగుటకు మాత్రం ఉపయోగించు కుంటున్నారు. ఇలాగే జరుగుతూ పోతే చైనా దేశం ఏమైపోతుందో తెల్సా?

మనము విదేశాలలో కూర్చుని, "మనము చేయగలిగింది ఏమి లేదు''. అంటాము కాని, మనకు ఒక కల అనేది ఉంటే, మనం చేయగలిగింది ఉంది. అందుకే, మన దేవుడు కలలనిచ్చు దేవుడు, అని నేను అన్నాను. పెంతెకొస్తు దినాన, యోవేలు 2వ అధ్యాయంలో చెప్పబడిన మాట నెరవేరింది. ఆ ఆత్మ క్రుమ్మరింపు జరిగింది (అ.కార్యములు 2 వ అధ్యాయములో అది చెప్పబడింది)

## మీరు ఆ దర్శనాన్ని కలిగి ఉన్నారా?

ఆ ఆత్మను మీరు పొంది ఉన్నారా? ఆ దర్శనాన్ని మీరు పొందుకో గలిగారా? ఆ దర్శనం మూలాన మీరు అన్ని విధాల కష్టాలను తట్టుకోగలరు. అదే ఒక క్రైస్తవుని దర్శనంలోని ప్రాముఖ్యమైన విషయం, నిజ జీవితంలో ఎదుర్కొన వలసిన కఠినమైన వాస్తవాలగురించి క్రైస్తవునికి తెలుసు. అయినను వాటన్నిటిని జయించుటకు ముందుకు సాగిపోతూ వుంటాడు. ఎప్పుడైతే క్రైస్తవుడు, సమస్య వచ్చిన ప్రతీసారి పడిపోతూ ఉంటే, అతనికి దర్శనము లేదని చెప్పవచ్చు. దురదృష్టవశాత్తు సంఘంలో చాలామంది అలాటివారే. క్రీస్తుయొక్క యోధుని వలె, ప్రతి కష్టాన్ని సహిస్తూ ఉండాలంటే, మీరు స్వప్నం కలిగియుండాలి. ఈ స్వప్నం కొరకు మీరు మరణించుటకుసైతం సిద్ధపడి ఉండాలి.

దేవుని ఆత్మ మీ మీదికి వచ్చినప్పుడు, ఆ కలని మీరు పొందాలని నేను ప్రార్థిస్తున్నాను. కష్టాలు ఉంటాయి. ఎందుకంటే పాపము, దాని అనుచరులు, మీరెక్కడికివెళ్ళినను మీకు విరోధముగా ఎదురు నిలుస్తారు. ఎప్పుడు మీరు కలకలిగి వుంటారో, మిమ్మల్ని ఎదుర్కొనే కొంతమంది పెద్ద శత్రువులు, క్రైస్తవులే ఉంటారని సిద్ధపడండి, అది సంభవించినప్పుడు, మీకు చాలా విస్మయము కలిగించవచ్చు, ఎందుకంటే కలలు కలిగి ఉన్నవారిని, కలలు లేనివారు ఎప్పుడూ, ఎదురు నిలుస్తూ ఉంటారు. మిమ్ముని వ్యతిరేకిస్తారు. పాతనిబంధనలో గొప్పకలలు కనిన యోసేపును చూస్తాము. అతని కలల వల్ల, అతని స్వంత సహోదరులు అతనిని చంపాలనుకున్నారు. దేవుడు కలుగచేసుకొని అతని ప్రాణాన్ని రక్షించాడు. ఎంత అద్భుతం కదా!

చాలా కాలం క్రితం కమ్యూనిస్టులు కల కలిగి ఉన్నప్పుడు లాంగ్ మార్చికి వారు సన్నద్ధులై ఉన్నారు. అన్ని రకాల కష్టాలను సహించారు. ఆ కల కొరకు ఎంతోమంది మరణించారు. కాని ఇప్పుడు ఆ కలంతా చెదిరిపోయింది. ఎవ్వరూ ఇకపై కష్టాలు ఎదుర్కొనుటకు సిద్ధంగా లేరు. ఇప్పుడు అవినీతికి సమయం. ఇదేరీతిగా, సంఘానికి ఎటువంటి కలఅనేది లేనప్పుడు, సంఘములో అవినీతి చోటు చేసుకుంటుంది. ప్రేమ లోపిస్తుంది. సత్యాన్ని వ్యతిరేకిస్తారు. కలలు కను ప్రతివాడు ఎదుర్కోవలసిన కఠోర వాస్తవం ఇది.

**పాపము స్వప్నాలను నాశనం చేస్తుంది :**

లోకములో పాపము ఉంది, దాని శక్తి ఎంత భయంకర మైనదో! ఈ మధ్యే వార్తలలో ఈ సంగతి విన్నాను. ఒక కొడుకు,

ఆస్తికొరకు తన తల్లిదండ్రులను చంపించడానికి, డబ్బిచ్చి హంతకులను నియమించాడు. తన తల్లిదండ్రుల ఆస్తితో అతను పాపభోగాలు అనుభవించాలనుకున్నాడు. అయితే, ఇప్పుడు ఆ డబ్బుని అనుభవిస్తూ అతను ఎక్కువకాలం జీవించబోవడం లేదు. ఎందుకంటే అతను తన జీవితంలో చాలా భాగం జైలులోనే, తను చేయించిన, హత్య గురించి ఆలోచిస్తూ గడపడానికి, చాలా సమయం దొరికింది. విలాసాలను అనుభవించాలన్న స్వార్ధ పరమైన దురాశ శక్తి, అతని తల్లిదండ్రులను అంతమొం దించింది. మన కలలను సార్ధకం చేసుకోవాలంటే, తల్లి దండ్రులకు, పిల్లలకు మధ్య ప్రేమ, గౌరవము అనేవి చాలా ప్రాముఖ్యమైనవి. అయితే జీవితంలోని ఇటువంటి ఔనత్యాలను, పాపము నాశనము చేస్తుంది. పాపము బైబిలులోని ఒక వేదాంత సంబంధమైన విషయం అని మీరు అనుకుంటున్నారా? కాదు, ఇది జీవితములోని వాస్తవము. పిల్లలు తల్లిదండ్రులను చంపడము, తల్లిదండ్రులు పిల్లలను చంపడము. ఇది ఎంత ఘోరమైనది!

అందుకే, కలను నిర్మించాలంటే, మనకు పాపమును జయించగల శక్తి ఉండాలి. ముందుగా మనలోని పాపమును మనము జయించాలి. ఎందుకంటే, పాపము మనందరిలోనూ ఉంటుంది. మనము, వాస్తవంగా ఆచరణలో, ఏమి జరుగుతుందో ఆలోచిద్దాం. మన వివాహాలనే మనం నిలుపుకోలేనప్పుడు, ఒక వాస్తవమైన కలను ఎలా కలిగి ఉండగలము? నాకు తెలిసి చాలా కొద్ది మంది వివాహజీవితాలలో మాత్రమే, ఐక్యమత్యమును చూశాను. చాలా మంది దంపతులలో ఎప్పుడూ ఏదో ఒక ఒత్తిడి ఉంటూనే ఉంది. మన వివాహమే ఒక వ్యధ అయితే, ఇక అందమైన

కలకుకావలసిన సంతోషం ఎలా వస్తుంది? దేవుని శక్తి వివాహసమస్యలను జయించుటకు మీలో కార్యము చేయలేనప్పుడు, ఒక నూతన సమాజమును స్థాపించుటకు, ఆ శక్తి ఏ విధంగా సరిపోతుంది? అప్పుడు మనము వ్యర్ధంగా ఇదంతా మాట్లాడుతున్నట్లవుతుంది.

నేను కలలు కంటాను, కాని నేను వాస్తవాలకు అతీతుడను కాను. ముందున్నటువంటి, ఇబ్బందుల గురించి, నాకు ఎటువంటి భ్రమలు లేవు, పాపము వలన ఏర్పడే కష్టాలు వాస్తవికంగా మనకి తెలుసుకాని, అధిగమించే శక్తి కూడా మనకు ఉంది.

**కలదేని గురించి?**

మన కల ఏమిటి? కల దేనిగురించి అనేది నేను ఒకసారి చూడాలనుకుంటున్నాను. ఈ నూతన సమాజము యొక్క సిద్ధాంతము ఏమిటి? మనమందరము కలిసి నిర్మించాలను కుంటున్నదేమిటి? రోమా 15:1-5లో చెప్పబడుచున్న ఆ మూల ప్రాధమిక సూత్రాలతో ప్రారంభిద్దాం.

“కాగా బలవంతులమైన మనము, మనలను మనమే సంతోషపరచుకొనక, బలహీనుల దౌర్భల్యములను భరించుటకు బద్ధులమై యున్నాము. తన పొరుగువానికి క్షేమాభివృద్ధి కలుగునట్లు మనలో ప్రతివాడును మేలైన దానియందు, అతనిని సంతోషపరచవలెను. క్రీస్తు కూడా తన్నుతాను సంతోషపర చుకొనలేదు, గాని - ‘నిన్ను నిందించువారి నిందలు, నా మీద పడెను,’ అని వ్రాయబడినట్లు ఆయనకు సంభవించెను. ఏలయనగా ఓర్పువలనను, లేఖనముల వలని ఆదరణవలనను, మనకు నిరీక్షణ

కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు, మనకు బోధ కలుగునిమిత్తము వ్రాయబడియున్నవి. మీరేక భావము గలవారై యేకగ్రీవముగా, మన ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియగు దేవుని మహిమ పరచునిమిత్తము, క్రీస్తు యేసు చిత్తప్రకారము ఒకనితో ఒకడు మనస్సు కలిసినవారై యుండునట్లు ఓర్పునకును, ఆదరణకును కర్తయగు దేవుడు మీకు అనుగ్రహించును గాక.'

ఈ వాక్యములో "సంతోషపరచుకొనుట" అనే మాటను మీరు గమనించాలని నేను కోరుచున్నాను. మొదటివచనంలో, "మనలను మనము సంతోషపరచుకొనక" అని కనిపిస్తుంది. 2వ వచనంలో "పొరుగువానిని సంతోషపరచవలెను" అని 3వ వచనములో, "క్రీస్తు కూడా తన్ను తాను సంతోషపరచుకొనలేదు" అనే మాటలు చూస్తాము, తర్వాత 4, 5 వచనములలో "ఆదరణ" అనే మాట కనిపిస్తుంది. ఒకరినొకరు సంతోష పెట్టడమంటే, అవతలి వ్యక్తిని ఆదరించుట, మరియు అతనికి క్షేమాభివృద్ధి కలుగజేయుటయేనని అర్థము చేసుకొనుటకు పై మాటలు తోడ్పడుతున్నాయి. ఇప్పుడు మనము, తమను తాము సంతోష పరచుకొనుటయందు ఏ ఆసక్తి కనుపరచక, ఇతరులను ఎలా ఆదరించాలని, వారికి ఏ విధంగా క్షేమాభివృద్ధి కలుగచేయాలనే ఆలోచన కలిగి, ఉండేటటువంటి ప్రజలున్న ఒక సమాజమును ఊహించుకుందాము.

దీనినే మీ వివాహబంధాలకు అన్వయించండి. వివాహము చేసుకున్నవారు, ఎందుకు విడిపోతున్నారు? ఆనందంగాను, అనురాగంతోను మొదలైన దాంపత్యజీవితం, ఒకేసారి ఇంత త్వరగా ఎందుకు పాడయ్యింది? జవాబు చాలా సామాన్యమైనది. రహస్యం

ఇక్కడే ఉంది. సామాన్యమైనదే కాని అదే సత్యం. సత్యం అనేది సత్యము అవ్వడానికి, చాలా క్లిష్టమైనదిగా ఉండాలి అని మనము అనుకోకూడదు. సత్యము యొక్క గొప్పతనమేమిటంటే అది అతి సామాన్యంగా ఉంటుంది. కాని ఆచరణలో పెట్టాలంటే అత్యంత కష్టమైనది చూడండి. వివాహానికి ముందు లేదా మొదట్లో ఒకరినొకరు సంతోషపరచటానికి ప్రయత్నిస్తుంటాము. నీకేమంటే ఇష్టం? నీకు ఎక్కడికెళ్ళాలని ఉంది? మనం ఇది కొందామా? నీకు ఇది ఇష్టమా లేక అది ఇష్టమా? అని ఇలా అడుగుతూ ఉండేవారము. దంపతుల్లో ఇద్దరూ ఒకరినొకరు సంతోషపరచాలని ప్రయత్నిస్తుంటారు. గుడిలో ఇద్దరూ అలా ప్రక్కప్రక్కన కలిసి నడుస్తుంటే, ఎంత బాగుంటుంది!

మరి వివాహము తర్వాత ఏం జరుగుతంది? హనీమూన్ అయిపోగానే పద్ధతుల్లో, ఒక ప్రాథమికమైన మార్పు మొదలవుతుంది. అదేమిటంటే, ఇకనుండి, నువ్వు నన్ను సంతోషపరచాలి! దీని మూలంగా, ప్రతీ మానవ సంబంధం విడిపోయే అవకాశం వస్తుంది. తల్లిదండ్రులు, పిల్లల విషయంలో కూడా ఇదే జరుగుతుంది. దీన్ని మనం కొంచెం అందంగా "జనరేషన్ గ్యాప్" తరాల మధ్య వున్న అంతరం అని చెప్పుకున్నా, సమస్య ఉన్నది, అన్న విషయం సుస్పష్టం. మేము తల్లిదండ్రులము, కాబట్టి ఎట్టిపరిస్థితుల్లో మీరు మమ్మ సంతోషపరచాల్సిందే అని తల్లిదండ్రులు అంటారు. పిల్లలేమో, "మొదట మీరు మమ్మ సంతోషపరచనప్పుడు, మేము మిమ్మలనెందుకు సంతోషపరచాలి?" అని అంటారు. ఇటువంటి భావనల వలననే మానవ సంబంధాలు చిక్కుల్లో పడుతున్నాయి.

"ఒకరినొకరు సంతోషపరచుట" అను సూత్రమును ఆచరిస్తే ఏమి జరుగుతుంది? వివాహము జరిగిన తర్వాత, ఆ దంపతులిరువురూ ఒకే కలను కలిగి ఉండాలి. ఇద్దరూ కలిసి కొంత సమయము గడపగలగడమే, వారి కల కేంద్రము అయితే, ఇక అది ఒక పెద్ద కల కానేకాదు కాని, ఇద్దరికీ ఒకే లక్ష్యం, ఒకే దిశ ఉంటే ఇద్దరూ కలిసి దేవుని కొరకు ఏదైనా సాధించగలరు. అప్పుడు ఆ వివాహానికి ఒక లక్ష్యం, ఒక కల ఉంటుంది, అయితే, ఈ లక్ష్యమును ఇద్దరూ పంచుకొనగలిగి ఉండాలి. ఒకరికే ఆ గురి ఉండి, మరొకరికి లేనట్లయితే అప్పుడు ప్రయోజనం ఉండదు. సంతోష పరచుట అంటే ఆ వ్యక్తిని ముఖస్తుతి పొగడ్తలతో, ముంచెత్తటము కాదు, వారికి వినసొంపైన విషయాలు మాత్రమే, వారిని సంతోష పరచుటకొరకు మాట్లాడుట కాదు. మంచి దాంపత్యమంటే ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందున్నటువంటి ఆ గురివైపుకు కలిసి సాగిపోవుట.

**సంఘములోనూ ఇదే సమస్య :**

అలాగే, సంఘములో కూడా ఇదే సమస్య ఉత్పన్నమయ్యింది. మనలో ఒకరికొకరికి ఆపేక్షలు. నీవు క్రైస్తవుడివి కాబట్టి, నీకు అన్ని బాగా తెలిసి ఉండాలని, నువ్వు అది చేయగలిగి ఉండాలి. ఇది చేయగలిగి ఉండాలి, అని వాళ్ళలో వాళ్ళకి ఏవో డిమాండులు. నీలో ఆత్మీయత అవసరమైనంత లేదని, దేవుని ప్రమాణాలను నేను అర్ధం చేసుకున్న స్థాయికి నీవు ఎదగలేదని, ఇటువంటి అపోహల కారణంగా, ఒకరిపై ఒకరము ఒత్తిడి తెస్తున్నాము.

కాని కలలనేవి, మనుష్యులను ఉత్తేజపరిచేవిగా ఉండాలి.

ప్రజలు ఆ కలవైపుకు ఆకర్షింపబడాలి. బలవంతంగా ముందుకు నెట్టాల్సిన అవసరం రాకూడదు. నిజంగా ప్రేరేపింపబడినట్లయితే, ప్రజలు ఏదైనా చెయ్యడానికి ఇష్టపడతారు. కాని, అసలు కల అనేదే లేనప్పుడు, మీరు ప్రతీరోజూ తిట్టినా, ఏమి ప్రయోజనము ఉండదు. పైగా సమస్య ఇంకా జటిలం అవుతుంది.

ఒక బాల్ టీమ్‌కి నేను కోచ్‌గా ఉండేవాడిని. ఒక కోచ్‌గా ఆటగాళ్ళను ప్రోత్సహించవచ్చు, లేక నిరుత్సాహపరచవచ్చు. బాగా వారిపై కేకలేసి, ఇంకా బాగా చేయాలి అని వారిపై గట్టిగా అరిచి చెప్పవచ్చు లేక, ప్రయత్నం చెడ్డదేమికాదు, కాని నువ్వు ఇంకా బాగాచెయ్యగలవు. ఇకపై నేర్పుగా ఆడి, గెలవడమెలాగో నేను చూపిస్తాను అని చెప్పవచ్చు. వారి ముందు ఉన్న లక్ష్యాన్ని చూపించండి. అది చేరుకోడానికి ప్రోత్సహించండి. ఇదో వ్యత్యాసమైన మార్గము. ప్రోత్సాహము యొక్క ప్రభావము ఎంతో అద్భుతంగా ఉంటుంది.

నేను వ్యక్తిగతంగా దీనిగురించి ఇంకా ఎక్కువ నేర్చుకోవాలి. నేను ఎక్కువగా ఎవరిని పొగిడే వ్యక్తినికాను. పోయిన సంవత్సరము, మా గుడి ఆరాధన ముగిసిన తర్వాత, "మంచి సందేశాన్నిచ్చావు" అని వాక్యమందించిన మా తోటి సహచరునితో అనగానే, అతడు ఆశ్చర్యంతో, నోరు తెరచినంత పనిచేసాడు. "నీ నుంచి పొగడ్త అందుకోవడము ఎంత కష్టమైనది!" అని అన్నాడు. తర్వాత ఆ మాటలు నన్ను చాలా ఆలోచింపచేసాయి. నా తప్పు నాకు తెలిసింది. ఈ మధ్యకాలంలో, నేను చాలా తక్కువగా ఎవరినైనా మెచ్చుకున్నట్లు గమనించాను. ఒకవేళ నా సహచరులలో ప్రమాణాలను బాగా పెంపొందించాలన్న ఉద్దేశ్యంతోనేమో, నేను

వారిని మెచ్చుకోలేదు, కాని అవసరమైన ప్రోత్సాహాన్ని ఇవ్వకపోవుట అనేది మాత్రం నేను చేసిన తప్పు.

**ఆదరణ ఆధారంగా నున్న నూతన సమాజం :**

దేవుడు మనకిచ్చిన ఆ కల, ఆ నూతన సమాజము కేవలము ఆదరణపైనే ఆధారపడి ఉండుటను, గూర్చి ఆలోచించండి. ఉదాహరణకు ఈ నూతన సమాజము, మన మధ్య ఉన్నటువంటి పేదలను, ఏ విధంగా ఆదరించాలి? హాంగ్‌కాంగ్‌లో, మా సంఘములో మేము ఈ పని చేయడానికి ప్రయత్నిస్తున్నాము. ప్రాశ్చాత్యదేశాలలో అధికంగా ఈ పని ప్రభుత్వమే చేస్తుంది. ఈ క్రైస్తవ ప్రభుత్వాలు, పేరులోనే క్రైస్తవ్యమును ఇముడ్చుకొని, బైబిలులోని ఈ నూతన సమాజపు భావాలను చాలావరకు అవలంబిస్తున్నాయి. మునుపు సంఘం చేపట్టిన కార్యాలన్ని (ఆసుపత్రులు, అనాధాశ్రమాలు, వృద్ధుల శరణాలయాలు) ఇంకా ఇతరమైన అవసరాలను కూడా తీరుస్తూ, క్రైస్తవ ప్రభుత్వాలే ఈ పనులను చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాయి. కాని హాంగ్‌కాంగ్‌లో, ఇంకా అలాంటి పరిస్థితిలేదు. అందుకే మా సంఘాలలో మేము, మా మధ్యనున్న పేదలను, వృద్ధులను ఆదరిస్తాము. అవసరతలో ఉన్నవారికి సహాయము చేస్తాము. విధవరాండ్రను చూసే బాధ్యత మాదే. మా సంఘాలలో ఎవరూ ఆకలితో అలమటించరు.

అందుకే, ఈ నూతన సమాజము అనేది, ఎక్కడో ఆకాశంలోని అందని వస్తువు కాదు. అవసరతలో ఉన్న ప్రతివారిని మేము ఆదరిస్తాము. కొన్నిసార్లు చదువుకోవాలని ఉండి, డబ్బులేక ఇబ్బంది పడేవారికి కూడా సహాయం చేయడానికి ప్రయత్నిస్తాము అనారోగ్యముతో ఉన్నవారిని దర్శించి, ఆదరిస్తాము. సంఘములోని

ప్రతి అవసరత తీర్చబడుతుంది. అపో.కార్యములు 2వ అధ్యాయంలో పరిశుద్ధాత్మ యెరుషలేములోని ఆదిసంఘంపై ఎప్పుడు దిగినదో, అప్పుడే నూతన సమాజము పనిచేయుట ప్రారంభించింది. పేదవారికి ఏ కొరత లేని విధంగా ధనవంతులైనవారు, ధారాళముగా ఇచ్చారు. ప్రతివారికి చాలినంత ఉన్నది.

పొరుగువారిని సంతోషపరచడము అంటే, వారి భారాలను మనము మోయ్యాలి. అది వ్యాధికాని, ఒంటరితనము కాని, లేక ఏ ఇతర సమస్యకానివ్వండి. గలతీ 6:2లో చెప్పిన విధంగా “ఒకరి భారముల నొకడు భరించుడి.” ఒకరినొకరు ఆదరించు కొనుటయే, ఈ నూతన సమాజము యొక్క ఉద్దేశ్యము. మీరు ఈ సమాజమునకు చెందిన వారైతే, మీరు ఎంత పొందగలరు అన్నది ప్రశ్నకాదు, ఎంత ఇవ్వగలరు అన్నది ప్రశ్న. అందరూ ఇచ్చుటకు ప్రయత్నించినప్పుడు, మనకు ఎంతో సమృద్ధి.

**ఇవన్నియు చేయగలుగు శక్తి :**

ఇవన్ని చేయాలి అనే మార్పు, మన హృదయాలలో కలుగుటకు ఒక శక్తి అవసరమై ఉన్నది. ఆ శక్తి పునరుత్థాన శక్తి. ఎఫెసి 1:19-20 “ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు, మనయందు ఆయన చూపుచున్న తన శక్తి యొక్క అపరిమితమైన మహాత్మ్యమెట్టిదో, మీరు తెలిసికొనవలెనని, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దేవుడైన మహిమ స్వరూపియగు తండ్రి, తన్ను తెలిసికొనుటయందు, మీకు జ్ఞానమును, ప్రత్యక్షతయును గల మనస్సు అనుగ్రహించునట్లు, నేను నా ప్రార్థనలయందు మిమ్మును

గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను, ఆయన ఆ బలాతిశయముచేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యముకంటెను, అధికారముకంటెను, శక్తికంటెను, ప్రభుత్వముకంటెను, ఈ యుగమునందు మాత్రమే గాక రాబోవు యుగమునందును పేరుపొందిన ప్రతి నామముకంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు, ఆయనను తన కుడిపార్శ్వమున కూర్చుండ బెట్టుకొని యున్నాడు".

ఆ శక్తియొక్క మహాత్మ్యవేమిటంటే, యేసును మృతులలోనుండి లేపగలుగుట. అలాగే మిమ్మును, నన్ను కూడా మృతులలోనుండి లేప గలరు. పౌలు కేవలము భవిషత్యు గురించి మాత్రవే మాట్లాడుట లేదు. ఇప్పటి సంగతి కూడా మాట్లాడుతున్నాడు. కలసార్ధకం కావాలంటే, ఇతరుల అవసరాలు తీరుస్తూ, సంతోషపడగలిగే ఆ మార్పు, మానవ హృదయంలో కలుగుటకు ఆ శక్తి కలిగియుండాలి. దేవుని రాజ్యవ్యాప్తి కొరకు, ధనసహాయము చేయుటకు ఇష్టపడిన క్రైస్తవులు, నన్ను కలుసుకున్నారు. వారు ఇచ్చేది కొద్ది మొత్తాలలో కాదు. కాని 100,000 కెనడా డాలర్లకు మించిన ధనము. ఇది ఎలా సాధ్యము?

ఇదే ఆశ్చర్యకరమైన దేవుని శక్తి. ఏమి పొందాలి అని అనుకొనుట నుండి, ఏమి ఇవ్వాలి అని మనల్ని మార్చివేస్తుంది. ఈ క్రైస్తవులు తమకొరకు, మంచి మంచి కార్లు, అధునాతన వస్త్రాలు పొందుట యందు ఆసక్తి కనుపరచరు. వారి కల వ్యత్యాసమైనది. పునరుత్థాన శక్తి వారిని మార్చివేసింది. మరి నీ సంగతేమిటి? నీ కున్న కల ఏమిటి?

ప్రసంగము 4

# నీవు జీవించేది దేని కొరకు?

ఈ రోజు బాప్తిస్మము ఇవ్వడము జరిగింది కాబట్టి క్రైస్తవ జీవితానికి సంబంధించిన కొన్ని ప్రధానమైన ప్రశ్నలను ఉద్దేశించి, ఫిలిప్పీ 3:13-15 నుండి ప్రసంగించాలని కోరుకుంటున్నాను.

"సహోదరులారా, నేనిదివరకే పట్టుకొనియున్నానని తలంచుకొనను, అయితే ఒకటి చేయుచున్నాను; వెనుక ఉన్నవి మరచి, ముందున్న వాటి కొరకై వేగిరపడుచు, క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను. కాబట్టి మనలో సంపూర్ణులమైన వారందరము, ఈ తాత్పర్యమే కలిగియుందము. అప్పుడు దేని గూర్చియైనను, మీకు వేరు తాత్పర్యము కలిగియున్నయెడల, అదియు దేవుడు మీకు బయలుపరచును."

పోస్టరులమీద, బుక్ మార్కులు మీద మనం తరచూ ఈ వచనములను చూడడము వల్ల, ఈ వచనాలు మనకు బాగా పరిచయమైనవే. పౌలు చెప్పేది ఏమిటంటే, సంపూర్ణులైన వారందరూ ఈ తాత్పర్యమే కలిగియుంటారు. తను ఏది సాధించాలో, అది చేరుకున్నప్పటికీ, అది ఎంచక, వెనుక ఉన్నవి మరచి, ముందున్న వాటికొరకు తన శక్తినంతా ఉపయోగించుతాడు. ఈనాడు, ఈ వచనాలను మీ అందరికీ, ప్రత్యేకంగా బాప్తిస్మము పొందిన వారికి ఇవ్వగోరుతున్నాను.

## నీ జీవిత లక్ష్యం ఏమిటి?

ఇది చాలా ప్రాముఖ్యమైన సూత్రం. వినడానికి చాలా సామాన్యంగా ఉంది కాని వెనుక ఉన్నవి మరవడము అంటే ఏమిటి? గతంలో జరిగినవి అన్నీ మరచిపోవాలా? ముఖ్యమైన చరిత్ర పాఠాలనుండి మనం నేర్చుకొనే విషయాల సంగతి ఏమిటి? అలాగైతే, పాతనిబంధన గ్రంథములోని చరిత్రకు సంబంధించిన విస్తారభాగము, మనం చదవవలసిన అవసరం లేదా? మరియు ముందున్న వాటికై వేగిరపడడము అంటే అర్థము ఏమిటి? ఆ ముందున్నవి ఏమిటి? ముందున్న గురి అని చెప్పబడింది. ఆ గురి ఏమిటి?

నేను నీ జీవిత లక్ష్యం ఏమిటి అని అడిగితే, నీవు నాకు చెప్పగలవా? నిజమైన విశ్వాసము గల చాలా మంది క్రైస్తవులు, తమ క్రైస్తవ జీవితములో వారి లక్ష్యం ఏమిటో సూటిగా చెప్పలేరు. దేవుని వాక్యాన్ని ఎక్కువ తెలుసుకొనడమా? రక్షణ సువార్తను ప్రకటించడమా? నీవు వేగిరపడుచూ ముందుకు సాగుటకు నీ ముందున్న లక్ష్యం ఏమిటి?

భావము స్పష్టంగా అర్థం కాలేదని మీకే తెలియుచున్నది. ఈ నాటి వర్తమానము ద్వారా ఈ వచనముల గురించి ఇంకా కొంత అర్థం చేసుకోగలరని ఆశిస్తున్నాను.

## పాఠం - 1 : సద్దాం హుస్సేన్ :

ఈ మధ్యకాల వార్తాంశముల ద్వారా ఈ వచనాన్ని విశదీకరిస్తాను. చూసే కన్ను, వినే చెవి ఉంటే దేవుడు తరచు మనతో వార్తల ద్వారా మాట్లాడుతాడు.

రెండు వారాల క్రితము, క్రొత్త ఉద్దేశములతో తిరిగి సద్దాంహుస్సేన్ ముందుకు రావడము వార్తలలోని ముఖ్యాంశము. వినాశనకరమైన గల్ఫ్ యుద్ధము తర్వాత కొన్ని పాఠాలు నేర్చుకొని ఉంటాడని మీరు అనుకొనివుండవచ్చు. కాని కాదు. అతను ఏమి నేర్చుకోలేదు. వాయువ్య దిశలోనున్న కుర్దులతో గొడవ పెట్టుకోవాలని కోరుకుంటున్నాడు. దాని కారణంగా మిసైల్ యుద్ధనావలు, యుద్ధ విమానాలు ఇరాక్‌కు విరోధముగా ప్రయోగింపబడుతున్నాయి. అతను ఎప్పుడు నేర్చుకొంటాడు? కాని చాలామంది క్రైస్తవుల మధ్య మనం గమనించేది ఇదే కదా? దేవునికి లోబడక పోవడము వల్ల వాళ్ళు ఒక చెడు అనుభవం తరువాత మరియొకటి వచ్చినా కూడా, వాళ్ళ గత అనుభవం వల్ల ఏమీ పాఠం నేర్చుకున్నట్లు కనపడరు. తిరిగి వాళ్ళు మళ్ళీమళ్ళీ అదే చిక్కులలో పడతారు. ఎందుకు?

**పాఠం - 2 : రాజ దంపతుల విడాకుల కథనం :**

తర్వాత దరిదాపు పది దినాల క్రితము వేరే వార్త. ఈసారి అది బ్రిటిషు రాజకుటుంబమును గురించి, రాకుమారి డయానా, రాజకుమారుడు చార్లెస్ విడాకులకు వ్యవహారరీత్యా ప్రకటన. విడాకుల అనంతరము ఆమె రాజకుమారి కాదు. రాచగౌరవ పిలుపూ ఉండదు. ఆమె మహిమాన్వితమైన స్థానమునుండి, తిరిగి మామూలు పౌరుని స్థానానికి దిగజారింది. పదిహేను సంవత్సరాల దాంపత్యము తర్వాత ఎందుకిలా జరిగింది? మీరు ఆలోచించడానికి ఇది రెండవ ప్రశ్న. ఈ జవాబు ఇరాక్‌ను గురించి అడిగిన ప్రశ్న జవాబు వలె ఉన్నదా?

డయానా, చార్లెస్‌ల వివాహము - కథలలోని గంధర్వ

వివాహములా అయ్యింది. పదిహేను సంవత్సరాల క్రితము అది మొత్తము ప్రపంచాన్నే ఊహాలోకంలో ముంచేసింది. ఒకనాడు ఇంగ్లండు రాణి అవ్వబోయే రాకుమారిగా ఒక సామాన్యు రాలయ్యింది! ప్రతీ కన్య కలలో ఊహించుకునే విధంగా! ఈ రకమైన వివాహము గంధర్వ వివాహ కథలలో మాత్రమే చూస్తాము! అది ఇప్పుడు వాస్తవమయ్యింది. కళ్ళముందు ఈ డయానా రాకుమారి, భవిష్యత్తు రాణి అయ్యింది.

అదే కాక తను వివాహము చేసుకున్నది ఒక వికారమైన ముసలి రాజును కాదు. కాని అందమైన రాకుమారుడు, ఇంగ్లండు భవిష్యత్తు రాజు! అతను నొక్కుల జుట్టుతో, బంగారపు తీగలతో కుట్టబడి, బంగారు గుండీలతో అలంకరింపబడిన యూని ఫారంను ధరించి, ఖడ్గం ప్రక్కన వ్రేలాడుతూ, తీర్చిదిద్దినట్లున్న ముఖ కవళికలున్న రాజకుమారుడు. ప్రతీ అమ్మాయి కనే కల! తర్వాత ఈ దుర్వార్త : విడాకులు. అయినా మనం అంతగా ఆశ్చర్యపడలేదు. కొన్ని సంవత్సరములుగా వాళ్ళిద్దరి వివాహ జీవితంలో సమస్యలు ఉన్నాయని మనకు తెలుసు. కాని వారు విడిపోవుటను గురించి, బాహాటముగా ప్రకటించినప్పుడు, అది చాలా బాధ కలిగించింది. అది వాళ్ళ కల ముగింపు. కాని ఎందుకు? దివ్యమైన భవిష్యత్తున్న ఇద్దరు అందమైన వ్యక్తులు, భూమి మీద నున్న సుఖభోగాలలో ఏది కావాలనుకొంటే అది అనుభవించగలిగిన వాళ్ళ వివాహము, విడిపోవుట వరకు ఎందుకు వచ్చింది? నీవేమనుకుంటున్నావు? స్వభావాల వ్యత్యాసమా? కాని ప్రతీ దంపతులకు స్వభావాల వ్యత్యాసం ఉంటుంది. ఏ ఇద్దరు సంపూర్ణంగా అభిన్నంగా ఉంటారు? స్వభావాలు విభిన్నమని

దంపతులందరూ చివరకు విడిపోతు న్నారా? వాళ్ళకు అన్ని (సాధనాలు) ఉపయుక్తకరమైయున్నా, ప్రజల అభిప్రాయ వత్తిడి ఉన్నా, ఆ రాజదంపతులు వాళ్ళ వివాహబంధాన్ని నిలుపుకోలేక పోయారు.

**పాఠం - 3 సూపర్‌మాన్ :**

వార్తలనుండి చదివిన మూడవ కథకు వద్దాం. ఇది క్రిష్టఫర్ రీవ్స్ గురించి అతను ఎవరో మీకు తెలుసా? అతను సూపర్‌మాన్! కండలు తిరిగి, పొడవుగా, అందంగా ఉన్న అతను బ్లూసూటు వేసుకొని సూపర్ మాన్ లాగ నటించేవాడు. సినిమాలలో ఇతను చేతులు బారుగా చాపి, ఆకాశంలో ఎగిరి వెళ్ళేవాడు. అలా ఎగరగలగడం నీకు ఇష్టం లేదా? సూపర్‌మాన్! కాని ఇప్పుడు రీవ్స్‌కి ఏమైంది? మెడ నుండి క్రింద వరకు చైతన్యం కోల్పోయాడు. గుర్రం మీదనుండి పడడం వలన మెడ విరిగింది. వెన్నెముక గాయాల వలన బాధపడే వారి కొరకు డబ్బును సేకరించడానికి స్టేజి మీదకు అతనిని తెచ్చినప్పుడు, టి.విలో అతనిని చూసి, నేను గుర్తించలేకపోయాను. చాలా దయనీయంగా ఉన్నాడు. అతను చక్రాల తోపుడు కుర్చీలో (వీల్‌ఛైర్) కూర్చుంటే, తోసుకొని త్రిప్పుతున్నారు. తనంతట తాను సరిగ్గా శ్వాస పీల్చుకోలేడు. అందుకని అతనికి గొట్టం ద్వారా ఆక్సిజన్‌ను పంపుతున్నారు. చూడడానికి సినామాల్లోని సూపర్‌మాన్‌లాగ మాత్రం లేడు. దీని నుండి ఏమిపాఠం నేర్చుకొనగలము?

అతని శారీర ధారుఢ్యం వల్ల వచ్చిన ఘనమైన స్థానం నుండి, చక్రాల కుర్చీలో కూర్చునే స్థితికి తగ్గించబడ్డాడు. వీటన్నింటిని గురించి దేవుడు మనకు ఏమి చెప్పబోవుచున్నాడు? క్రిష్టఫర్ రీవ్స్

గురించి కాదు. అతడు తనంతట తాను ఏ చెడూ చెయ్యలేదు. కాని ఇందులో మానవకోటికి ఒక వర్తమానము ఉన్నట్లుంది. మానవుడు ఏదైనా తను చెయ్యగలనని, మరియు ఏ సమస్యనైనా పరిష్కరించగలనని అనుకోవచ్చు. అతనికి దేవుడు ఇంక - అక్కరలేదు. అతడు అన్నీ చేయగలడు. అతడు అన్నిటిలో అధికుడైతే చాలు. ఎప్పుడైతే ఈ ఉన్నతమైన స్థితి వస్తుందో, అప్పుడు దేవుని మరిచిపోగలడు. కాని ఇప్పుడు సూపర్‌మాన్ స్థితిని చూడండి! హాలివుడ్‌లోని నటులందరిలో, ఇది ఎవరికీ సంభవించలేదు. సూపర్‌మాన్‌కి తప్ప. ఇది దాని మట్టుకు అదే సంభవించిందా? సూపర్‌మాన్ వేరేవాళ్ళని రక్షించాడో లేదోకాని - తనని తాను రక్షించుకోలేక పోయాడు.

**స్వార్థం :** నేను, నా అనుస్వార్ధచింతనే మన ప్రధాన సమస్య : పైనున్న వార్తలలోని కధలన్నింటికి పాఠం ఒకటే. ఇది మనిషి ఎదుర్కొనే ప్రధాన సమస్యకు సంబంధించినది. మనిషికి ఆత్మీయ సమస్య 'తానే' మానవునికి ప్రధాన సమస్య ఏమిటి? నీ ప్రధాన సమస్య ఏమిటి? అది తెలుసుకొని, దానిని సంభాళించకపోతే, నీవు ఎప్పటికీ ఆ సమస్యను పరిష్కరించలేవు. ఒక రోగాన్ని నీవు రోగనిర్ధారణ తప్పుగా చేస్తే, తప్పు చికిత్సవల్ల రోగి మరణానికి కూడా కారణం కావచ్చు. పైకి కనబడే రోగలక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తే, అసలు రోగానికి మూలకారణం చికిత్స చేయబడదు. మానవునికి ముఖ్య సమస్య ఏమిటంటే 'నేను,' అదే అహం. ఈ అహంను ఎదుర్కొనడము చాలా కష్టతరము.

సద్దాంహుస్సేన్ కువైట్‌ను ఎందుకు కబళిద్దామని అనుకున్నాడు? తను ఏమి చేద్దామని అనుకొన్నా, దాని వెనుక

ఉద్దేశ్యము తనను తాను ఘనపరచుకొనడము. పురాతన నగరము బాబిలోనును తిరిగి కట్టించాడు. కట్టడానికి వాడబడిన ప్రతి ఇటుకపై పేరు చెక్కించాడు. కువైట్‌ను జయించాడు, అని చరిత్ర పుస్తకాలలోకి ఎక్కుదామనుకొన్నాడు. కువైట్‌కన్నా మించి, అతనికి అధిక తృష్ణ ఉంది. అక్కడ అతనిని ఆపకపోతే, ఇంకా ఏమేమి చేసేవాడో ఎవరికి తెలుసు! కాని ఆ వినాశనకరమైన ఓటమి తరువాత అతనికి బుద్ధి వచ్చిందనుకుంటున్నారా? రాలేదు అహాన్ని ఏదీ ఆపలేదు.

**ఏది నిన్ను చలింపచేస్తుంది?**

కాని అతడు మనందరికన్నా విభిన్నంగా ఉన్నాడా? నీ హృదయంలోనికి ఒకసారి దృష్టించు. నీవు చేసే ప్రతీదాని వెనుక నిన్ను ఆ పని చేయడానికి చలింపజేసేది ఏమిటి? నీవెందుకు ఆపని చేస్తున్నావు? దాని నుండి నీకొచ్చే ఆనందం, నీకు వచ్చే తృప్తి, నీకు వచ్చే ఘనతకొరకు కాదా? మానవుడు తనను తాను తృప్తి పరచుకొనడానికి చలింపబడతాడు.

అద్భుతమైన డయానా, చార్లెస్‌ల వివాహము ఎందుకు విడాకుల పాలయ్యింది? అహముల సంఘర్షణ. ఇద్దరూ వేరేవాళ్ళ కొరకు సర్దుకోరు. అందుకే అక్కడ వివాహబంధం తెగిపోయింది. అహముల సంఘర్షణ వివాహాన్ని ధ్వంసం చేసింది.

మనకు ఎదురునిలిచే వాటిని జయించడానికి శక్తికొరకు వాంఛిస్తాము. అందుకే సూపర్‌మాన్ (ఊహ) అందరికీ అంత నచ్చుతుంది. తర్వాత మనకేది సరియైనది అనిపించితే అది చేస్తాము. వాళ్ళు ఆలోచించిదే సరి; నాయకులు తప్పు అనుకొనే

కొంతమంది వలన, సంఘములో కూడా విబేధాలు వస్తాయి. వాళ్ళు వేరేవాళ్ళకన్నా ఆత్మీయంగా ఉన్నతులని, దానివలన వాళ్ళు చెప్పేది సరి అని, సంఘనాయకులు అనుకుంటారు. నేను అనే భావన చాల మోసమైనది. చక్కని మాటల వెనుక మన నిజ ఉద్దేశాలు దాగివుంటాయి. అదే ఎక్కువ భయపడవలసిన విషయము. ఆత్మీయ జీవితానికి అది జడిపించేది మాత్రమే కాదు, కాని చాలా వినాశదాయకము. ఆత్మీయంగా నేను అనుభవమున్న వాడిని కాబట్టి, మీరేమి చెయ్యాలో కొన్ని చెప్పాలని అనుకొంటున్నాను. ఉదాహరణకు ఒక అబ్బాయి వచ్చి, ఒక అమ్మాయితో “నీవు నన్ను పెండ్లి చేసుకుంటున్నావు. ఎందుకంటే అది దేవుని చిత్తమని నాకు తెలిసినది. దేవునిలో నీకన్నా నేను విశ్వాస జీవితంలో ఎక్కువకాలం నుండి ఉన్నాను. కాబట్టి నీకంటే దేవుని చిత్తం నాకు బాగా తెలుస్తుంది”. అని అనవచ్చు. ఈ రకంగా జరిగిన రెండు దృష్టాంతాలు నాకు స్వయంగా తెలుసు. క్రైస్తవుడు తన కిష్టమైనవి చేస్తాడు. కాని అది చెయ్యడానికి, దేవుని పేరు వాడుకుంటాడు. ఇలా చెయ్యడము చాలా దుర్మా ర్గము. కాని దురదృష్టవశాత్తు సంఘంలో సామాన్యంగా జరిగేది ఇదే.

**మనకు గర్వకారణమైనవి వదిలివేయుట :**

అయితే ఇది వాక్యభాగం ఫిలిప్పీ 3:13-15కు ఎలా సమన్వయమౌతుంది? “వెనుకున్నవి మరచి” అని వాక్యము చెప్పుతున్నప్పుడు దాని అర్థం ఏమిటి? పౌలు మనల్ని ఏది చెయ్యమని ప్రోద్బలం చేశాడో అదే సద్దాం హుస్సేన్ కూడా, కువైట్ కొరకు చేసిన యుద్ధంలో నేర్చుకొన్న పాఠాన్ని మరచి, తన ఘనత కొరకు ముందుకు వేగిర పడుతున్నాడు అని అనుకోవచ్చా?

పౌలు ఏ సందర్భములో అలా చెప్పుతున్నాడో అర్థం చేసికొనడం ముఖ్యం. మనం చరిత్రనుండి నేర్చుకొన్న పాఠాలను మర్చిపోవాలని చెప్పలేదు. గతంలో మనము దేనికి ముఖ్య విలువ ఇస్తున్నామో వాటిని మర్చిపోవలసిన అవసరం ఉంది. అంతకు ముందు ఏవి తను వాంఛించాడో, అవి ఇప్పుడు తనకు అంత ముఖ్యము కాదు. దానికి బదులు ఇప్పుడు అతను వెదకునది క్రీస్తును తెలిసికొనుట. దానికితోడు క్రీస్తును తెలిసికొనుటకు వేరేవన్నీ వెనుక వదిలేయాలి, 'నేను' అన్న తన అహానికి చెందినవి. అతను ఒక పరిసయ్యుడు (ఫిలిప్పీ 3:5, అపొ.కా. 23:6). ఈనాడు పరిసయ్యుడు అంటే అంత మంచిగా అనుకోరేమో గాని ఆకాలములో పరిసయ్యుడంటే చాలా ఘనమైన సంగతి. హెబ్రీయుల సంతానమైన హెబ్రీయుడనని, శుద్ధ తెగకు చెందిన వాడినని అతను చెప్పాడు. ఈ మంచి విషయాలన్నీ అతడు ఇప్పుడు పెంటతో సమముగా ఎంచాడు. ఒకప్పుడు ఇది అతనికి గర్వకారణము కాని ఇప్పుడు అవి అతను పట్టించుకొనడు.

మన సంగతేమిటి? మన కుటుంబ అంతస్థు, పెంపకము మంచిదని అనుకొంటున్నామా? మనకున్న డిగ్రీలు మనకు గర్వకారణమా? ఇవన్నీ మనకు స్వగర్వాన్ని కలుగజేస్తాయి. కనుక వీటిని వెనుక వదిలేయాలి. నేను మీకు చెప్పేదేమిటంటే, గర్వాన్ని మించి ప్రమాదకరమైనది వేరేది లేదు. కొంచెం గర్వం చోటుచేసుకున్నా అది మన హృదయాన్ని అపవిత్రం చేస్తుంది. కొన్నిసార్లు ఎంత విజ్ఞాపన చేసినా దేవుడు ఆ ప్రార్థన వినడు. హృదయశుద్ధి గలవారు దేవుని చూచెదరని గుర్తు తెచ్చుకోండి. అందుకే కొందరు ఎప్పుడు దేవుని సన్నిధిని అనుభవిస్తారు.

కొంతమందికి అది సాధ్యం కాదు. వ్యత్యాసము ఎక్కడుంది? మొదటిరకం 'నేను' అన్నదానిని జయించి, నిరంతరము ఆ విషయములో అప్రమత్తంగా ఉంటాడు. రెండవ రకం అహానికి బానిసలు.

**బాప్తిస్మము ఆత్మీయ జీవితానికి ఆరంభం :**

ఆత్మీయ జీవితముకు ఇది పరమరహస్యం. అందుకే పౌలు ఇలా చెప్పాడు, ప్రతీ సంపూర్ణ క్రైస్తవుడు అనుకొనేది ఏమిటంటే, అహానికి సంబంధించినవన్నీ వెనుక వదిలి, వాటిని మరిచిపోయాను. ఇప్పుడు దేవునికి సంబంధించిన వాటికొరకు వేగిరపడుచున్నాను అని నీ మనస్సులోనూ అదే ఉన్నట్లయితే, ప్రార్థన చెయ్యి. దేవుడు జవాబిస్తాడు. ఆయన ప్రార్థనకు జవాబిస్తాడని నా దేవుని మీద నాకు పూర్తి నమ్మిక. చాలాకాలం నుండి ఉన్న అనుభవం వల్ల ఇలా చెప్పగలుగుతున్నాను. క్రీ.శ. 1953లో దేవునిలోకి వచ్చాక, గత 43 సంవత్సరాలలో ఒక ప్రార్థనకన్నా, ఆయననుండి జవాబు రాలేదు అనడానికి లేదు. కొన్నిసార్లు ఆయన నుండి సమాధానము కొరకు, కొంత వేచి ఉండాల్సి వచ్చింది. తప్పనిసరిగా ఆయన నుండి సమాధానము వస్తుంది. కొన్నిసార్లు నా నోటి నుండి ప్రార్థన మాటల రూపంలో బయటకు రాకముందే సమాధానం చాలా శీఘ్రంగా వస్తుంది. నేనడగకమునుపే ఆయన నాకు జవాబిచ్చిన సందర్భాలున్నాయి. నేను అడుగకముందే నాకు అవసరమైనది నన్ను చేరు కొన్నప్పుడు నేను దిగ్భ్రమ చెందాను. అదే యెషయా చెప్పినది. "వారు వేడుకొనక మునుపు నేను ఉత్తరమిచ్చెదను." (యెషయా 65:24).

**బాప్తిస్మము అంటే వివరణ :** బాప్తిస్మమును పొందడమంటే

ఆ క్షణం నుండి నీ వెనుకనున్నవి, అంటే 'నేను' అన్న అహంకారానికి సంబంధించినవన్నీ, నీ స్వార్ధాపేక్ష, స్వార్ధముతో కూడిన గర్వము మరచి పోవడమన్న మాట. నీవు బాప్తిస్మము కొరకు నీళ్ళలోకి వెళ్ళినప్పుడు నీగతం గతించిపోయింది. క్రీస్తుతో మరణించడమంటే అర్ధం ఏమిటి? దాని అర్ధము గతము గతించిందని. మరణము నుండి తిరిగి లేచుట అంటే ఏమిటి? నీవు నూతన మార్గములో సాగుచున్నావని అర్ధము. నీ జీవితము నూతనమగుటకు, ఇప్పుడు నీ నుండి నీవు విముక్తి పొందావు.

**మన గతం నుండి విముక్తి పొందుట :**

మనం గతంలో మోసిన భారాలను మర్చిపోవలసిన అవసరముంది. వాస్తవానికి, గతంలో ఇతరులు నీకు అన్యాయముగా కీడు చేసినది, గుర్తుకు వస్తే, అది తరచు నిన్ను గాయపరుస్తుంది. నీవు వాళ్ళను క్షమించాలి. నీ గతము నీ మెడకు ఒక గుదిబండ కాకూడదు. నేను చేసే పనిలో చాలామందికి నేను ఆలోచన చెప్పవలసి వచ్చేది. చాలామంది వాళ్ళ గతం నుండి, పెద్దభారాలు మోస్తూ బ్రతకడం గమనించాను. ఉక్కిరిబిక్కిరి చేసే ఈ గుదిబండను మెడకు తగిలించుకుని నీవు ముందుకు సాగలేవు.

నీ గతమునుండి నిన్ను విముక్తుడను చెయ్యాలని యేసు కోరుకొనుచున్నాడు. అందుకే వచనములో రెండుభాగాలు వున్నాయి. నీ గతం నుండి నీవు విడుదల పొందవలెను. అప్పుడు నీవు ముందుకు సాగగలవు.

'మరచిపోవుట' క్రియ మూలభాషయందు, వర్తమాన కాలంలో వుంది. అంటే నీవు మరచిపోతూనే ఉండాలి. అలాగే

ముందుకు సాగుటకు, శక్తిఅంతటితో ప్రయత్నిస్తూనే ఉండాలి. ఇదీ వర్తమానకాలములో ఉన్నది. గ్రీకు భాషలో 'ముందున్న వాటికొరకు వేగిరపడుచూ'.... 'పరుగెత్తుచున్నాను' అను అర్థం వచ్చు పదములకు చాలా తీవ్రత ఉంది. ఇది సూక్ష్మంగా చెప్పాలంటే శిష్యరికములో ఒక భాగము. శిష్యరికమంటే వెంబడించుట. క్రీస్తు ముందు - నేను వెనుక. అంటే వెనుక నున్నది ఏమిటి? నేను, నేనేది మర్చిపోవాలి? నన్ను నేను. అది నీవు చేయగలిగితే, స్వతంత్రత అంటే ఏమిటో నీకు తెలుస్తుంది. వేరే మాటలలో చెప్పాలంటే, నీ వెనుకనున్నవి మర్చిపోవాలి - అంటే నిన్ను నీవు మర్చిపోవాలి. లేకపోతే శిష్యరికము అసాధ్యము. ఆ తరువాత నీవు క్రీస్తును పోలి ఉండుటకు, క్రీస్తు వైపు ముందుకు సాగు.

**స్వార్థాలోచనలో నిమగ్నమై యుండుట :**

విపరీతమైన మానసిక ఆందోళనలకు లోనైన వాళ్ళతో మాట్లాడినప్పుడు వాళ్ళలో ముఖ్యంగా ఈ లక్షణాలను గమనించాను. వాళ్ళ బ్రతుకు వాళ్లమయమే. వాళ్ళు వాళ్ళకే బందీ అయివున్నారు. మానసిక రోగానికి లక్షణము, వాళ్ళు స్వగతంలో బ్రతుకుతారు. వాళ్ళ స్వార్థధాటికి లొంగిపోయి వుంటారు. నీ స్థితి ఎలాగుంది ఇప్పుడు? మనము ఈ కొలబద్దతో చూస్తే, చాలామంది ఈ మానసిక ఆందోళనలు కల్గివుంటారు. కాకపోతే అది మానసిక వత్తిడిగా మారి వుండదు. కాని అందులో దించవచ్చు.

అలాటి మనుష్యులతో నీవు మాట్లాడినప్పుడు, వాళ్ళెప్పుడు వాళ్ళ గురించే మాట్లాడుతూ ఉంటారు. వాళ్ళనుండి వాళ్ళు తప్పించుకోలేరు. దాని పర్యవసానముగా చివరకు వాళ్ళకు

స్నేహితులే ఉండరు. ఒంటరివారైపోతారు. తమ గురించే చెప్పుకొనే వాళ్ళతో ఎవరు మాట్లాడాలనుకొంటారు? చాలామంది ఇలా తమ గురించే నిండి వుంటారు. తెలివిగా వాళ్ళ గురించి మాట్లాడరు కాని వాళ్ళపని గురించి, వాళ్ళ ఇష్టాలు, అయిష్టాలు, వాళ్ళ అభిరుచులు గురించి మాట్లాడతారు. వాళ్ళ దేశపు ఘనతను గురించి మాట్లాడేటప్పుడు కూడా, అది వాళ్ళ వ్యక్తిగత ఘనతగా అన్వయించుకొంటారు, మాటలలో దొరకకుండా తెలివిగా అలా చెప్పుకున్నా, వాళ్ళు పూర్తిగా వాళ్ళతోనే నింపబడియున్నారని గమనించగలము. మా సంఘములో ఒకామె, తన సమస్యలతో నా దగ్గరకు వచ్చింది. నేను 'ఇలాగ', నేను 'అలాగ' అంటూ ఎప్పుడూ ఇలాగే అందరితో మాట్లాడేది. ఆమె తోటి ఉద్యోగులు చాలామంది ఆమెకు సహాయం చెయ్యడానికి ప్రయత్నం చేసారు. కాని ఉపయోగం లేకపోయింది. ఆమె అలాగే మాట్లాడుతూనే ఉండేది. ఎందుకంటే తను ద్వేషించే తన సమస్యల గురించి మాట్లాడడము ఆమెకు యిష్టం. ఈ ప్రేమ - ద్వేషాల సంబంధము, తన గురించే తనకుండడము ఇక్కడ చూస్తాము. చివరకు ఆమె తోటి ఉద్యోగులందరు, ఆమెకు సహాయం చేసే ప్రయత్నం మానేశారు. అప్పుడు ఆమె నా దగ్గరకు వచ్చింది.

నేను చెప్పాను, సరే, నీ జటిలమైన సమస్య నుండి బయటపడాలంటే, నేను చెప్పేది నీవు ఖచ్చితముగా పాటించాలి. ఈ క్షణం నుండి నీవు నీ గురించి మాట్లాడకూడదు. నీవు నీ గురించి ఎవరితోను కనీసం నీ భర్తతో కూడా మాట్లాడబోవడం లేదు.

ఆమె నోరు తెరచి ఆశ్చర్యపోయింది. 'నాగురించి నేను

మాట్లాడకుండా ఎలా బ్రతుకగలను? " అని. ఏమి జరిగిందో మీకు తెలుసా? తనను గురించి తను మాట్లాడడము మానేసాక, ఆమె స్వస్థపడింది. తననుండి తను విడుదల పొందింది. తనను గురించి తను మరచిపోవడము నేర్చుకుంది. అప్పటి నుండి ఆమె అదే అనుసరించి, చాలాశ్రేష్టమైన వ్యక్తిగా మారింది. ఒకప్పుడు, ఆమె ఎప్పుడూ తన గురించే మాట్లాడుతూ ఉండడము వల్ల, ఎవ్వరూ ఆమెతో మాట్లాడడానికి ఇష్టపడలేదు. కాని ఇప్పుడు ఆమెకు ఇతరుల గురించి అక్కర ఉంది.

**దేవా! నన్ను నీ అగ్నితో మండింపచేయి.**

గ్రీకు భాషలో ముందుకు సాగడానికి అనే పదానికి చాలా తీవ్రత ఉన్నది, అని ముందు భాగములో చెప్పాను కదా. అటువంటి ముందుకు సాగటము క్రైస్తవులలో కనపడడము అరుదు. చాలా కొద్దిమంది క్రైస్తవులు ఈ రకమైన తీవ్రత కలిగియుంటారు. ఆ రకమైన అసాధారణము ఇతరులను ఆకర్షిస్తుంది.

ఆఫ్రికాఖండము అన్వేషిస్తూ వెళ్ళిన దేవుని సేవకుడు ప్రఖ్యాత డేవిడ్‌లివింగ్‌స్టన్ ఒకసారి తన డైరీలో ఇలా వ్రాసుకున్నాడు, "నాకు అసాధారణమైన బుద్ధికుశలత లేదు కాని ఒక అసాధారణ క్రైస్తవుడిగా ఉండాలని ఈ రోజు నిర్ణయించుకొనుచున్నాను" నేను అసాధారణ క్రైస్తవునిగా ఉండటానికి దేవుని కృపద్వారా నిర్ణయింపబడినది, అని మనమందరమూ అనాలని నేను ఆశిస్తున్నాను. అది ఒక అర్థవంతమైన జీవితగమ్యము.

ఈ దినము బాప్తిస్మము తీసుకొనిన వాళ్ళకు, నేను చెప్పేదేమిటంటే దేవుడు మిమ్ములను ఆయన అగ్నితో

మండింపచేయును గాక. అంధకారములో ఆయన వెలుగును ప్రకాశించండి. క్రైస్తవునిగా దేవునికొరకు నీవు గుర్తింపబడలేకపోతే, నీ క్రైస్తవ్యానికి అర్థం లేదు.

అది దేవుని కొరకు మన పిలుపు. అగ్నితో మండని సాధారణ క్రైస్తవులతో సంఘము ఇప్పటికే పూర్తిగా నిండివుంది. ఎవరో వెస్లీగారిని 'మీ ప్రసంగరహస్యము ఏమిటి?' అని అడిగారట. దానికి ఆయన జవాబు, 'నేను ఆయన కొరకు మండు చున్నాను. జన సమూహము నేను మండడాన్ని చూడడానికి వస్తారు'. ఇక్కడ మనము 'ముందుకు సాగడము' అన్న మాట యొక్క తీవ్రతని చూడగలము. తను దేనికొరకు జీవిస్తున్నాడో తెలిసిన వ్యక్తిని, అక్కడ మనము చూడగలము.

ప్రభువు మీ ప్రతి ఒక్కరిని ఒక ఆత్మీయ జ్వాలగా చేయాలని నేను ప్రార్థిస్తున్నాను. మీ ప్రతీ ఒక్కరూ, దేనికొరకు జీవిస్తున్నారో తెలిసికొనాలని నేను ప్రార్థిస్తున్నాను. నిన్ను నీవు మరచి, నీ పూర్ణహృదయముతో, ఆయనను పోలియుండుటకు ముందుకు సాగాలి. అప్పటివరకు నీ జీవితగమ్యము ఏమిటో నీకు తెలియదు.

ప్రసంగము 5

# దేవుడినే స్నేహితునిగా కలిగియుండుట

దేవుడు మన స్నేహితుడా? సాధారణముగా ఆయనతో స్నేహానికి మన ప్రత్యాయం : మనం శ్రమలలో చిక్కుకున్నప్పుడు ఆ క్లిష్ట పరిస్థితుల నుండి ఆయన మనలను విడుదల చేస్తాడు. కష్టసమయములలో మనలను రక్షించేది ఆయనే. మనలో ఎంతోమంది ఆయనతో స్నేహం అంటే - జీవన మరణ సమస్యలలో 'ప్రభువా! నాకు సహాయము చేయుమని ఎలుగెత్తి పిలవడమే' అని అనుకుంటాము.

దేవుడు మనుష్యుల జీవితాలలో జోక్యం కలుగజేసుకొని సహాయం చేస్తాడు. ఈ మధ్య 'వ్యక్తిగత సాక్ష్యాల సేకరణ'లో కూడా ఇదే చదివాను. మధ్య పశ్చిమ అమెరికా సం.రాష్ట్రములో ఒక క్రైస్తవ మతగురువు గురించి చదివాను. అనారోగ్యంతో మంచాన పడివున్న తన తల్లికి పరిచర్య చెయ్యడానికి, ఆమత గురువు భార్య, తల్లి ఉన్న ఊరుకి వెళ్ళింది; అత్తగారిని, భార్యను పరామర్శించడానికి ఆయన ప్రతివారము పదిహేడు గంటలు ప్రయాణం చెయ్యాల్సి వచ్చింది. తన విధులన్నీ నిర్వర్తించి, కారు లేక బస్సు పట్టుకొని ప్రయాణం చేసేటప్పటికి, ఆయన చాలా అలిసిపోయేవాడు.

ఈ సమయంలో ఒక స్నేహితుడు సహాయం చెయ్యడానికి

ముందుకు వచ్చాడు. ఆయన సంఘములోని ఒక వ్యవసాయదారుడు (రైతు), పొలములో మొక్కలకు మందు చల్లడానికి వాడే చిన్న తరహా విమానములో గురువు గారిని దింపడానికి ముందుకు వచ్చాడు; కాని ఆరోజే తూర్పు వైపుకు విమానము వెళ్ళుతున్నప్పుడు, మేఘాలు దట్టంగా కమ్ముకొని రావడము వాళ్ళు గమనించారు. మందులు చల్లడానికి మాత్రమే ఉపయోగించే ఆ చిన్న విమానంలో, రాడారు ఉపకరణము లేదు. అందువల్ల దగ్గరున్న మాప్‌లో జాగ్రత్తగా చూస్తూ, విమానాన్ని నడపాల్సి వచ్చింది. దట్టంగా ఉన్న మేఘాల వల్ల, వాళ్ళకి ఎక్కడికి వెళుతున్నారో, వాళ్ళకే కనపడకుండా వుంది. వాళ్ళు దిక్సూచి, రేడియో కాంటాక్టు మీదే ఆధారపడవల్సి వచ్చింది.

కాలం కలిసిరానప్పుడు అన్నీ అడ్డం తిరుగుతాయి. వెళ్ళాల్సిన గమ్యానికి సగం దూరం కూడా రాలేదు. వాళ్ళ రేడియో సరిగా పనిచేయడం లేదు. అత్యవసరముగా విమానం దిగడానికి, దగ్గరలోనున్న విమానాశ్రయాన్ని, సూచనలు అడగాలని నిర్ణయించుకున్నారు. కాని వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల, ఆ విమానాశ్రయం కంట్రోలు శిబిరంకూడా, రన్‌వేను చూడలేకపోయింది. వాళ్ళు, అక్కడ విమానం క్రిందకు దిగడానికి నిరాకరించి, వేరే విమానాశ్రయానికి ప్రయత్నం చెయ్యమని సలహా యిచ్చారు. ఈ సమయానికి వాళ్ళు తీవ్రంగా ప్రార్థన చేస్తున్నారు.

రేడియో పనిచెయ్యడము ఆగిపోయింది. ఇంధనం తరిగి పోతుంది. విమానంను దించడము తప్పనిసరి, వేరే మార్గము లేదు. దిక్సూచి మీదే ఆధారపడి, ఉజ్జాయింపుగా విమానాశ్రయము

ఎక్కడుంటుందని అంచనా వేస్తూ, అటువైపు పైలట్ విమానాన్ని నడిపాడు. మేఘాల మధ్య ఎక్కడైనా ఖాళీ కనపడితే, దానిలోనుండి విమానాశ్రయాన్ని చూడగలమేమోనని, ఆశతో, మతగురువు గారిని చూస్తుండమని పైలట్ కోరాడు. పరిస్థితి దారుణంగా, నిరాశాజనకంగా ఉంది. రాడారు లేకుండా, సూచనలు లేకుండా, ఎదుట వున్నవి స్పష్టంగా కనపడని సమయంలో, విమానాన్ని దించడము చావుని ఎదుర్కొనడమే.

ఆ సమయంలో ఆఖరి ప్రయత్నంగా రేడియోను ఆన్ చేసాడు. రేడియోనుండి స్వరం వినపడగానే, వాళ్ళకి ప్రాణం లేచి వచ్చింది. అవతల నుండి ఉత్సాహ పూరితమైన స్వరం, "నేను మీరు చెప్పేది వినగలుగుతున్నాను. నేను చెప్పే సూచనలను మాత్రము అనుసరించండి. విమానాన్ని కొంచెం దిగువకు తీసుకురండి. ఇప్పుడు కొంచెం ఎడమప్రక్కకు... విమానం రెక్కలను కదపకుండా నిశ్చలనం చెయ్యండి..."చివరకు నేలకు చాలా చేరువగా వచ్చి, రన్‌వేను స్పష్టంగా చూడగలిగారు. విమానము నేలమీదకు దిగాక వాళ్ళకు ఎంత హాయిగా, సంతోషంగా ఉందో! వాళ్ళు చావును తప్పించుకున్నారు.

తర్వాత వాళ్ళు, క్షేమంగా విమానం దిగడానికి ఇచ్చిన ప్రశస్తమైన సూచనలకు, ధన్యవాదాలు చెప్పడానికి, కంట్రోలు శిబిరానికి వెళ్ళారు. అక్కడ వాళ్ళు చెప్పిన సమాధానానికి వీళ్ళ వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

కంట్రోలు శిబిరంలో ఇలా అన్నారు, "మేము ఏమీ హెచ్చరికలు ఇవ్వలేదే. మీరు ఉత్తర కారొలినా పైన ఉన్నప్పుడే మీతో రేడియో కాంటాక్టు పోయింది. అప్పటినుండి మీతో మాకు

కాంటాక్టు లేదు.'' వాళ్ళిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు. మరి ఈ సూచనలు ఇచ్చినదెవరు? వాళ్ళకి అర్థం అయ్యింది, వాళ్ళు విన్నది మానవస్వరం కాదని.

దేవుడు ఆపత్కాల స్నేహితుడు. వేరే ఎవ్వరూ వాళ్ళకు ఆ సూచనలు ఇవ్వలేదు. ఇది ఆ మతగురువు స్వయంగా చెప్పిన సాక్ష్యం. దేవునితో నడిచేవారికి, ఈ రకంగా అవసరతలో దేవుడు జోక్యం చేసుకొని, సహాయం చెయ్యడం మామూలే. ఎవరైతే దేవునితో నడువరో, వాళ్ళకి ఈరకమైన అనుభవాలు చాలా ఆశ్చర్యకరమైనవి. నమ్మశక్యము కానివి.

మంచి సమరయుని ఉపమానము గుర్తుకు తెచ్చుకోండి. ప్రభువైన యేసు ఆ ఉపమానాన్ని బోధించారంటే, ఆయన అలాగే చేస్తాడు. నీవు అలాంటి నిరాశా పరిస్థితిలో ఉంటే, యేసుప్రభువు నీకు సహాయం చెయ్యడా? నీవు మనస్ఫూర్తిగా ఆయనను పిలిస్తే, ఆయన చేస్తాడు. మనలను రక్షించడానికి అవసరమైనది, ఏమైనా సరే - అది రేడియో ద్వారా మాట్లాడడమే అవ్వవచ్చు లేదా విమానాశ్రయానికి క్షేమముగా చేర్చడమే కావచ్చు - ఏదైనా ఆయన చేస్తాడు.

### ఎటువంటి స్నేహితుల కొరకు దేవుడు ఎదురు చూస్తున్నాడు?

ఇక్కడ విషయము మనము అవసరంలో ఉంటే యేసుప్రభువు వచ్చి సహాయం చేస్తాడా లేదా అనేది కాదు. అసలు సంగతేమిటంటే, ఆయన సహాయం చేస్తే, అది ఆయనతో స్నేహాన్ని స్థిరపరుస్తుందా? లేదా? అని. ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న. ఈరోజు అదే ప్రశ్న మీ ముందుంచుతున్నాను.

మళ్ళీ మంచి సమరయుని గురించి ఆలోచిద్దాము. ఎరికోకి వెళ్ళేదారిలో, ఒక మనుష్యుడు దొంగలచేతిలో చిక్కాడు. దొంగలు చావు దెబ్బలు కొట్టి, అతని దగ్గరున్న సొమ్మంతా దోచుకొని పోయారు. ఆ తర్వాత సమరయుడు ఆ దారిలో వస్తూ, తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చూసి, జాలిపడి, తనకు ప్రమాదకరమైనా కూడా, అతనికి సహాయం చెయ్యడానికి ఆగాడు. అతనిని లేవదీసి, గాడిద మీద కూర్చుండబెట్టుకొని, అతనికి కావలసిన పరామరికకు, దగ్గరలోనున్న పూటకూళ్ళ యింటికి తోడ్కొని వెళ్ళాడు. కావలసిన ఖర్చు మొత్తము సొమ్మును చెల్లించాడు. ఇప్పుడు మనం అడుగవలసిన ప్రశ్న ఏమిటంటే, దొంగలపాలిట పడిన అతను, తరువాత సమరయుని స్నేహితుడు అయ్యాడా? లేదా?

ఆ సంఘటన వాళ్ళ వ్యక్తిగత పరిచయం స్నేహం లేకుండానే ముగిసిందా? గాయపడిన వ్యక్తికి స్పృహవచ్చాక, తనను ఒక సమరయుడు రక్షించాడు అని తెలిసికొనిన తరువాత, (తనను ఆ త్రోవప్రక్కనే వదిలి వెళితే గాయాలనుండి రక్తం కారి, చివరకు మరణించే వాడే.) ఆసమరయుడు ఎవరో, కనుగొనడానికి ప్రయత్నం చేసాడా? అతను అలాటి ప్రయత్నం చేయకుండా ఊరుకొని ఉంటే, అతడు ఒక మంచి స్నేహితుని పోగొట్టుకొంటాడు. సమరయుడు తనను కనుగొనడానికి వీలుగా కొన్ని ఆనవాళ్ళు వదిలి వెళ్ళాడు. తను తిరిగి వచ్చినప్పుడు, గాయాలకు వైద్యం చెయ్యడానికి తను యిచ్చిన రొక్కానికన్నా ఎక్కువ ఖర్చయితే, ఆపైకం కడతానని, ఆ పూటకూళ్ళ యింటి యజమానికి చెప్పి వెళ్ళాడు. ఇక్కడ సమరయుడు ఎరికోకు, ఎప్పుడో ఒకప్పుడు కాక, తరచు ప్రయాణం చేసేవాడని మనం గమనించవచ్చు.

గాయపడి, సమరయునిచే రక్షించబడిన యూదుడు, స్నేహిం చెయ్యాలనుకుంటే, పూటకూళ్ళ యింటి యజమానిని, సమరయుని చిరునామా కొరకు గాని, లేదా తన చిరునామా సమరయుని కిచ్చి, తనను కలవమని చెప్పమని, గాని అడిగియుండవచ్చు.

మనము దేవుని వాడుకొనుట దేవుని దయను అనుభవించి, ఆయనతో కలిగిన అనుభవాన్ని గాఢమైన స్నేహంగా మార్చుకొనాలని అనుకునే వాళ్ళు ఎంతమంది ఉన్నారు? నేను చైనాలో ఉన్నప్పుడు ఆయన రక్షణ కృపను అనుభవించాను. ఎప్పుడు నన్ను ఆయన జీవన మరణ సందిగ్ధ పరిస్థితిలోనుండి విమోచించాడో, అప్పుడు నేను ఆయనను నా అద్భుతమైన స్నేహితునిగా గ్రహించాను. ఆనాటినుండి ఆయనతో స్నేహం కొనసాగిస్తూనే ఉన్నాను.

కాని చాలామంది క్రైస్తవులు అలా చెయ్యకపోవడం నేను గమనించాను. దేవునితో వాళ్ళ సంబంధం ఎప్పుడూ మంచి సమరయుని స్థితిలోనే సంతృప్తి చెందుతారు. అంతకు మించి, వాళ్ల జీవితాలలో దేవుడు జోక్యం చేసుకోవడము వాళ్ళకక్కరలేదు. నాకు దేవుడు అవసరమైనప్పుడు ఆయనను నేను పిలుస్తాను. కాని నాకు దేవుడు అవసరము లేనప్పుడు ఆయన నాకు దూరంగా ఉండాలి. దానిని ఏమనాలి? అవసరమైనప్పుడు దేవుడిని వాడుకొనడమన్నమాట. దేవుడి యెడల ఇలా ప్రవర్తిస్తే నీవు ఏనాడు దేవుని స్నేహితుడవని అవ్వలేవని వాక్యానుధారంగా మీకు ఈరోజు స్పష్టంగా చెప్పుతున్నాను.

**దేవునితో స్నేహం చేయుట నీమీద ఆధారపడివుంది :**

నీవు దేవుని స్నేహితుడివా? నిజానికి ఇది ఆయన మీద

ఆధారపడలేదు. ఇది, నీవు ఆయనతో స్నేహానికి ఇష్టపడుతున్నావా? లేదా? అన్నదానిమీద ఆధారపడి వుంది.

నీవు స్నేహం చెయ్యాలని అనుకుంటే కొన్ని ముఖ్యమైన షరతులు ఉన్నాయి. ఈ రకమైన స్నేహం షరతులు లేనిదికాదు. ఒక షరతు చాలా స్పష్టం : ఈ స్నేహం నీవు కొనసాగిస్తావా? అది నీకు చాలా ముఖ్యమైనదా? "నేను క్లిష్ట పరిస్థితిలో చిక్కుకున్నప్పుడు, ఆయన వచ్చి, అందులో నుండి నన్ను రక్షించేంత వరకు ఆయన నాకు తెలిసియుంటే చాలు". అనే చాలామంది క్రైస్తవులవలె నీవు తృప్తిచెంది ఉన్నావా? కొన్నిసార్లు నిజముగా ఆయనతో మనకు అంతకన్న ఎక్కువ అవసరము పడుతుంది. ఏ వృత్తిని ఎంపిక చేసుకోవాలి, ఏ ఉద్యోగానికి వినతి పత్రం వ్రాయాలి తెలిసికొనుటకు, లేక ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు రక్షణకొరకు దేవుడు అవసరమౌతాడు. అంటే దేవుడు ఉచిత భవిష్యవాణి, ఉచిత జీవన భీమా, ఉచిత రక్షకభటుల కావలి ఇవ్వడానికి మాత్రమేనా? చీకటి దారిలో నడిచేటప్పుడు అకస్మాత్తుగా దేవుడు గుర్తుకువస్తాడు. అదే కొన్ని నిముషాలక్రితము రహదారిలో నడిచేటప్పుడు నీ ఆలోచనలోనే ఆయన లేడు. అది మన నిజస్వరూపం కాదా?

మనం దేవుడిని వాడుకొంటాము. స్నేహితుడు వాడుకొనడం కొరకేనా? మనదృష్టిలో స్నేహం అంటే అదేనా? ఒక విషయం చెప్పుతాను : దేవుడు ఈ రకమైన స్నేహితులను కోరుకొనడం లేదు. నీకు అలాటి స్నేహితుడు కావాలా? మీకు నేను స్పష్టంగా చెప్పేదేమిటంటే, దేవునితో మీ సంబధము ఇలాగుంటే నీవు దేవుడిని స్నేహితుడిగా పొందలేవు. ఆయనను

నీవు స్వప్రయోజనాలకు వాడుకొంటున్నావు. దేవుడు దానికి అంగీకరిస్తే, నీవు ఇంకా స్వార్ధపరుడుగా అవ్వడాన్కి ఆయన దోహదము చేసినట్లవుతుంది. అందుకే అన్యులకన్నా కొంతమంది క్రైస్తవులు ఎక్కువ స్వార్ధపరులు. కొంతమంది క్రైస్తవులని అసహ్యించుకొనే అన్యులను నేను తప్పుపట్టను. ఈ స్వార్ధ క్రైస్తవులు అనుకొంటారు ఎప్పుడే అవసరమైనా, అత్యవసర సహాయం చేసేవాడు దేవుడు అని. అది సిగ్గుకరమైనదని నేను అంగీకరిస్తున్నాను.

రెండురకాల స్నేహం ఉంది. దైవవాక్య నిర్వచనాలను బట్టి మొదటి రకాన్ని స్నేహమనే అనకూడదు. ఈ రకమైన స్నేహం స్వలాభాపేక్షతో కూడినది. వేరే వ్యక్తి నుండి తనకేమి అవసరమో అది అపేక్షించడము. ఈ రకమైన స్నేహం యవ్వనస్తుల మధ్య ఎక్కువ చూస్తాము. నీవంటే ప్రేమ అనడానికి అర్ధం, నీనుండి నేను ఏమి పొందుతున్నానో అది నాకిష్టం. నీకున్నది నాకిష్టం. అది నాకు కావాలి. ఒకవేళ నీవు ఐశ్వర్యవంతుడవైతే, నీకు స్నేహితులు కొల్లలు. నీ ధనాన్ని బట్టి వాళ్ళు నిన్ను ప్రేమిస్తున్నారు. నీ డబ్బు అంతా అయిపోయేదాకా వేచిచూడు నీకే ఆశ్చర్యం వేస్తుంది, నీ స్నేహితులు ఎలా మాయమయ్యారని. అమ్మాయి, అబ్బాయిల మధ్యస్నేహం కూడా చాలావరకు ఇలాగే చూస్తున్నాము. వాళ్ళ శరీరేచ్ఛలను తీర్చుకొనడానికి వేరే వ్యక్తులను వాడుకొనే వాళ్ళున్నారు. వాళ్ళు కోరుకున్నది పొందాక, ఆ వ్యక్తి వాళ్ళకింక అవసరం లేదు. ప్రేమ అంటే ఇదేనా? దొంగల ముఠాలో కూడా ఇదేరకమైన స్నేహం ఉంటుంది. ఒక్కళ్ళే వెళ్ళి, బ్యాంకును దోపిడీ చెయ్యలేరు. కనుక నలుగురైదుగురు కలిసి ఒక ముఠా ఏర్పడతారు.

దోచుకున్న దోపిడీ పంచుకునే దగ్గర తేడా వస్తే, దోపిడీ అయ్యాక వేరే అందరినీ చంపి, ఒకడు దానిని హస్తగతం చేసుకొంటాడు. సానుకూలంగా పనిచేసుకొనే సంబంధమున్నంతవరకు స్నేహాన్ని కలిగి ఉంటారు. ఇదంతా స్వార్థాపేక్ష. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే మనకు ఆ రకమైన స్నేహితుడు అక్కరలేదు. కాని మనం అలాటి స్నేహితులుగా ఉండగోరుతున్నాము. ఇది ఎందుకంటే మనిషిలో స్వార్థం జీర్ణించు కొని ఉంది. దేవుడు నీతో స్నేహానికి, నీవు ఆ స్థితిలో ఉన్నప్పుడు ఒప్పుకుంటే, ఆయన నీ స్వార్థాన్ని ప్రోత్సహించి నట్లవుతుంది. అందుకే ఎప్పుడు ఒక క్రైస్తవుడు ఇంకా స్వార్థపరుడుగా బ్రతుకుతున్నాడో, అతను గాని ఆమెగాని, దేవుడు మన ప్రార్థనలకు జవాబివ్వడం లేదని తెలుసుకుంటారు. దేవుని సాన్నిహిత్యం దొరకదు. దేవుడు స్వార్థాన్ని ప్రోత్సహించడు. మానవుడు వర్ణించలేనంత స్వార్థపరుడు.

**క్రింద కొన్ని వార్తాంశాలను చూద్దాము :**

కొన్ని రోజుల క్రితం ఒక వార్తాపత్రికలో నేను చూసిన ముఖ్యాంశము : "టెక్సాస్‌లో టి.వి. ఫుట్‌బాల్ మాచ్‌పై తండ్రి చేతిలో కుమారుని మరణం''. టి.వి. ప్రోగ్రాము పై తన కొడుకును చంపాడు! డల్లాస్ కౌబాయిస్ ఆటను టి.వి.లో అతను చూస్తున్నాడు. మూడు సంవత్సరాలున్న అతని కొడుకు, తన యిష్టం వచ్చినట్లు గోల చేస్తున్నాడు. ఆ సమయంలో తల్లి యింట్లోలేదు. కొడుకు చేసే గోలలో ఫుట్‌బాల్ మాచ్‌ను రంజింపలేక, కొడుకును పొట్టలో చాలాసార్లు గుద్దాడు. ఎంత గట్టిగా గుద్దాడంటే పిల్లవాడి కాలేయము, మూత్రపిండాలు చిట్లిపోయాయి. కొడుకు మరణించాడు. తల్లిదండ్రులు పిల్లలను

ప్రేమిస్తారు. అవును కదా! నిజానికి ఈ తండ్రి కొడుకుకు తన పేరే పెట్టుకున్నాడు వేరే మాటలలో చెప్పాలంటే, కొడుకు అచ్చు గుద్దినట్లు తనను పోలి ఉండాలని కోరుకున్నాడు. తండ్రి కొడుకుల పేరులు ఒకటే. తండ్రి సీనియరు. కొడుకు జూనియరు, కాని ఈ రకమైన తండ్రితో ఉన్న పోలిక ఆ పిల్లవాడిని చావునుండి రక్షించలేకపోయింది.

ఇంకొక వార్తాపత్రికలో ఆశ్చర్యకరమైన వార్తని చూసాను ఇద్దరు కొడుకులు తల్లిని పస్తుపెట్టి చంపారని. ఎందుకలా చేసారో వివరించలేదు. ఆమెను గొలుసులతో కట్టేసి, తిండిపెట్టకుండా చంపారు. పోలీసులు ఆమె శవాన్ని కనుగొన్నప్పుడు, ఆమె 1.63 మీటర్ల పొడుగు, 59:5 పౌండుల (దగ్గర దగ్గర 27 కిలోల) బరువు ఉన్నాది. పోలీసులకు ఈ విషయము ఎలా తెలిసింది అంటే, చనిపోకముందు ఆమె సహాయము కొరకు ఫోను చేసింది. పోలీసులు అక్కడకు చేరుకొని, ఆమెను ఆసుపత్రికి తరలించినా కూడా, ఆమెను రక్షించలేకపోయారు. ఆమె రక్షించలేనంత, ఆహారములేక కృశించిపోయింది. ఆమె ఇద్దరు కుమారుల వయస్సు 25సం॥లు, 22 సం॥లు. ఇద్దరినీ హత్యకేసులో ముద్దాయిలక్రింద అరెస్టు చేసారు.

వార్తాపత్రికలో ఇంకొక కథనం : టి.విలో ఒక అమ్మాయి తనతో పెండ్లి నిశ్చయమైన యువకుని ఎవరో ఇద్దరు వ్యక్తులు హత్యచేసారని అభియోగించింది. ఆమె ఏడుస్తూ ఆ ఇద్దరు హంతకులను పట్టుకొనడానికి సహాయం కొరకు విజ్ఞాపన చేసింది. ఆమె చెప్పిన కథనం ఏమిటంటే వాళ్ళిద్దరూ రాత్రి భోజనం ముగించి, కారులో ప్రశాంతంగా ఉన్న వీధికి వెళ్ళారు. కాని వాళ్ళు

దారిలో వేరేకారుని దాటి ముందుకు వెళ్ళినప్పుడు, వేరే కారులోనున్న వ్యక్తులు మండిపడి, వచ్చి తనకు పెండ్లి నిశ్చయమైన వ్యక్తిని పొడిచి చంపారని చెప్పింది. పోలీసులు కేసుని పరిశోధించినప్పుడు ఆమే హత్యచేసిందని కనుగొన్నారు. పైన చెప్పిన కధనం అంతా ఆమె కల్పించిన కట్టుకథ. కారణాలు వ్రాయలేదు కాని ఆమె తనంతటతానే, తన పెండ్లి నిశ్చయమైన వ్యక్తిని హత్యచేసింది.

అదే వార్తపత్రికలోని వేరే జరిగిన కథ : తన నిగ్రహం కోల్పోయిన డాక్టరు తన భార్యని మూడవ అంతస్తు కిటికీలో నుండి క్రిందకు విసిరేసాడు. చాలా విషమ పరిస్థితిలో ఆమెను ఆసుపత్రికి తరలించారు. వార్తా పత్రికలో రిపోర్టు వ్రాసే సమయానికి ఆమె బ్రతికే అవకాశం ఎంతవరకుందో, తెలియలేదు.

ఈ విషయాలన్నీ మీకు అర్ధమైనవా? తండ్రి కుమారుని చంపడము, కొడుకు తల్లిని చంపడము, పెండ్లి చేసుకోబోయే వ్యక్తిని ఆ అమ్మాయి, చంపడము, భార్యను చంపప్రయత్నము చేసిన భర్త, వీటన్నిటిని బట్టి చూస్తే, మనం ఎలాటి లోకంలో జీవిస్తున్నాము? ఇవన్నీ విపరీతమైన సంఘటనలు అవ్వవచ్చు కాని మానవ హృదయపు విపరీత స్వార్థబుద్ధిని ప్రతిబింబింప చేస్తున్నాయి.

అన్ని రకాల సంబంధబాంధవ్యాలలో నమ్మకద్రోహం లేక విశ్వాస ఘాతకం, ఆశ్చర్యం కలిగించే మోతాదులలో ఉంది. ప్రతీ సంఘటన నన్ను ఆలోచింపచేసింది. మానవులు ఒకరితొనొకరు నిజమైన స్నేహబంధాన్ని పెంచుకోగలగడము సాధ్యమా? అతిదగ్గర బంధుత్వము ఉన్న సంబంధాలే స్నేహానికి బలమైన ఆధారము కాకపోతే, మరి యింక దేనివల్ల ఇది సాధ్యము?

స్వత్యాగముతో వున్న స్నేహము అనేది అసలుందా? యదార్ధమైన ప్రేమ మనుష్యులు కలిగివుండడము సాధ్యమా? అది సాధ్యం కాకపోతే ఇక్కడ స్నేహం గురించి మాట్లాడడము కాలయాపనే అవుతుంది.

స్నేహము సాధ్యము అవకముందు, మానవస్వభావము సమూలంగా రూపాంతరము పొందాలని మీరు అర్థం చేసుకోవాలి. స్వలాభాపేక్షతో నున్న సంబంధములో ప్రతీవాళ్ళు ఇతరులనుండి తీసుకోవాలని అనుకుంటారు. చివరికి ఎవరికీ తగినంత ఉండదు. స్వత్యాగముతోనున్న సంబంధములో ఒకరికొరకు ఇచ్చుకొనుట వలన, ఇద్దరికీ కావలసిన దానికన్నా ఎక్కువ ఉంటుంది. ఇది వినడానికి సరియైనదిగా ఉన్నా, చేతల్లో పెట్టేటప్పుడు మనకు కొంచెం కష్టం అనిపించవచ్చు. కాని ఈ రకమైన స్నేహాన్ని దేవుడు కోరుకుం టున్నాడు. ఇదే ఈ నాటి నా సందేశములో ముఖ్యాంశము. మీరు నేను చెప్పినదంతా మర్చిపోయినా కూడా, ఈ ఒక్క విషయం గుర్తుంచుకొనడము అవసరము, దేవుడు స్నేహితుల కొరకు ఎదురు చూస్తున్నాడు. కొన్ని వేల సంవత్సరాల చరిత్రలో ఆయనకు చాలా తక్కువ మంది స్నేహితులు దొరికారు అందువల్లే పాత నిబంధన గ్రంథంలో దేవుని స్నేహితులు అని పిలువబడినవారి సంఖ్య వ్రేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. ఆయనకు స్నేహితులుగా ఉదాహరణకు అబ్రహాము, నోవహు మోషేలను చెప్పుకోవచ్చు. కొద్దిమంది ప్రవక్తలను కలిపినా కూడా జాబితాలో ఎక్కువ మంది ఉండరు. ఈ కొంతమంది దేవుని స్నేహితులుగా పేర్కొనబడ్డారు. అంటే దేవుడు వాళ్ళ స్నేహితుడుగా ఉన్నాడన్నమాట. కొన్ని శతాబ్దాలు గడిచినా చాలా కొంతమందే ఆ కోవకు చెందారు. ఇదే నన్ను దుః

ఖపరచింది కూడా. చర్చినిండా మనుష్యులుండి, వాళ్ళు దేవునికి స్నేహితులు కానప్పుడు ఏమి ఉపయోగము? ఈ దినము, ఇక్కడ ఎంతమంది దేవుని స్నేహితులున్నారు? ఎంతమంది ఆయన స్నేహితుడిగా ఉండడానికి కావలసినవి నెరవేర్చారు?

ఆయనతో స్నేహానికి ఏమి కావలసియున్నాయో, ఆయన మనకి స్పష్టీకరించాడు. ప్రతీక్రైస్తవుడికి ఆ మాటలు ఎంత బాగా తెలిసివుంటాయంటే, ఆ వచనాలు నేను చెప్పాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు లూకా 10:27 లేక మార్కు 12:30,31 "నీవు నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణబలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను. ..." కాబట్టి దేవునితో స్నేహం చెయ్యడానికి వున్న షరతులు నీకు తెలియదని ఎప్పుడూ అనవద్దు. అందులో ఏదైనా కొరత వుంటే ఆయనకు అంగీకారము కాదు.

మనం ఆయనతో స్నేహం చెయ్యాలంటే ఒకే ఒక మార్గముందని ఆయన స్పష్టీకరించాడు. ఆయన స్నేహితులము కాకపోతే, మన అవసరతలో ఆయన వచ్చి మనకు సహాయము చెయ్యడని కాదు. ఆయనకు కావలసినవి మనము నెరవేర్చకపోయినా కూడా, ఆయన కృప ఎంతగొప్పదంటే, ఆయన మనకు సహాయం చేస్తాడు. అది ఆయన దయ. ఆయన నీకు సహాయం చేస్తాడు అన్న నిజాన్నిబట్టి, నీవు ఆయన స్నేహితుడవని కాదు. ఆయనదో స్నేహం చెయ్యకపోతే, నీవు జీవితంలో అన్నీ పోగొట్టుకొంటావు. ఆయన స్నేహం మనకు దొరుకుతుంది కాని పాతనిబంధన లేక క్రొత్త నిబంధన దేనిలోనైనా ఆయన ఇది స్పష్టపరిచాడు. "నీవు నా స్నేహితుడుగా ఉండగోరితే, నీకున్న

సమస్తముతో నన్ను ప్రేమించాలి.''

అంటే మనలో ఏదో మార్పురావాలి 'నేను' నా అనేవి చావాలి. ఆ స్వార్థం మనలో నుండి పోవాలి. కొంత మంది గతంలో మన స్వార్థాన్ని త్యజించినా, అంటే తమని తాము ఉపేక్షించుకొన్నా, సంవత్సరాలు గడిచేటప్పటికి, వాళ్ళు తిరిగి వెనుకబడి, మొదటి స్థితికి వచ్చేస్తారు. కొంతమంది ప్రభువు సేవ పిలుపుకి చేయవలసిన త్యాగము అధికమని, ఆయనతో స్నేహం చెయ్యడము చాలా అలవికానిదని, తిరిగి లోకంవైపు తిరుగుతారు. దురదృష్టవశాత్తు అలాగే జరుగుతుంది. సంపూర్ణ సేవకు సమర్పించుకున్న మేము కూడా ఇదే రీతిలో శోధించబడ్డాము. దీనికొరకు పోగొట్టుకొనేది, చాలా ఎక్కువ అనిపించి బాధపడ్డాము. కొంచెము వెనుకకు తగ్గుదామా అనిపిస్తుంది. అప్పుడు హెబ్రీ 10:38లో చెప్పబడిన మాటలు వినబడుతాయి ''.... అతడు వెనుక తీసిన యెడల, అతనియందు నా ఆత్మకు సంతోషముండదు.''

స్నేహం గురించి మాట్లాడాలంటే, బైబిలులో చెప్పబడిన మంచి స్నేహానికి ప్రతీక యోనాతాను దావీదు స్నేహము. ప్రతీ క్రైస్తవుడు, వాక్యములో ఈ ఏడు అధ్యాయాలు 1సమూయేలు 18-24 వరకు, జాగ్రత్తగా చదవాలని కోరుతున్నాను. ఈ వాక్యభాగాన్ని ప్రతీక్రైస్తవుడు మళ్ళీమళ్ళీ చదవాలి. ఒకరికొరకు అర్పించుకొనే, ప్రేమతో కట్టుబడిన వాళ్ళిదరి స్నేహం సాహేతుకం. ఇది క్రైస్తవునికి, యేసుప్రభువుకు మధ్య ఉండవలసిన స్నేహానికి మాదిరి, అని ఇంకా చాలా మంది క్రైస్తవులు గ్రహించడము లేదు. అందుకే బైబిలులో చాలా అధ్యాయాలు దీనికొరకు కేటాయించబడినవి. ఇది అసాధారణమైన స్నేహము అని మాత్రమే

కాదు గాని దేవునితో ప్రతి క్రైస్తవునికి ఉండవలసిన సాధారణమైన స్నేహము

**వివరణ :**

యేసుప్రభువు చెప్పిన శిష్యత్వానికి షరతులు నీవు చదివితే ద్వితియో 6:5లో కూడా అదే చెప్పబడిందని నీవు గ్రహిస్తావు "నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణశక్తితోను, నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. అదే యేసుప్రభువు చెప్పినప్పుడు మత్తయి 10:37లో "తండ్రినైనను, తల్లినైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు." ఆయన కచ్చితంగా అదే చెప్పుతున్నాడు. "నీకున్న సమస్తముతో నన్ను ప్రేమింపవలెను అంటే నా కన్నా నీవు ఎవరినన్నా ఎక్కువ ప్రేమించినచో, నీవు నన్ను ప్రేమించనే లేదు."

యోనాతాను, దావీదు మధ్య నున్న స్నేహబంధాన్ని చూసినప్పుడు, యోనాతాను తన తండ్రిని దావీదుకంటే ఎక్కువగా ప్రేమించలేదని గమనించగలవు. తన సొంత తండ్రికన్నా, దావీదు దేవుని చేత అభిషేకించబడినవాడని యోనాతాను గుర్తించాడు.

మెస్సియా అనే హెబ్రీపదము, 'క్రీస్తు' అనే గ్రీకుపదము రెండిటి అర్థము'అభిషక్తుడు' యేసు దావీదు వంశస్థుడు. క్రీస్తు పూర్వికుడిగా, దావీదు మెస్సియా అయిన క్రీస్తుకు గుర్తుగా తరచూ ఉపయోగించబడ్డాడు. అంటే దావీదుతో స్నేహబంధం ఏర్పరచుకొనడము, యోనాతాను క్రీస్తుతో స్నేహబంధము ఏర్పరచు కొనడమే.

"కుమారునినైనను, కుమార్తెనైనను నా కంటె ఎక్కువగా

ప్రేమించువాడు నాకు పాత్రుడు కాదు.'' (మత్తయి 10:37) అని ప్రభువు చెప్పాడు. యోనాతాను తన కుమారులను, కుమార్తెలను దావీదుకంటె ఎక్కువగా ప్రేమించలేదు. నిజానికి దావీదుకంటే ఎక్కువగా తనని తాను కూడా ప్రేమించుకోలేదు. దావీదును ప్రేమించుటలో తనని తాను ఉపేక్షించుకొన్నాడు. ఎలా? రాజైన సౌలు కుమారునిగా యోనాతాను యువరాజు, సింహాసనానికి వారసుడు. కాని దావీదును సమర్థిస్తూ, తన సింహాసన వారసత్వాన్ని తన కుమారుల, మనుమల సింహాసన వారసత్వాన్ని దావీదుకు ఇచ్చివేసాడు.

మత్తయి 10:38లో యేసుచెప్పిన దేమనగా "లేక సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపని వాడు నాకు పాత్రుడుకాడు'' దావీదుతో స్నేహము యోనాతానుకు భారమైన సిలువ, ఎందుకంటే అది అతని తండ్రికి కుమారుని మీద ఉగ్రతను రేకెత్తించింది. దావీదు పట్ల అతనికి ఉన్న నమ్మకత్వానికి, స్నేహానికి అతని తండ్రి మండిపడి, రకరకాల పేరులతో అతనిని దూషించాడు. నిజానికి, యోనాతాను దావీదును ప్రేమించుట వల్ల, తన తండ్రి విపరీతమైన కోపానికి గురియై, తన ప్రాణానికే ముప్పు తెచ్చుకున్నాడు. ఒక తండ్రి కుమారుని చంపిన సంఘటన మనం చదివాము గదా! అలాగే సౌలుకు కూడా తన కొడుకు సమస్య అయ్యాడు. అలాగే కొడుకును చంపేసే వాడు కూడా.

మత్తయి 16:24లో యేసు చెప్పినదేమనగా "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తనను తాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని, నన్ను వెంబడింపవలెను.'' యోనాతాను చేసినది అదే, తను సింహాసనానికి వారసుడైనా కూడా, దావీదును

వెంబడించాలని కోరుకున్నాడు. అతను దావీదుతో చెప్పినదేమనగా, నీవు రాజువైనప్పుడు నీ కుడి చేతివైపు నాకు స్థలమిమ్ము. తానే రాజవ్వవలసినవాడు, కాని దావీదుకు తన సింహాసనాన్ని సంతోషంగా ఇచ్చివేసాడు. నీ కుడిచేతి దగ్గర నీ సేవకునిగా, నిన్ను వెంబడించువానిగా ఉండెదను. ఇది తనను తాను అర్పించుకొనే స్నేహము. ఇంతకు ముందు తన కవచము, కత్తి, శిరస్త్రాణము తీసుకొని దావీదుకు ఇచ్చివేసాడు. అలా ఇవ్వడం అంటే, ఒక యుద్ధవీరుడు తనకి అతి ముఖ్యమైనవి, ప్రియమైనవి తన స్నేహితునికి ఇచ్చివేసాడు. యోనాతాను కవచము, ఒక మామూలు సైనికుని కవచము కాదు. అది యువరాజు కవచము. తన కవచము ఇచ్చి వేయుటలో, అతను తన స్థానాన్ని దావీదుకు ఇచ్చివేసాడు.

లూకా **9:26**లో యేసు చెప్పినదేమనగా “నన్ను గూర్చియు, నా మాటలను గూర్చియు సిగ్గుపడువాడెవడో వాని గూర్చి మనుష్యకుమారుడు తనకును, తన తండ్రికిని పరిశుద్ధ దూతలకును కలిగియున్న మహిమతో వచ్చునప్పుడు సిగ్గుపడును. దావీదును బట్టి యోనాతాను సిగ్గుపడలేదు. దావీదును బట్టి సిగ్గుపడకుండా ఉండడము అంతే సులభంకాదు. దావీదు ఆ సమయంలో ఏ గుర్తింపులేని న్యాయరక్షణ నుండి బహిష్కరింపబడిన వ్యక్తి. నిజానికి సౌలుదృష్టిలో అతను ఒక ద్రోహి. సౌలు పలుమారులు తనను చంపడానికి ప్రయత్నించడం వల్ల, దావీదు తన ప్రాణరక్షణ కొరకు పారిపోవుచుండెను. దావీదు బహిష్కరింపబడిన వ్యక్తి అయినా కూడా, తన తండ్రి యెదుట దావీదు పట్ల తన ప్రేమను తెలియజేయుటకు యోనాతాను సిగ్గుపడలేదు. ఇంకా దావీదును తిరిగి చేర్చుకొమ్మని, తన తండ్రిని ఒప్పించడానికి ప్రయత్నం చేసాడు.

ఇక్కడ మనము శిష్యత్వానికి ఒక మాదిరైన, తనను తాను అర్పించుకొనే స్నేహాన్ని చూస్తున్నాము. ఇది మాటలతో చెప్పనలవి కానంత అందమైనది.

ఇదే బైబిలులోని యోనాతాను - దావీదు కథ ఆవశ్యకత. 'తన్ను తాను ఉపేక్షించుకొనుట', 'తన సిలువ ఎత్తికొనుట' వీటికి సంబంధించిన బైబిలు పదజాలమును అర్థము చేసికొనుట నీకు కష్టమైనప్పుడు, దావీదు - యోనాతాను కథని దృష్టించు. అది యేసుప్రభువు మనకు చెప్తుతున్నట్లు, "నీవు నా శిష్యుడవు కావాలనుకొంటే యోనాతాను నుండి నేర్చుకో. యోనాతాను వలె ఉండాలని కోరుకోకపోతే, నా శిష్యుడగుటకు నీవు అనర్హుడవు."

దేవదూతలకు దొరకని భాగ్యం - దేవుడు మన స్నేహాన్ని కోరుకొంటున్నాడు. కాని స్నేహం ఇచ్చిపుచ్చుకొనేది. ఆయన శిష్యుడవడమంటే, ఆయన స్నేహితుడు అవ్వడమే. యోనాతాను వలె, తన స్వార్థాన్ని ప్రక్కనపెట్టి తనకున్న సమస్తముతో యేసుని ప్రేమించే వ్యక్తితో మాత్రమే, ఆయన స్నేహం చేయగోరుతున్నాడు. అప్పుడే నీవు నూతన కరమైన జీవితంలో అడుగుపెడతావు. నీవు సాధ్యము అని అనుకొన్న దేవునితో స్నేహం ప్రారంభం అవుతుంది. నీవు చరిత్రలో అతి అరుదైన దేవుని స్నేహితుల జాబితాలో ఉంటావు. ఆత్మసబంధమైన గగనంలో అబ్రహాము, మోషేలవలె నీవూ ఒక తారవై వెలుగుతావు.



క్రీస్తు వాగ్ధానము చేసిన సమృద్ధి జీవమంటే,
లౌకిక సంపత్తు, మంచి ఆరోగ్యము, కష్టాల నుండి శీఘ్ర విముక్తి అని చాలా మంది అనుకొంటారు. క్లుప్తంగా చెప్పాలంటే, జీవితము ముళ్ళేలేని ఒక పూలబాట అవుతుందని అనుకొంటారు.

కాని ప్రభువైన యేసు వాగ్ధానము చేసినది అదేనా?
క్రీస్తు వాగ్ధానము చేసిన జీవితము, ఈ అల్ప అపేక్షలకన్నా చాలా మహిమకరమైనది. ఈ పుస్తకము చదివి తెలుసుకోండి.

## రెవ. ఎరిక్. హెచ్.హెచ్. చాంగ్‌గారు



క్రీ.శ. 1934వ సంవత్సరములో చైనా దేశములోని షాంగైలో జన్మించారు. కొన్ని, కొన్ని వరుసక్రమములో జరిగిన సంఘటనలలో క్రీస్తుని అనుభవపూర్వకముగా తెలిసికొని, క్రీ.శ. 1953వ సం॥లో ఆయనను తన ప్రభువుగా అంగీకరించారు. క్రీ.శ. 1956వ సం॥లో ప్రభువు, ఆయన చైనా వదలి వెళ్ళడానికి మార్గం తెరిచారు. ఆయన స్కాట్‌లాండ్‌లోని గ్లాస్‌గో లో బైబిలు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ *(BTI)* లో క్రీ.శ. 1959వ సం॥లో ట్రైనింగ్ ముగించారు. ప్రిన్సిపాల్ ఆండ్రూ మెక్‌బెత్ గారి ప్రేరణతో, ఆయన లండన్ బైబిల్ కాలేజీకి, పై చదువులకు వెళ్ళారు తర్వాత, ఆయన లండన్ విశ్వవిద్యాలయము లో ఆర్ట్స్ అండ్ డివినిటిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత ఆయన లివర్‌పూల్ లో ప్రభుని నడిపింపునిబట్టి సేవ చేయుచున్నప్పుడు, వృద్ధాప్యములో నున్న ఆయన ప్రియస్నేహితుడు రెవ. ఆండ్రూ మెక్ బెత్ ద్వారా పాదిరిగా అభిషేకించ బడ్డారు. కొన్ని సంవత్సరముల తరువాత ఆయన మాస్ట్రియల్ లో పరిచర్యకు ఆహ్వానించబడ్డారు. ప్రభువు ఈ పరిచర్యను  కూడా ఆశీర్వదించారు. క్రీ.శ. 1976వ సం॥లో చాలా చిన్నదైన ఈ సంఘం ఈనాడు 25 సంఘాల సముదాయము అయ్యింది. దేవుని కృపవలన సంఘానికి శిరస్సయిన క్రీస్తు నాయకత్వము క్రింద సంఘాలు పెరుగుతూవున్నాయి.

cdm

రెవ. ఎరిక్ హెచ్.హెచ్. చాంగ్

cdm